www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 30-6-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 75 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: నవమి మ. 12.19 తదుపరి దశమి; నక్షత్రం: రేవతి ఉ. 7.34 తదుపరి అశ్విని; వర్జ్యం: రా. 2.37-4.08; దుర్ముహూర్తం: సా. 5.05-5.57; అమృతఘడియలు: శేషం. 6.48, రా. 11.37-1.05; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగజ్జేత భారత్!



భారత జట్టు కుర్రాళ్ల వి జయనాదం

17 ఏళ్ల తర్వాత టీ20 వరల్డ్‌కప్ టీమిండియా కైవసం



దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం

- దాదాపు మ్యాచ్ చేజారిన దశలో రోహిత్ సేన మ్యాజిక్
- కోహ్లి, అక్షర్, దూబే హీరోలే.. సూపర్ హీరో సూర్యనే
- బౌండరీ లైన్ వద్ద అద్భుత క్యాచ్
- చివరి నాలుగు ఓవర్లలో ప్రత్యర్థిని కట్టడి చేసిన పేసర్లు
- ఒత్తిడిలో చేతులెత్తేసిన సఫారీలు

దక్షిణాఫ్రికా విజయానికి చివరి 24 బంతుల్లో 26 పరుగులు అవసరం! హార్డ్ హిట్టర్లు క్లాసెన్, మిల్లర్ మాంచి ఊపు మీదున్నారు! భారత్ విజయంపై అభిమానులు దాదాపుగా ఆశలు వదిలేసుకున్నారు. కానీ.. అద్భుతం జరిగింది! బుమ్రా, అర్షదీప్, హార్దిక్ సూపర్ బౌలింగ్‌తో చివరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమై.. దక్షిణాఫ్రికా తడబడుతున్న స్థితిలో బౌండరీ లైన్‌పై సూర్యకుమార్ యాదవ్ పట్టిన సూపర్ క్యాచ్ మ్యాచ్‌ను మలుపు తిప్పేసింది. అచ్చంగా 1983 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో వివ్ రిచర్డ్స్ క్యాచ్‌ను కపిల్ వెనక్కి పరుగెడుతూ ఒడిసి పట్టి మ్యాచ్‌ను భారత్‌వైపు లాగేసినట్టే లాగేశాడు! సిక్సర్‌గా వెళుతున్న మిల్లర్ షాట్‌ను బౌండరీ వద్ద లైన్‌కు అటూ ఇటూ దుముకుతూ పట్టేశాడు! అంతే టీ-20 వరల్డ్‌కప్ భారత జట్టు వశమైంది! నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఫైనల్లో 7 పరుగుల తేడాతో సౌతాఫ్రికా జట్టుపై రోహిత్ సేన విజయం సాధించింది. మన జట్టుకు ఇది రెండో టీ-20 వరల్డ్‌కప్పు! 2007లో ధోనీసేన కప్పు సాధించిన 17 ఏళ్లకు రోహిత్ సేన కప్పు ఒడిసిపట్టింది.

10

టీ20 ఫార్మాట్‌కు విరాట్ గుడ్‌బై

- ఫైనల్లో విజయం అనంతరం ప్రకటన
- తుది సమరంలో అద్భుత ఇన్నింగ్స్
- మ్యాన్ ఆఫ్ ది ఫైనల్‌గా కోహ్లి
- బుమ్రా.. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్

చేతలతోనే జవాబు!



..బ్రహ్మాండమైన ప్రజా మద్దతుతో 2018లో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్, 2019లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రజాస్వామ్యానికి పాతరేశారు. ముఖ్యమంత్రులు ఎలా ఉండకూడదో తమ చర్యల ద్వారా భావితరాలకు చెప్పారు.

..తెలంగాణలో కట్టుకథలు, పిట్టకథలతో కేసీఆర్ కాలక్షేపం చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతం బెంగళూరులోని ప్యాలెస్‌లో సేద తీరుతున్నారు. ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత అన్నీ వదిలేసుకుని హిమాలయాలకు వెళ్లాలనిపించిందని నిర్వేదం వ్యక్తంచేశారు. శాసనసభలో తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని సభాపతికి ఒక లేఖ రాసి పడేసి ఆయన బెంగళూరు వెళ్లిపోయారు.

..ప్రతిపక్ష నాయకుడి హోదాను ఆయనకు ప్రజలే ఇవ్వలేదు. ప్రజలు తనను అంతలా ఎందుకు తిరస్కరించారో తెలుసుకొనే ప్రయత్నం చేయకపోగా ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే తాను శాసనసభకు హాజరు కానన్న బెదిరింపులకు తెగబడటం విడ్డూరంగా ఉంది.

..చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి పదిహేను రోజులు మాత్రమే అయింది. అయినా తన ఏలుబడిలో సజావుగా ఉన్న రాష్ట్రంలో ప్రజలు ఇప్పుడు సమస్యలతో అల్లాడిపోతున్నట్టుగా చిత్రించే పనిలో జగన్ రెడ్డి అండ్ కో ఉండటం మరీ రోతగా ఉంది. తమ పాలన నిజంగా అంత గొప్పగా ఉండి ఉంటే వైసీపీకి 11 సీట్లు మాత్రమే ఎందుకు వచ్చినట్టు?

..ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో జగన్ రెడ్డి చాలా బలంగా రుజువు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అనుక్షణం ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. జగన్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పోకడలను, ప్రభుత్వ దుశ్చర్యలను గుర్తుకు తెచ్చుకొని బ్లూ బుక్ రూపొందించుకొని అందుకు అనుగుణంగా ప్రస్తుత మంత్రులు నడుచుకోవాలి.

..గత ప్రభుత్వంలో తమ ఆశలు అడియాశలయ్యాయి కనుకే కనీవినీ ఎరుగని మెజారిటీతో కూటమిని ప్రజలు గెలిపించారు. కుంటుపడిన పోలవరాన్ని తాము ఎలా ముందుకు తీసుకువెళ్లబోతున్నారో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వివరించాల్సిన అవసరం ఉంది. జరిగింది చెప్పడంతో పాటు జరగబోయేది కూడా చెబితేనే శ్వేతపత్రాల విడుదల వల్ల ప్రయోజనం ఉంటుంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



బందరు పోర్టు (ఫైల్)

జగన్ కక్షకు బందరు పోర్టు బలి

రద్దుల పద్దు.. రివర్స్ దందాలతో ప్రాజెక్టు పడక



- అధికారంలోకొస్తూనే నవయుగ కాంట్రాక్టు రద్దు
- రాజకీయ కక్షసాధింపుతో పనులకు బ్రేక్
- కమీషన్ల కోసం ఈపీసీ విధానం తెరపైకి
- పైకిమాత్రం డబ్బులు ఆదా చేస్తామని గొప్పలు
- దేశంలో ఎక్కడా లేనివిధంగా అడ్డగోలు ప్రక్రియ
- నిబంధనలు తుంగలో తొక్కి మేఘకు కాంట్రాక్టు
- 'రివర్స్' పేరిట 275 శాతం అంచనాలు పెంపు
- సముద్ర నిర్మాణాల్లో అనుభవమే లేని మేఘ
- వరుస తప్పిదాలతో నత్తనడకన పనులు

బందరు పోర్టు నిర్మాణం... రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ. 2008లో వైఎస్ఆర్ హయాంలో పోర్టుకు శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈ ప్రాజెక్టులో కదలిక తీసుకొచ్చారు. అవసరమైన భూసేకరణ చేసి, ప్రభుత్వానికి పైసా ఖర్చు కాకుండా పీపీపీ విధానంలో పోర్టు నిర్మించేలా కాంట్రాక్టు అప్పగించారు. ఆ దిశగా పనులు కూడా ప్రారంభించారు. ఇంతలో జగన్ సర్కారు రావడంతో అమరావతి, పోలవరం తరహాలో బందరు పోర్టును కూడా బలి చేసింది. రాజకీయ కక్షసాధింపుతో పాటు కమీషన్ల కోసం నవయుగను తప్పించి, రివర్స్ టెండరింగ్ పేరిట డ్రామాలు ఆడింది. ఏకంగా 275 శాతం అంచనాలు పెంచి, సముద్ర నిర్మాణ పనుల్లో ఏ మాత్రం అనుభవం లేని మేఘకు కాంట్రాక్టు అప్పగించింది. జగన్ సర్కారు తప్పిదాల ఫలితంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పుడు ఈ ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టి పరుగులు పెట్టించడం చంద్రబాబు ప్రభుత్వం ముందున్న సవాల్.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు రాజకీయ కక్ష సాధింపులకు బందరు పోర్టు సమిధగా మారింది. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల కన్నా కాసుల వేటకే ప్రాధాన్యమిచ్చిన గత పాలకులు బందరు పోర్టును కమీషన్ల కామధేనువుగా మార్చేసుకున్నారు. ప్రభుత్వానికి పైసా ఖర్చు కాకుండా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో టీడీపీ ప్రభుత్వంలో

మిగతా 13వ పేజీలో...

పింఛన్ల పండగకు సర్వం సిద్ధం

రూ.3 వేలకు తోడు పెంచిన రూ.వెయ్యి

3 నెలల అదనంతో కలిపి ఒక్కొక్కరికీ రూ.7 వేలు

- రేపే పంపిణీ.. ఒక్కరోజే 65,18,496 మందికీ ఇచ్చేందుకు టార్గెట్
- పకడ్బందీగా ఏర్పాట్లు.. పంపిణీలో నేరుగా పాల్గొననున్న చంద్రబాబు
- రాజధాని పరిధిలోని పెనుమాకలో పింఛను అందించనున్న సీఎం
- సోమవారం ఉదయం ఆరు గంటలకే కార్యక్రమం ప్రారంభం
- మొత్తం రూ.4,399.89 కోట్లు విడుదల చేశాం
- మొదటిరోజే 100% ఇవ్వాలి.. కలెక్టర్లతో వీసీలో సీఎస్ ఆదేశాలు

పింఛన్ల పండగకు సర్వం సిద్ధమైంది. ఇప్పటివరకు అందుతున్న రూ.3 వేలకు అదనంగా పెంచిన రూ. వెయ్యి.. గత మూడు నెలల బకాయి రూ. 3 వేలు.. మొత్తం రూ.7 వేల సొమ్ము! నిజంగానే ప్రతి లబ్ధిదారుకూ ఇది పండగే. జూలై 1 ఉదయాన్నే ప్రతి ఇంటికీ లబ్ధిని అందించేలా చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఒక్కరోజులోనే మొత్తం 65,18,496 మందికీ పింఛను అందించడమే లక్ష్యంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను, ఇతర విభాగాల సిబ్బందిని పెద్దఎత్తున రంగంలోకి దించుతున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో జరిగే పంపిణీలో స్వయంగా ముఖ్యమంత్రే పాల్గొననుండటం విశేషం.



అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 65,18,496 మంది లబ్ధిదారులకు ఇంటివద్దే పింఛన్ల పంపిణీకి సంబంధించి రూ. 4,399.89 కోట్లు విడుదల చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వెల్లడించారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో దీనిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల

మిగతా 13వ పేజీలో...



14

డీఎస్ ఇకలేరు

- కాంగ్రెస్ సీనియర్ నేత గుండెపోటుతో మృతి
- ఉమ్మడి ఏపీలో రెండుసార్లు పీసీసీ చీఫ్
- పార్టీ అధికారంలోకి రావడంలో విశేష కృషి
- తెలంగాణ ఉద్యమ రోజుల్లో ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ చీఫ్‌గా ట్రబుల్ షూటర్ పాత్ర

ఎస్‌బీఐ సారథిగా శ్రీనివాసులుశెట్టి



- అతిపెద్ద బ్యాంకు చైర్మన్‌గా తెలుగోడు! 12
- సిఫారసు చేసిన ఎఫ్ఎస్ఐబీ
- ప్రభుత్వ ఆమోదమే తరువాయి

బిహార్‌కు హోదా ఇవ్వాలి

లేదా ప్రత్యేక ప్యాకేజీ కావాలి: జేడీయూ 2

ఎలిమెంటరీ స్థాయి ఉమ్మడి పరీక్ష రద్దు

విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధం

జగన్ విద్యావిధానాన్ని కొట్టేసిన హైకోర్టు 3

కలెక్టర్ గారి కాలజ్ఞానం!

ఇసుక అక్రమాలు తవ్వేకొద్దీ లీలలు వెలుగులోకి

- రీచ్‌లు తనిఖీ చేయాలని ఫిబ్రవరి 5న ఎన్జీటీ ఆదేశం
- ఫిబ్రవరి 2వ తేదీనే తనిఖీ చేసినట్టుగా
- నాటి తూర్పుగోదావరి కలెక్టర్ మాధవీలతారెడ్డి నివేదిక
- ఎన్జీటీ ఆదేశాలను ముందుగానే ఎలా ఊహించారో?
- ఆ తర్వాత తనిఖీలకు వెళ్లకుండానే నివేదిక
- డ్రెడ్జింగ్ ఇంటర్నల్ మ్యాటరంటూ తేల్చేసే యత్నం
- అక్రమ తవ్వకాలే లేవంటూ ఎన్జీటీకి నివేదిక
- నదిని గుల్లచేశారంటూ ఎంఓఈఎఫ్ స్పష్టీకరణ



మాధవీలతారెడ్డి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కాలం కంటే వేగంగా, కాలాన్ని వెనక్కి నెట్టి పనిచేసే కలెక్టర్లే కాదు... 'కాలజ్ఞానం' తెలిసిన కలెక్టర్లు కూడా ఉన్నారండోయ్..! పై నుంచి ఏ ఆదేశాలు వస్తాయో మూడు రోజులు ముందే ఊహించి అందుకనుగుణంగా పనిచేసేస్తారు..! సామాన్యులే కాదు తోటి ఐఏఎస్‌లూ ఆశ్చర్యపోయేలా జగన్ జమానాలో ఇలాంటి కలెక్టర్లు పనిచేశారు. జగన్ పట్ల వీరభక్తి ప్రదర్శించి 'ఘన కార్యాలు' వెలగబెట్టారు. ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో తవ్వేకొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. గుంటూరు కలెక్టర్‌గా పనిచేసిన వేణుగోపాల్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 14న తనిఖీ చేసి, ఒకరోజు ముందుగానే అంటే... 13వ తేదీన ఎన్జీటీకి నివేదిక సమర్పించి 'కాలమహిమ' ప్రదర్శించారు. అలాగే

మిగతా 13వ పేజీలో...

నైరాశ్యం నుంచి నిర్మాణం దిశగా!

- జగన్ ధ్వంస రచనను సరిచేస్తూ అమరావతిలో నిర్మాణ ప్రక్రియ 13
- ప్రభుత్వ కాంప్లెక్స్ భూములు నోటిఫై.. 1,575 ఎకరాలకు సీఆర్‌డీఏ గెజిట్
- మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం.. రాజధానిపై సర్కారు తొలి అడుగు
- మాస్టర్ ప్లాన్‌కు జగన్ పాలనలో తూట్లు.. గ్రామ ప్రత్యేకాధికారులకు బెదిరింపులు
- ఆ తీర్మానంతో మాస్టర్ ప్లాన్‌కు సవరణలు.. జోన్ రూల్స్ మార్చి ఆర్-5 జోన్ ఏర్పాటు
- రాజధాని విచ్ఛిన్నానికి వైసీపీ కుట్రలు.. ఇప్పుడు మాస్టర్ ప్లాన్ బలోపేతంపై దృష్టి





అయోధ్యలో కుంగిన రామ్‌పథ్!

- రహదారిపై భారీ గుహలను తలపించేలా గోతులు
- వర్షాలకు ఛిద్రమైన రామమందిరానికి వెళ్లే మార్గం
- ఆరుగురు మునిసిపల్ అధికారులపై సస్పెన్షన్ వేటు

లఖ్‌నవూ జూన్ 29: అయోధ్యలో రూ.311 కోట్ల వ్యయంతో నిర్మించిన రామ్‌పథ్ తాజాగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ కుంగిపోతోంది. రామమందిరానికి దారితీసే 14 కిలోమీటర్ల ఈ వలయాకార రహదారిపై ఆలయ గేటుకు అర కిలోమీటరు దూరంలోనే ఒక మీటరు వ్యాసార్థం కలిగిన గొయ్యితో పాటు ఆలయానికి 1.5 కిలోమీటర్ల దూరంలో 6 మీటర్ల వ్యాసార్థంతో మరో రెండు భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక అయోధ్యధామ్ రైల్వేస్టేషన్‌లో నిర్మించిన 40మీటర్ల పొడవైన ప్రహరీ సైతం కుప్పకూలింది. పలు ఇళ్లతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను వాన నీరు ముంచెత్తింది. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసమైందని, ఆలయ నిర్మాణానికి ముందు ఇలాంటి సమస్యలు ఎన్నడూ లేవని స్థానికులు చెబుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం హడావుడిగా నిర్మాణాలు పూర్తిచేయడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. కాగా, పలు ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోయిన నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఈ పనుల కోసం రోడ్లను దిగ్బంధించడంతో యాత్రికులు అవస్థలు పడుతున్నారు. దీనిపై సీరియస్ అయిన యోగి ప్రభుత్వం.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు మునిసిపల్ అధికారులను సస్పెండ్ చేసింది. మరోవైపు భారీ వర్షాలతో రామమందిరం గర్భగుడి పైకప్పు లీకయిందని ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ ఇటీవల ఆరోపించారు. కాగా, అయోధ్య రామమందిరం నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు బీజేపీపై విరుచుకుపడ్డారు. ప్రార్థనా స్థలాలు కూడా బీజేపీకి దోపిడీ వనరులుగా మారాయని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



బిహార్‌కు ప్రత్యేక హోదా

లేదంటే ప్రత్యేక ప్యాకేజీ.. కేంద్రానికి జేడీయూ డిమాండ్

- బిహార్ సీఎం నితీశ్ అధ్యక్షతన పార్టీ జాతీయ కార్యవర్గ భేటీలో తీర్మానం


జేడీయూ జాతీయ కార్యవర్గ భేటీలో నితీశ్‌కుమార్

న్యూఢిల్లీ, జూన్ 29: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో మూడోసారి ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన జనతాదళ్ (యునైటెడ్) పార్టీ తన డిమాండ్లను సాధించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తమ రాష్ట్రం బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని పునరుద్ఘాటిస్తూ కేంద్రాన్ని తాజాగా డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం పార్టీ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసింది. పేపర్ లీక్ కేసుల్లో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే పరీక్షా పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో పటిష్ఠ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఎన్డీఏ ప్రభుత్వంలో జేడీయూ కీలక భాగస్వామిగా మారిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో ఈ పార్టీ 12 సీట్లను గెలుచుకుంది. దీంతో ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో పార్టీ కీలకమైంది. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఈ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వంలో పార్టీ భాగస్వామ్యం నేపథ్యంలో తమ పార్టీ బాధ్యతతోపాటు ప్రజల అంచనాలు కూడా పెరిగిపోయాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ గత ఏడాది బిహార్ కేబినెట్ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి జేడీయూ కీలకంగా మారిన నేపథ్యంలో ఈ డిమాండ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలా ఉండగా.. జేడీయూ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ కుమార్ ఝాను శనివారం నియమించారు. బీజేపీతో ఈయనకు మంచి సంబంధాలున్న నేపథ్యంలో ఆయనకు ఈ పదవి కట్టబెట్టినట్టు తెలుస్తోంది. పార్టీ డిమాండ్లను నెరవేర్చుకోవడంలో ఈయన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు. కాగా ప్రధాని నరేంద్ర మోదీ.. బిహార్‌పై ఎల్లప్పుడూ దృష్టిసారిస్తారని, ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ కోసం పార్టీ చేస్తున్న డిమాండ్ నెరవేరుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్‌ను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇటీవల పట్నా హైకోర్టు కొట్టివేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన జేడీయూ.. రాష్ట్ర చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరింది. దీని వల్ల న్యాయ సమీక్షకు అవకాశం ఉండదని భావిస్తోంది.

బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

బిహార్‌లో మరో బ్రిడ్జి కూలిపోయింది. కేవలం తొమ్మిది రోజుల్లో ఈ రాష్ట్రంలో ఐదు బ్రిడ్జిలు కూలిపోయి రాష్ట్రంలో పనుల నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. బిహార్‌లోని మధువని జిల్లాలో నాలుగు పిల్లర్ల ఓ బ్రిడ్జి భారీ వర్షాలకు శుక్రవారం కూలిపోయింది. నేపాల్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న మాదేపూర్ బ్లాక్‌లో భుతహి నదిపై 75 మీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని రూ.3 కోట్ల ఖర్చుతో 2021 నుంచి నిర్మిస్తున్నారు. భారీ వర్షాలకు నదిలో ప్రవాహం పెరిగి ఓ వైపు పిల్లర్ కొట్టుకుపోవడంతో బ్రిడ్జి కూలిపోయినట్లు బిహార్ ప్రజా పనుల శాఖ అధికారులు చెబుతున్నారు. కూలిన బ్రిడ్జి కనిపించకుండా కాంట్రాక్టర్ టార్పాలిన్ కప్పారు.

'కాబోయే ప్రధాని అఖిలేశ్'!

- లఖ్‌నవూలో హోర్డింగులు

లఖ్‌నవూ, జూన్ 29: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ 'కాబోయే ప్రధాని' అంటూ పోస్టర్లు ఏర్పాటు చేయడం చర్చకు దారి తీసింది. జులై 1న అఖిలేశ్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా కొందరు కార్యకర్తలు 'భావి భారత ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు' అంటూ లఖ్‌నవూ ఎస్పీ కార్యాలయం ముందు శనివారం హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 37 సీట్లల్లో విజయం సాధించి లోక్‌సభలో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన సందర్భాన్ని కూడా గుర్తుచేస్తూ హోర్డింగ్స్‌లో పేర్కొన్నారు. గతేడాది కూడా ఎస్పీ కార్యాలయం ముందు 'కాబోయే ప్రధాని అఖిలేశ్' అంటూ పోస్టర్లను ఏర్పాటు చేయడం ఎస్పీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది.

సైనిక విన్యాసాల్లో అపశ్రుతి.. వరదతో నదిలో మునిగిన టీ-72 ట్యాంక్

- ఒక అధికారి సహా ఐదుగురు జవాన్ల దుర్మరణం

జమ్మూ, జూన్ 29: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో భారత సైన్యం నిర్వహించిన యుద్ధట్యాంక్‌ల విన్యాసంలో అపశ్రుతి చోటుచేసుకుంది. టీ-72 యుద్ధ ట్యాంకుతో బోధి నదిని దాటుతుండగా.. ఆకస్మిక వరద ఉధృతి పెరిగింది. దీంతో ఆ ట్యాంకులో ఉన్న ఓ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో), నలుగురు జవాన్లు దుర్మరణంపాలయ్యారు. ఈ ఘటన వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)కి సమీపంలో.. దౌలత్‌బేగ్ ఓల్డీలోని న్యోమా-చుషల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున టీ-72 యుద్ధ ట్యాంకుతో నదిని దాటుతుండగా.. ఈ ఘటన చోటుచేసుకుందని రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మృతుల్లో డ్రైవర్, గన్‌మన్ సహా.. నలుగురు సైనికులు, ఓ జేసీవో ఉన్నట్లు వివరించింది.

భారీ వర్షాలతో ఢిల్లీలో 11 మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 29: భారీ వర్షాల కారణంగా ఢిల్లీలో 11 మంది మరణించినట్టు అధికారులు ప్రకటించారు. వసంత విహార్‌లో గోడ కూలిన సంఘటనలో ముగ్గురు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు, వర్షాల కారణంగా గుజరాత్‌లోని రాజ్‌కోట్ విమానాశ్రయం బయట ప్రయాణికుల పికప్-డ్రాప్ ప్రాంతంలోని కప్పు కూలిపోయింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం సంభవించలేదు. కాగా, ఢిల్లీలో విమానాశ్రయం పైకప్పు కూలిపడటంతో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా చెన్నైలో 16 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

హరిద్వార్‌లో ఆకస్మిక వరద.. ఉప్పొంగిన నది

హరిద్వార్, జూన్ 29: ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం హరిద్వార్‌లో శనివారం సంభవించిన అనూహ్య వరదలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కుండపోతగా భారీ వర్షం కురియడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరింది. నీరు లేక ఎప్పుడూ ఎండిపోయి కనిపించే సుఖీ నది ఆకస్మికంగా ఉప్పొంగింది. ఎప్పటిలాగానే స్థానికులు తమ వాహనాలను ఆ నది వద్ద నిలిపి ఉంచగా వరదకు అవి కొట్టుకుపోయాయి. అక్కడ పార్కు చేసిన ఉంచిన కార్లు, బస్సులు ఇతర వాహనాలు కొట్టుకుపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

శ్రీనగర్/జమ్మూ, జూన్ 29: హిందువులకు పరమ పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర శనివారం ప్రారంభమైంది. దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి 3900 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో దర్శనమిచ్చే పరమేశ్వరుడి స్వయంభూ మంచు లింగాన్ని తొలిరోజు సుమారు 13 వేల మంది యాత్రికులు దర్శనం చేసుకున్నారు. కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో యాత్ర సాగే దారిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. యాత్రలో పాల్గొంటున్న భక్తులకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 29 నుంచి ఆగస్టు 19 వరకు 52 రోజుల పాటు సాగే యాత్ర కొనసాగనుంది.

చర్మం ద్వారా రక్తంలోకి రసాయనాలు!

న్యూఢిల్లీ, జూన్ 29: సన్‌స్క్రీన్, మాయిశ్చురైజర్, క్లెన్సర్, నెయిల్ పాలిష్, లిప్ స్టిక్ వంటి సౌందర్య ఉత్పత్తులను వాడుతున్నారా.. ఈ సౌందర్య ఉత్పత్తుల్లో ఉండే పీఎఫ్ఏఎస్(పాలీఫ్లోరో ఆల్కైల్ పదార్థాలు) రసాయనాలతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రసాయనాలు మానవ చర్మం ద్వారా రక్తంలోకి కలిసిపోయి అనారోగ్యానికి దారి తీస్తున్నాయని బర్మింగ్‌హమ్ వర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో తేలింది. ఈ రసాయనాలు మానవ శరీరానికి హాని కలిగించవని అనేక అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే, బర్మింగ్‌హమ్ వర్సిటీ అధ్యయనం వాటిని తప్పని తేల్చింది. 17 రకాల పీఎఫ్ఏఎస్ రసాయనాలపై అధ్యయనం చేసిన పరిశోధకులు వాటిల్లో 15 రకాల రసాయనాలు 36 గంటల్లోపు మానవ చర్మం ద్వారా రక్తంలో కలుస్తున్నట్టు గుర్తించారు.

ఆర్మీ, నేవీ అధిపతులుగా ప్రాణ స్నేహితులు


ఉపేంద్ర


దినేశ్

న్యూఢిల్లీ, జూన్ 29: వారిద్దరూ క్లాస్‌మేట్స్.. అంతకుమించి ప్రాణ స్నేహితులు..ప్రస్తుతం సైన్యంలోని రెండు విభాగాలకు అధిపతులుగా వ్యవహరించనున్నారు. ఆర్మీ చీఫ్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టనున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్‌గా మే ఒకటో తేదీన నియమితులైన అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి ఈ అరుదైన రికార్డును నెలకొల్పారు. వారిద్దరు మధ్యప్రదేశ్‌లోని రేవాలో ఉన్న సైనిక్ స్కూల్‌లో 1970 ప్రాంతంలో చేరారు. ఇద్దరు అయిదో తరగతి నుంచి కలిసి చదువుకున్నారు. అప్పటి నుంచి వారి స్నేహ బంధం బలపడుతూ వస్తోంది. రెండు విభాగాల మధ్య సమన్వయానికి వారి స్నేహం ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు

- నలుగురితో ప్రారంభించి లక్షల మందికి సేవలందిస్తున్నాం
- మెడికవర్ ఆలిండియా సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ వెల్లడి


తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మెడికవర్ ఆలిండియా సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ

బాలసముద్రం, జూన్ 29: వరంగల్‌లో 300 పడకలతో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు మెడికవర్ ఆలిండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ తెలిపారు. ఈ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లతోపాటు ఎక్కువ సంఖ్యలో ఐసీయూ బెడ్స్ ఉన్నాయని చెప్పారు. భారత దేశంలో అగ్రగామి మల్టీ నేషనల్ ఆస్పత్రి చైన్‌గా 24 ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 12 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపుపొందిన మెడికవర్.. 24వ ఆస్పత్రిని వరంగల్‌లో శనివారం ప్రారంభించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను మెడికవర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శరత్‌రెడ్డి, హరికృష్ణతో కలిసి డాక్టర్ అనిల్‌కృష్ణ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ ఆస్పత్రి.. లక్షల మందికి వైద్య సేవలందించి కరోనా సమయంలో లక్షలాది మందికి ఉచితంగా వ్యాక్సినేషన్ అందించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికవర్ సేవలను వినియోగించుకోవాలని, రాష్ట్రాన్ని హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మెడికవర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి తాను అభిమానినని, రేవంత్‌రెడ్డి సీఎం కాకముందు అనేక కష్టాలను ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించారని ప్రశంసించారు. ఆయన చేతులమీదుగా మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

యువత ఆగ్రహంతోనే బీజేపీ సీట్లలో కోత

- దళితులు, బీసీలు దూరం
- ఆరెస్సెస్ సమీక్షలో వెల్లడి

లఖ్‌నవూ, జూన్ 29: యువత ఆగ్రహంతో ఉండడం, దళితులు, బీసీలు దూరం కావడం వల్లనే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గినట్టు మాతృ సంస్థ ఆరెస్సెస్ గుర్తించింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ఇక్కడ జరిగిన తూర్పు ప్రాంత పదాధికారుల సమావేశంలో ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో సీట్లు తగ్గడంపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే పాల్గొన్నారు. పేపర్ లీకులు, నిరుద్యోగం కారణంగా యువత ఆగ్రహంతో ఉన్నారని, అది ఎన్నికలపై ప్రభావం చూపిందని సమీక్షలో తేలింది. ఓటు బ్యాంకుగా ఉన్న దళితులు, ఓబీసీలు సమాజ్‌వాదీ పార్టీ-కాంగ్రెస్ కూటమి వైపు మళ్లడం మరో కారణమని గుర్తించారు.

రెండ్రోజుల్లో నీట్-పీజీ తేదీలు: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూన్ 29: నీట్-పీజీ కొత్త షెడ్యూల్‌ను మరో రెండ్రోజుల్లో జాతీయ పరీక్షల బోర్డు (ఎన్‌బీఈ) ప్రకటిస్తుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. హరియాణాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో ప్రధాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మరోవైపు, నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ తాజాగా ఝార్ఖండ్‌లో ఓ హిందీ పత్రిక జర్నలిస్టును అరెస్టు చేసింది. ఇటు గుజరాత్‌లోని ఏడు చోట్ల సీబీఐ సోదాలు జరిపింది. కేసులోని అనుమానితుల నివాసాల్లో ఉదయం నుంచి సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు.


బైడెన్‌పై 'టైమ్' కవర్ పేజీ కలకలం

న్యూయార్క్, జూన్ 29: టైమ్ మేగజైన్ కవర్ పేజీపై ముద్రించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఫొటో కలకలం రేపుతోంది. బైడెన్ నడుచుకుంటూ పేజీ అంచుకు వెళ్లిపోయినట్టు ఉన్న ఆ ఫొటోకు 'భయాందోళన'(పానిక్) అని పైన క్యాప్షన్ పెట్టారు. దీంతో బైడెన్ మానసిక స్థితిని ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.



ఆయన మానసిక స్థితి దిగజారుతోందని, మాటలు తడబడుతున్నాయని, నడక కూడా తడబడుతోందని వస్తున్న అభిప్రాయాలకు ఆ ఫొటో అద్దం పడుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు ట్రంప్‌తో జరిపిన ప్రథమ చర్చలో ఆయన తడబాటుకు గురైన తీరు ఆయన పార్టీ సభ్యులైన డెమోక్రాట్లనూ ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా బైడెన్ స్పందించారు. 'నేను యువకుడిని కాదనే విషయం నాకు తెలుసు. గతంలో నడిచినంత సులువుగా ఇప్పుడు నడవలేనని, చర్చల్లో గతంలో చూపినంత మెలకువ ఇప్పుడు ప్రదర్శించలేనని కూడా నాకు తెలుసు. అయితే, నేను చేయగలనని దృఢంగా, మనస్ఫూర్తిగా నమ్మకం లేకుంటే అసలు దిగేవాడినే కాదు' అని బైడెన్ స్పష్టం చేశారు. తద్వారా పోటీ నుంచి తాను తప్పుకోవడం లేదని స్పష్టం చేశారు. కాగా, అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, బరాక్ ఒబామా సహా పార్టీలోని అనేక మంది సీనియర్లు బైడెన్‌కే తమ మద్దతని స్పష్టం చేశారు.

ఐఎస్ఎస్‌కు ముప్పు!



సమీపంలోని రష్యా పాత ఉపగ్రహం విచ్ఛిన్నం

- కక్ష్యలో తిరుగుతున్న శకలాలు

సునీతా విలియమ్స్ తిరుగు ప్రయాణం కొన్ని నెలలు ఆలస్యమయ్యే అవకాశం

వాషింగ్టన్, జూన్ 29: అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఐఎస్ఎస్) సమీపంలోని ఓ కక్ష్యలో రష్యాకు చెందిన కాలం చెల్లిన ఓ పాత ఉపగ్రహం విచ్ఛిన్నమై వందకుపైగా శకలాలుగా విడిపోయింది. వీటితో ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో, ఐఎస్ఎస్‌లో ఉన్న సునీతా విలియమ్స్‌తోపాటు ఇతర వ్యోమగాములను గంటపాటు అక్కడే ఉన్న స్టార్‌లైనర్ తదితర వ్యోమనౌకల్లో తలదాచుకోవాలని నాసా ఎమర్జెన్సీ ఆదేశాలు జారీ చేసింది. రష్యా ఉపగ్రహ శకలాల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటితో ప్రమాదం లేదని నిర్ధారించుకున్న తర్వాత వ్యోమగాములు తిరిగి ఐఎస్ఎస్‌లోకి వెళ్లటానికి అనుమతించింది. ఈ వివరాలు శనివారం వెల్లడయ్యాయి. రష్యాకు చెందిన కాలపరిమితి ముగిసిన ఓ పాత ఉపగ్రహం బుధవారం విచ్ఛిన్నమైంది. దాని శకలాలు కక్ష్యలో పరిభ్రమిస్తూ ఉండటంతో ఐఎస్ఎస్‌కు అవి తగిలే ప్రమాదం ఉందని నాసా భావించింది. ఈ నేపథ్యంలోనే ముందుజాగ్రత్త చర్యగా వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు అనుసంధానమై ఉన్న వారి వారి వ్యోమనౌకల్లో తలదాచుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. బోయింగ్ కంపెనీ రూపొందించిన స్టార్‌లైనర్ వ్యోమనౌక ద్వారానే సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఈ నెల 5వ తేదీన ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. తొలుత 8 రోజులపాటే అనుకున్న వారి అంతరిక్ష యాత్ర.. ఇప్పటికే వ్యోమనౌకలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో వాయిదా పడింది. ప్రస్తుతం రష్యా ఉపగ్రహ శకలాలతో కొత్త ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, భూమ్మీదికి వారు తిరిగి రావటానికి కొన్ని నెలలు పట్టవచ్చని తెలుస్తోంది. దీనిపై నాసా ప్రతినిధి స్టీవ్ స్టిచ్ మాట్లాడుతూ, స్టార్‌లైనర్ మిషన్‌ను 45 రోజుల నుంచి 90 రోజులకు పొడిగించాలని నాసా యోచిస్తున్నట్లు వెల్లడించారు. రష్యా ఉపగ్రహ శకలాల ముప్పు పూర్తిగా తొలగిపోవటానికి కొన్ని వారాల నుంచి నెలలు పట్టవచ్చని నాసా భావిస్తోంది. అంతరిక్షంలో వ్యర్థాలు పేరుకుపోవటం తీవ్రమైన సమస్యగా పరిణమిస్తోంది. తాజా ఘటనతో ఈ సమస్య మరోసారి చర్చనీయాంశమైంది.

2040కల్లా చంద్రుడి మీదకు మనిషి!

- ఇందుకోసం ప్రత్యేకంగా మెగా అంతరిక్ష నౌక: ఇస్రో ఛైర్మన్



న్యూఢిల్లీ, జూన్ 29: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) 2040కల్లా చంద్రుడి మీదకు మనుషులను తీసుకువెళ్తుందని ఆ సంస్థ ఛైర్మన్ సోమనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా మెగా అంతరిక్ష వాహక నౌక.. నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికిల్(ఎన్‌జీఎల్‌వీ)ను తయారు చేస్తున్నామని చెప్పారు. దీనికే 'సూర్య' అని నామకరణం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అది డిజైన్ దశలో ఉందన్నారు. శనివారం ఆయన ఓ జాతీయ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇస్రో భవిష్యత్తు ప్రయోగాల గురించి వివరించారు. అంతరిక్ష వాహక నౌక అయిన సూర్య ఇండియాలో ఇప్పుడున్న రాకెట్లన్నింటికన్నా పెద్దగా ఉంటుందని, 40టన్నుల బరువును మోసుకువెళ్తుందని చెప్పారు. క్రయోజెనిక్ ఇంజన్‌తో పాటు దిగువ భూకక్ష్యలో ద్రవ ఆక్సిజన్, మీథేన్‌తో నడిచేలా దీన్ని రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. చంద్రయాన్-4 ప్రయోగాన్ని కూడా త్వరలోనే నిర్వహిస్తామని సోమనాథ్ తెలిపారు. ఈ ప్రయోగంలో భాగంగా చంద్రుడి మీద శివశక్తి పాయింట్ నుంచి మట్టి, రాళ్ల నమూనాలను తీసుకువస్తామన్నారు. చంద్రయాన్-3 ల్యాండ్ అయిన ప్రాంతానికి శివశక్తి పాయింట్ అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే. అంతరిక్షంలో భారతదేశం నిర్వహించతలపెట్టిన పరిశోధనా కేంద్రానికి సంబంధించి డిజైనింగ్ ప్రక్రియ నడుస్తోందని సోమనాథ్ ఈ సందర్భంగా చెప్పారు. ప్రాజెక్టు నివేదికను, దానికయ్యే ఖర్చు అంచనాలను ఇప్పటికే రూపొందించామన్నారు. 2028కల్లా ఈ అంతరిక్ష కేంద్రానికి సంబంధించిన మొదటి మాడ్యూల్‌ను నిర్మిస్తామని చెప్పారు.

మోదీది నైతిక ఓటమి!

- ప్రజా తీర్పు ప్రధానికి వ్యతిరేక సంకేతం : సోనియా
- నేర చట్టాలు నిలిపివేయాలని డిమాండ్



న్యూఢిల్లీ, జూన్ 29: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గమనిస్తే ప్రధాని మోదీ నైతికంగా పరాజయం పాలైన సంకేతాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. కానీ, దేశంలో ఎలాంటి మార్పూ రానట్టే, మార్పులేదన్నట్టే మోదీ ప్రధానిగా కొనసాగుతున్నారని దుయ్యబట్టారు. "ప్రజాతీర్పు సుస్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. వ్యక్తిగతంగా, రాజకీయంగా, నైతికంగా కూడా.. తీర్పు మోదీకి వ్యతిరేకం" అని సోనియాగాంధీ నిప్పులు చెరిగారు. ఓ పత్రికలో రాసిన వ్యాసంలో తాజా ఎన్నికల తీర్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలనుకానీ, ప్రజా తీర్పును కానీ ఆయన అర్థం చేసుకున్నారనడానికి ఎలాంటి సాక్ష్యాలూ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఉప సభాపతి విషయంలో ఇది ప్రస్ఫుటంగా గోచరించిందని తెలిపారు. "లోక్‌సభ స్పీకర్ విషయంలో మోదీ దూతలు ఏకాభిప్రాయాన్ని కోరినప్పుడు ఇండియా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది. పార్లమెంటులో సమతుల్యతకు పెద్దపీట వేయాలని భావించింది. ఇదే సమయంలో సంప్రదాయాలు పాటిస్తారని, సంప్రదాయం ప్రకారం ఉపసభాపతి పదవిని ప్రతిపక్షాలకు ఇస్తారని ఆశించాం. దీనినే బాధ్యతాయుతంగా అభ్యర్థించాం. కానీ, ప్రభుత్వం మాత్రం మా అభ్యర్థనను ససేమిరా అంగీకరించలేదు. సంప్రదాయాలకు గొడుగు పట్టలేదు" అని సోనియాగాంధీ విమర్శించారు. రాజ్యాంగంపై దాడిని దృష్టి మరల్చేక్రమంలోనే ప్రధాని, లోక్‌సభ స్పీకర్ నుంచి బీజేపీ నేతల వరకు ఎమర్జెన్సీని ప్రస్తావిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అయితే.. 1975నాటి ఎమర్జెన్సీపై 1977లో ప్రజలు తీర్పు ఇచ్చారని, దీనిని నిర్ద్వంద్వంగా, నిస్సందేహంగా అప్పటి నేతలు ఆమోదించారని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నూతన నేర న్యాయ చట్టాలపైనా సోనియాగాంధీ స్పందించారు. ఆ మూడు చట్టాలు పార్లమెంటు సంపూర్ణంగా పరిశీలించే వరకు వాటి అమలును నిలిపివేయాలని(సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నాయి) ఆమె డిమాండ్ చేశారు.

కర్ణాటకలో స్వామీజీల రాజకీయం

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పదవులపై కొనసాగుతున్న వ్యాఖ్యలు


వీర సోమేశ్వర శివాచార్య

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి పదవులపై స్వామీజీల వ్యాఖ్యలు కొనసాగుతున్నాయి. ఒక్కలిగ వర్గానికి సీఎం పదవి ఇవ్వాలని చంద్రశేఖరనాథ స్వామీజీ సీఎం సిద్దరామయ్య సమక్షంలో చేసిన వ్యాఖ్యలు మరిచిపోక ముందే మరికొందరు స్వామీజీలు ఆయన బాటలోనే పయనిస్తున్నారు. వీరశైవ-లింగాయత్‌లకు అనుకూలంగా శ్రీశైల జగద్గురు చెన్న సిద్దరామ పండితారాధ్య స్వామీజీ శుక్రవారం సీఎం మార్పు, అదనంగా మరో ఉప ముఖ్యమంత్రి పదవి తదితర వ్యాఖ్యలు చేశారు. తాజాగా, బెలెహొన్నూర్ రంభాపురి పీఠాధిపతి వీర సోమేశ్వర శివాచార్య స్వామీజీ కూడా శనివారం ఇదే తరహా డిమాండ్ చేశారు. కాగా.. సీఎం, డిప్యూటీ సీఎం మార్పునకు సంబంధించిన అంశాలను బహిరంగంగా లేదా మీడియా ముందు మాట్లాడితే నోటీసులు జారీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పార్టీ వర్గాలను హెచ్చరించారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ప్రాధాన్యం ప్రకారం తాను, సిద్దరామయ్య ఎలా పనిచేయాలనేది ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నిర్ణయిస్తారని తెలిపారు. ఈ విషయంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, స్వామిజీలు మాట్లాడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తాను సీఎం అయ్యేందుకు ఎవరి సిఫారసు అవసరం లేదని.. తాను చేసిన పనులు చూసి అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందని, ఈ విషయంలో ఎవరూ మాట్లాడవద్దని కోరారు. స్వామిజీలు రాజకీయాలు మాట్లాడకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో లింగాయత, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాల్లో ఒక్కొక్కరికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మంత్రులు సతీశ్‌జార్కిహొళి, రాజణ్ణ ఇటీవల డిమాండ్ చేశారు. అంతలోనే చెన్నగిరి ఎమ్మెల్యే బసవరాజ్ మాట్లాడుతూ సీఎం పదవిని శివకుమార్‌కు అప్పగించి దజను డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చుకున్నా అభ్యంతరం లేదన్నారు. వారం రోజులుగా ఈ వివాదం కొనసాగుతోంది.



చినవెంకన్న సేవలో జస్టిస్ జ్యోతిర్మయి

ద్వారకాతిరుమల, జూన్ 29: ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శనివారం సందర్శించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఆమెకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

పోలవరం విధ్వంసంపై జవాబేది జగన్?

- శ్వేతపత్రం విడుదలై 24గంటలు దాటినా మౌనమే
- ప్రాజెక్టు అర్థం కాలేదన్న అంబటితో వ్యాఖ్యలా?
- విపక్ష నేత హోదా కోరేటప్పుడు దీనిపై స్పందించక్కర్లేదా?
- నిలదీస్తున్న సాగునీటి నిపుణులు

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు విధ్వంసంపై సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంపై జగన్ సమాధానం చెప్పకుండా ముఖం చాటేస్తున్నారు. పోలవరం ప్రస్తుత దుస్థితికి కర్త, కర్మ, క్రియ జగనేనని చంద్రబాబు విస్పష్టంగా ప్రకటించారు. అయినా, దీనిపై జగన్ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయాన్ని రుచిచూశాక.. జనానికి దూరంగా జగన్, పులివెందుల, బెంగళూరు ప్యాలెస్‌ల్లో గడుపుతున్నారు. వాస్తవానికి ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరంపై రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ వచ్చారు. పోలవరం ప్రాజెక్టును 2025 నాటికి పూర్తిచేస్తామని 2024 ఎన్నికల సమయంలో ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో చంద్రబాబు పోలవరంపై శ్వేత పత్రాన్ని విడుదల చేస్తూ, జగన్ మోసపు మాటలను జనం ముందుంచారు. తనకు పోలవరం ప్రాజెక్టు అర్థం కాలేదన్న అప్పటి సాగునీటి మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలనూ చంద్రబాబు గుర్తుచేశారు. దీనిపై రాంబాబు శనివారం స్పందించారు. పోలవరం ఇప్పట్లో పూర్తికాదన్న తన వాదనను పునరుద్ఘాటించారు. అయితే.. ఇంత సున్నితమైన పోలవరం ప్రాజెక్టుపై జగన్ మౌనం దాల్చి ముఖం చాటేయడంపై రాష్ట్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రతిపక్ష నేత హోదా కోరుకుంటున్న జగన్ పోలవరం వంటి అతి ముఖ్యమైన అంశంపైనా నోరు విప్పకపోతే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రంపై భారం లేకుండా పోలవరాన్ని పూర్తి చేయాలి: షర్మిల

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి నిధులు రప్పించి, రాష్ట్రంపై ఆర్థికభారం లేకుండా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'పోలవరం నిర్మాణానికి ఐదేళ్లు పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పోలవరం విధ్వంసానికి బీజేపీ, టీడీపీ, వైసీపీలే కారణం. రివర్స్ టెండరింగ్ పేరుతో జగన్ అంచనా వ్యయం పెంచాడే తప్ప ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రాజెక్టు నిర్మాణం ఉంది' అని షర్మిల అన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదాపై టీడీపీ వైఖరేంటీ?: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, జూన్ 29: ఏపీకి ప్రత్యేక హోదాపై టీడీపీ వైఖరేంటీ? అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ తీర్మానాన్ని ఆమోదించిన నేపథ్యంలో జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు.

రేపటి నుంచి ఇంజనీరింగ్ అడ్మిషన్లు

- 4 నుంచి 10 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- వచ్చేనెల 19 నుంచి తరగతులు ప్రారంభం

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ జూలై 1 నుంచి ప్రారంభం కానుంది. ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు సంబంధించి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు, ప్రవేశాల కన్వీనర్ డాక్టర్ బి.నవ్య శనివారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపును 1 నుంచి 7వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. జూలై 4 నుంచి 10 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది. 8 నుంచి 12వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపికకు సమయం ఇచ్చారు. 13న విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆప్షన్ల మార్చుకోవచ్చని, 16న సీట్ల కేటాయింపు పూర్తి చేస్తామని కన్వీనర్ తెలిపారు. సెల్ఫ్ జాయినింగ్, కళాశాలలో రిపోర్టింగ్ చేయడానికి 17 నుంచి 22 వరకు అవకాశం కల్పించారు. 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని నవ్య వివరించారు. అయితే ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులపై స్పష్టత రాలేదు. గత ఏడాది మూడేళ్ల కాలానికి ఉన్నత విద్యా కమిషన్ ఫీజులు ఖరారు చేసింది. వాటిపై కొన్ని కాలేజీల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. ఇది వివాదంగా మారడంతో న్యాయస్థానం సూచన మేరకు 2023-24 విద్యా సంవత్సరానికి అందరికీ 10శాతం పెంపుతో ఫీజులు నిర్ణయించారు. అయితే అది తాత్కాలికమేనని, కమిషన్ కొత్త ఫీజులు ఖరారు చేయాలని కోర్టు సూచించింది. దీనిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ వ్యవహారంపై అడ్వొకేట్ జనరల్‌తో మాట్లాడాలని అధికారులకు మంత్రి లోకేశ్ తాజాగా సూచించారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ సీట్లు దాదాపు 2లక్షలకు చేరే అవకాశం కనిపిస్తోంది. సీట్లపై ఏఐసీటీఈ పరిమితులు తొలగించడంతో కాలేజీలన్నీ సీట్లు పెంచుకున్నాయి. బి.ఫార్మసీ అడ్మిషన్లకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల కానుంది.



కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్తున్న పవన్‌కు జనసేన కార్యకర్తల స్వాగతం, ఆలయంలో పవన్ కల్యాణ్ పూజలు

కొండగట్టు అంజన్న సేవలో పవన్

- ప్రత్యేక పూజలు చేసిన ఏపీ డిప్యూటీ సీఎం
- పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు
- గతేడాది కొండగట్టులో వారాహికి పవన్ పూజలు
- ఆంజనేయ స్వామికి ముడుపు కట్టి మొక్కులు
- ఏపీ ఎన్నికల్లో విజయంతో మొక్కు చెల్లింపు

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. తాను ఇలవేల్పుగా కొలిచే ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో దీక్షా వస్త్రాలు, తలపాగాతో ఆలయానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు దేవస్థాన సంప్రదాయం ప్రకారం మేళతాళాలతో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పవన్ కల్యాణ్‌కు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కల్యాణ్ గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆశీర్వచనం అందించి శేష వస్త్రాన్ని, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కాగా, గతేడాది పవన్ కల్యాణ్ తన ప్రచార వాహనం వారాహికి కొండగట్టులోనే పూజలు చేసి.. ఏపీలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాను ఆశించిన ఫలితాలు రావడంతో అంజన్నకు మొక్కులు చెల్లించుకోవడానికి కొండగట్టుకు వచ్చారు. ఆలయంలో సుమారు అరగంటపాటు గడిపారు.

భారీగా తరలివచ్చిన అభిమానులు...

కొండగట్టుకు పవన్ కల్యాణ్ వస్తున్నారన్న సమాచారంతో ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. జై శ్రీరామ్, జై హనుమాన్, జై జనసేన, పవన్ కల్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

తిరుమలలో శారదా మఠాన్ని సీజ్ చేయాలి

- శ్రీనివాసానంద సరస్వతి



తిరుపతి (జీవకోన)/తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదా మఠాన్ని తక్షణమే సీజ్ చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతిలో సాధువులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలోని శారదా మఠం వెనుకభాగంలోని 80 అడుగుల కాలవను పూడ్చి 20 అడుగులకు కుదించేసి అక్రమ కట్టడాలను నిర్మించిందని తెలిపారు. తద్వారా భవిష్యత్తులో ఈ వాగుల ద్వారా వరదలు వస్తే భక్తులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తిరుమలలో తాము నిరసన తెలిపినా, అధికారులకు అనేకమార్లు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. తమ విజ్ఞప్తిని స్వీకరించాల్సిన ఈవో శ్యామలరావు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. జగన్ ప్రభుత్వంలో టీటీడీ అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా చలాయించారని, ఇక ఆ ఆటలు కట్టిపెట్టాలని సూచించారు. గత ఐదేళ్లలో పదికి పైగా మఠాల తరఫున విలాసవంతమైన భవనాలను తిరుమలలో నిర్మించారని, ఏ నిబంధనల ప్రకారం వాటికి అనుమతులు ఇచ్చారో నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు.. తిరుమలలోని శారదామఠం అదనపు కట్టడాలపై వరుసగా వస్తున్న విమర్శల నేపథ్యంలో టీటీడీ స్పందించింది. శారదా మఠం నిర్వాహకులు అదనంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని 2019లోనే క్రమబద్ధీకరించామంటూ ఓ ప్రకటన విడుదల చేసింది.

ఎలిమెంటరీ స్థాయి ఉమ్మడి పరీక్ష రద్దు

- విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధం
- తీర్పు వెల్లడి.. జగన్ విద్యావిధానాన్ని కొట్టేసిన హైకోర్టు

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1 నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉమ్మడి పరీక్ష నిర్వహించేందుకు వీలుగా గత జగన్ సర్కారు తీసుకువచ్చిన తరగతి గది ఆధారిత అంచనా పరీక్ష(సీబీఏ) విధానాన్ని హైకోర్టు కొట్టేసింది. ఈ పరీక్ష కారణంగా విద్యార్థులు భయం, ఆందోళనకు గురవుతారని పేర్కొంది. సీబీఏ విధానంలో నిర్దిష్ట టైం టేబుల్ ప్రకటించడం, రాష్ట్రవ్యాప్తంగా ఒకటే ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహించడం వంటివి బోర్డు పరీక్షను పోలి ఉన్నాయని అభిప్రాయపడింది. ప్రభుత్వ నిర్ణయం విద్యాహక్కు చట్టంలోని సెక్షన్లు 29, 30కి విరుద్ధమని పేర్కొంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన సీబీఏ విధానం, దాని అమలుకోసం జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత ఇటీవల తీర్పు ఇచ్చారు. సపోర్టింగ్ ద ఆంధ్రా స్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 1 నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సీబీఏ విధానాన్ని తప్పనిసరి చేస్తూ స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) 2022, అక్టోబర్ 3న ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలన్నీ ఈ విధానంలో భాగస్వామ్యం కావాలని, పరీక్ష నిర్వహణకు నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించాలని పేర్కొంది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్, మరో విద్యాసంస్థ అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి ఇటీవల నిర్ణయాన్ని వెల్లడించారు.

బాలికపై సామూహిక అత్యాచారం

- బాపట్ల జిల్లాలో దారుణం.. ఐదుగురు నిందితుల అరెస్టు

రేపల్లె, జూన్ 29: బాపట్ల జిల్లాలో ఓ బాలికపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులను అరెస్ట్ చేశామని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక నిజాంపట్నం మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చింది. బాలికకు పరిచయం ఉన్న చైతన్య అనే వ్యక్తి ఆమెకు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి బయటకు రావాలని కోరాడు. చైతన్య, అతని మిత్రుడు ఆమెను బైక్‌పై నిజాంపట్నం మండలం గరువుపాలెం శివారులో పొదల్లోకి తీసుకుని వెళ్లారు. వీరితో పాటు చైతన్య మిత్రులు మరో ముగ్గురు కూడా బాలికపై అత్యాచారం చేశారని తెలిపారు. నిజాంపట్నం మండలం అడవులదీవి పోలీస్‌స్టేషన్‌లో బాలిక ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. శనివారం నగరం మండలం సజ్జావారిపాలెం గ్రామంలో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరిపై పోక్సో చట్టం, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు వెల్లడించారు.

విద్యారంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఏపీటీఎఫ్

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యారంగంపై కూడా శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ కోరింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్. చిరంజీవి, ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి డి.దస్తగిరి, కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రామబ్రహ్మం, ఎన్.టి.ఆర్.జిల్లా అధ్యక్షుడు డి.రవీంద్రప్రసాద్‌తో కూడిన ప్రతినిధి బృందం శనివారం మంత్రి కొల్లు రవీంద్రను కలిసింది. అక్టోబరులో విజయనగరంలో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ 80 వసంతాల, 20వ విద్యా వైజ్ఞానిక మహాసభల కరపత్రాన్ని మంత్రి విడుదల చేశారు. ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

చేతలతోనే జవాబు!

"ఒకటి రెండు నెలలు ఓపిక పట్టండి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండదు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మనతో టచ్‌లో ఉన్నారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నేతలతో టచ్‌లో ఉన్నాం. రెండు నెలల తర్వాత అధికారంలోకి వస్తాం. ముఖ్యమంత్రి పదవిపై నాకు ఆశ లేదు. ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారు. నేను మీకు మార్గదర్శిగా ఉంటాను. కాంగ్రెస్‌లో చేరుతున్న మన ఎమ్మెల్యేలను న్యాయస్థానం ద్వారా అనర్హులుగా ప్రకటింపజేస్తాం. ఢిల్లీకి చెందిన పెద్ద లాయర్‌తో మాట్లాడాం. ఇంతకంటే ఎక్కువ చెప్పను. చెబితే రహస్యాలు లీక్ అవుతాయి".. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు రోజుల క్రితం ఫాంహౌస్‌కు పిలిపించుకున్న తన పార్టీ ఎమ్మెల్యేలతో చెప్పిన మాటలు ఇవి. ఎమ్మెల్యేలకు తన మాటలపై నమ్మకం కుదరడం కోసం ఆయన కొన్ని ఆడియో సంభాషణలను కూడా వినిపించారు. సదరు ఆడియోలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

> అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వాళ్లను ప్రజలు క్షమించరు. 2019లో 151 సీట్లతో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు ఆహా ఓహో అనుకున్నాం. అయితే ఆ ప్రభుత్వ పోకడలను గమనించిన ప్రజలకు అనతికాలంలోనే విరక్తి కలిగింది. జగన్మోహన్‌రెడ్డి వికృత ఆలోచనలు చేసి ఉండకపోతే ఇప్పుడు 11 సీట్లకే పరిమితమై ఉండేవారు కాదు. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం దేబిరించాల్సిన దుస్థితి వచ్చి ఉండేది కాదు. ప్రజలే ఆయనకు ఆ హోదా ఇచ్చి ఉండేవారు. పగ, ప్రతీకారాలతో రగిలిపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించి ఉంటే పెద్దగా అద్భుతాలు చేయకపోయినా జగన్‌రెడ్డి అధికారంలో కొనసాగి ఉండేవారు. అలా చేయలేదు కనుకే ప్రజలు ఆయనకు గర్వభంగం కలిగించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దీనివల్ల ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో ఫలితం ఉండడం లేదు. ఇది పదే పదే రుజువైంది.

ప్రభృతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరిచే విధంగా చేసినట్టున్న వ్యాఖ్యలు ఉన్నాయి. ఈ ఆడియో టేపులు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందు రికార్డ్ చేసినవా? లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా అన్నది మాత్రం కేసీఆర్ చెప్పలేదు. మొత్తంమీద కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చే వారితో పాటు భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నది కేసీఆర్ మాటల సారాంశం. కేసీఆర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వారిలో ఒకరైన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శుక్రవారం ఢిల్లీ వెళ్లి మరీ కాంగ్రెస్ పార్టీలో చేరగా, మరో ఇద్దరు వారం రోజుల్లో ఆ పార్టీలో చేరబోతున్నారు. కేసీఆర్ చెబుతున్న దాంట్లో నిజం ఉందా? లేదా? భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నేత నిజంగానే ఆయనతో టచ్‌లో ఉన్నారా? కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు ఆ పార్టీని వదిలి వస్తారా? వస్తే వారిలో ఎవరు ముఖ్యమంత్రి అవుతారు? ఎలా అవుతారు? ఎనిమిది మంది సభ్యులున్న బీజేపీ, 30 మంది (ప్రస్తుతానికి) సభ్యులున్న బీఆర్ఎస్‌తో కలిపినా 38 మంది సభ్యుల బలం మాత్రమే ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మరో 22 మంది కావాల్సి ఉంటుంది. కాంగ్రెస్ నుంచి అంతమందితో బయటకు వచ్చే నాయకుడు ఉన్నారా? ఈ లోపు బీఆర్ఎస్ నుంచి మరికొంత మంది కాంగ్రెస్‌లో చేరితే ఆ పార్టీ బలం 30 కంటే తక్కువ అవుతుంది కదా? ఈ పరిస్థితులలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టడం ఎలా సాధ్యం? వంటి ప్రశ్నలకు మాత్రం సమాధానం లేదు. పార్టీ వదిలిపోతున్న శాసనసభ్యులను కాపాడుకోవడం కోసం కేసీఆర్ ఈ కథ అల్లారో.. లేక నిజంగానే ఆయన ఢిల్లీలోని బీజేపీకి చెందిన కీలక నేతతో టచ్‌లో ఉంటూ వ్యూహ రచన చేస్తున్నారో తెలియదు. పార్టీ ఎమ్మెల్యేలు చేజారిపోతున్నప్పుడు ఉన్న వారినైనా కాపాడుకోవడం కోసం పార్టీ అధినేత ఇలాంటి కథలు చెప్పడం సహజం. కేసీఆర్‌కు ఇలాంటి పిట్ట కథలు చెప్పడం అలవాటే కనుక ఆయన మాటలను సొంత పార్టీ వాళ్లు కూడా నమ్మడం లేదు. గతంలో టీఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా ప్రకటించినప్పుడు కూడా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని సీట్లు గెలుస్తాం, ఇన్ని సీట్లు గెలుస్తాం, లోక్‌సభ ఎన్నికల తర్వాత నేనే ప్రధానమంత్రిని అవుతా, లేదా చక్రం తిప్పుతా.. అని తన పార్టీ వారి వద్ద కేసీఆర్ గొప్పలు చెప్పుకొన్నారు. చివరకు బీఆర్ఎస్‌కు లోక్‌సభలో కనీసం ప్రాతినిధ్యం కూడా లేకుండా పోయింది. కేసీఆర్‌కు జాతకాలపై నమ్మకం కూడా ఎక్కువే. ప్రస్తుతం ఆయనకు గ్రహాలు అనుకూలంగా లేవట. వచ్చే సెప్టెంబరు తర్వాత ఆయనకు మంచి రోజులు వస్తాయట. బహుశా ఈ జాతకాలనే నమ్ముకొని ఒకటీ రెండు నెలల తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని చెబుతుండవచ్చు. అయితే కేసీఆర్ చెబుతున్న మాటల గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేశారు. మరికొద్ది రోజుల్లో బీఆర్ఎస్ బలం 20 లోపునకు పడిపోతుందని చెబుతున్నారు. కాగా ప్రస్తుత పరిస్థితులలో బీజేపీ అగ్రనేతలు కూడా తెలంగాణలో అతుకుల బొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధపడకపోవచ్చు. మహారాష్ట్రలో ఆ పార్టీ చేసిన ప్రయోగం వికటిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం బీజేపీతో చేతులు కలిపిన ఎన్సీపీ నేత అజిత్ పవార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తిరిగి శరద్ పవార్ వర్గంలో చేరబోతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేనను వదిలి వచ్చిన వాళ్లలో కూడా కొందరు అదే ఆలోచన చేయవచ్చు. వీటన్నింటికీ తోడు అధికారంలో కొనసాగడం కోసం ఒకప్పుడు బీజేపీని తిట్టి పోసిన వారితో చేతులు కలపడాన్ని ఆరెస్సెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ ముందుకు రాకపోవచ్చు. మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వస్తే ఏక్‌నాథ్ షిండే వంటి వారిని ఇతర రాష్ట్రాలలో ప్రోత్సహించడానికి బీజేపీ అగ్రనేతలు సిద్ధపడకపోవచ్చు. దీన్నిబట్టి కేసీఆర్ జాతకంలో ఇప్పుడప్పుడే మార్పులు ఉండకపోవచ్చు. కేసీఆర్ ప్రస్తుత దుస్థితికి ఆయనే కారణం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పార్టీ ఫిరాయింపులను విస్తృతంగా ప్రోత్సహించిన ఘనత ఆయనదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని తప్పుబట్టే నైతిక అర్హత ఆయనకు లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన కేసీఆర్ కుటుంబంపై ఇప్పుడు తెలంగాణలో సానుభూతి చూపించేవారే కరువయ్యారు. కవితను జైల్లో పెట్టి వంద రోజులు దాటినా ఆమె గురించి తలచుకొనేవారే లేకుండా పోయారు. తనకూ తన కుటుంబసభ్యులకూ ఈ పరిస్థితి ఎందుకు ఎదురవుతున్నదో కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు. నిజానికి తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను ప్రజలు శాశ్వతంగా గుండెల్లో పెట్టుకోవాలి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా లభించలేదంటే కేసీఆర్ అండ్ కో సేవలు ఇకపై తమకు అవసరం లేదని తెలంగాణ ప్రజలు నిర్ణయానికి వచ్చారని భావించాలి. కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలను గుర్తించకపోగా ఒకటి రెండు నెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని కల్లబొల్లి కబుర్లు చెప్పడం కేసీఆర్‌కే చెల్లుతుంది.


వాస్తవంలోకి వస్తే బెటర్!

బ్రహ్మాండమైన ప్రజా మద్దతుతో 2018లో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్, 2019లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారు. ముఖ్యమంత్రులు ఎలా ఉండకూడదో తమ చర్యల ద్వారా భావితరాలకు చెప్పారు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా 'మేం ఏం తక్కువ చేశామని మమ్మల్ని ఓడించారు?' అని ప్రజలను నిందిస్తున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న స్పృహ లేకుండా రాచరిక పోకడలు పోతే ప్రజలు సహించరని ఎందుకు తెలుసుకోరో తెలియదు. తమను తాము గొప్ప పాలకులుగా ఆ ఇద్దరూ ఇప్పటికీ నమ్ముతున్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రగతిభవన్‌కు పరిమితం కాగా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి పరదాల మాటున ఉండిపోయారు. ఈ నేపథ్యంలో కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడం ఎలా అన్న పిచ్చి ఆలోచనలు చేయకుండా తాను కోల్పోయిన ప్రజాభిమానాన్ని తిరిగి పొందడం ఎలా? అన్న దానిపై దృష్టిపెట్టడం మంచిది. ప్రస్తుత రాజకీయాలలో అధికారం కోల్పోయిన పార్టీలు మనుగడ సాగించడం కష్టంగా ఉంటోంది. గతంలో చంద్రబాబు కూడా ఇటువంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడం కోసం ఆయన పడని పాట్లు లేవు. కేసీఆర్ ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా తనను తాను మభ్యపెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను కాపాడుకోవడం కోసం పిట్ట కథలు చెప్పడం తప్పు కాదు గానీ అది నిజం కాబోతోందని నమ్మితే మాత్రం రాజకీయంగా మోక్షం లభించదు. తెలంగాణ ప్రజలు తనను ఎందుకు తిరస్కరించారో గుర్తించడానికి కేసీఆర్ ఇప్పటికీ సిద్ధంగా లేకపోవడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయనలో ఇప్పటికీ అహం తగ్గలేదు. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలుసుకున్నాడు కనుకనే చంద్రబాబు పడి లేచారు. ఈ లాజిక్‌ను పట్టించుకోని కేసీఆర్, ప్రజలు తన పాలన కోసం ఎదురుచూస్తున్నారని పగటి కలలు కంటున్నారు. రాజకీయాల్లో విధేయతకు ఇప్పుడు చోటు లేకుండా పోయింది. తన పక్కన పెద్ద సోఫా వేసి కూర్చోబెట్టుకున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎక్కడో ఉన్న వ్యక్తిని రాజకీయాల్లోకి తెచ్చి ఎమ్మెల్యేను చేసిన సంజయ్ వంటి వాళ్లు అధికారం కోల్పోయిన తర్వాత తనను వదిలిపోవడంపై కేసీఆర్ మనసు కష్టపెట్టుకున్నట్టుగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదేళ్ల మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి ఆ పార్టీని వదిలి తనతో చేతులు కలిపినప్పుడు కేసీఆర్‌కు ఇలాంటి సెంటిమెంట్లు గుర్తుకురాలేదు. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందిన శాసనసభ్యులను తన పార్టీలో చేర్చుకున్నప్పుడు వారిని అనర్హులుగా ప్రకటించాల్సి ఉంటుందన్న విషయం కేసీఆర్‌కు తెలియదా? అప్పుడు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను స్పీకర్ పట్టించుకున్నారా? తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌తో ఉత్తుత్తి రాజీనామా చేయించి మంత్రి పదవి కట్టబెట్టిన కేసీఆర్‌కు నైతిక విలువలు గుర్తుకు రాలేదా? ఇప్పుడు తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించకపోవడం అన్యాయం, అక్రమం అని రోదిస్తే ఫలితం ఉంటుందా? అధికారంలో ఉన్నప్పుడు కట్టుబాట్లు తప్పకుండా ఉండి ఉంటే కేసీఆర్‌కు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదు. కర్మఫలం అనుభవించి తీరాల్సిందే. పార్టీ ఫిరాయింపులను తప్పుబట్టే అర్హత ఇప్పుడు ఈ దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి కూడా లేదు. అందుకే కేసీఆర్ ఆక్రందనలను తెలంగాణ ప్రజలు ఆలకించడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇకపై పాలన మీద మరింత దృష్టి కేంద్రీకరించాలి. ప్రభుత్వం పరుగులు పెడుతోందన్న భావనను ప్రజల్లో కలిగించాలి. తన ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకుంటూ ఉండాలి. కొన్ని విషయాలలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో కింది స్థాయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు ట్రాన్స్‌ఫారం కావాలంటే వారాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. భూ వినియోగ మార్పిడి ఫైళ్లకు అతీగతీ ఉండటం లేదు. ఆయా సమస్యలపై ప్రజాభిప్రాయాన్ని మదింపు చేసుకొని ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను కూడా పటిష్ఠం చేయాలి. పోలీసులలో కొంత అలసత్వం కనబడుతోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాతనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పరుగులు పెట్టిస్తారని ఆశిద్దాం.

> ప్రభుత్వం ఎలా ఉండకూడదో జగన్‌రెడ్డి మన కళ్ల ముందు ఆవిష్కరించారు. అది తెలుసుకొని వాటిని గుర్తుచేసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవడం చంద్రబాబు ప్రభుత్వ బాధ్యత.

ఇప్పటికీ అవే రోత మాటలు!

తెలంగాణలో కట్టుకథలు, పిట్టకథలతో కేసీఆర్ కాలక్షేపం చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం బెంగళూరులోని ప్యాలెస్‌లో సేద తీరుతున్నారు. ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత అన్నీ వదిలేసుకుని హిమాలయాలకు వెళ్లాలనిపించిందని నిర్వేదం వ్యక్తంచేశారు. శాసనసభలో తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని సభాపతికి ఒక లేఖ రాసి పడేసి ఆయన బెంగళూరు వెళ్లిపోయారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను ఆయనకు ప్రజలే ఇవ్వలేదు. ప్రజలు తనను అంతలా ఎందుకు తిరస్కరించారో తెలుసుకొనే ప్రయత్నం చేయకపోగా ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే తాను శాసనసభకు హాజరు కానన్న బెదిరింపులకు తెగబడటం విడ్డూరంగా ఉంది. చాక్లెట్ కొనిస్తేనే నేను బడికి వెళతానని పిల్లలు మారాం చేసినట్టుగా జగన్‌రెడ్డి మారాం ఉంది. ఆయన శాసనసభకు హాజరు కాకపోతే ఎవరికి నష్టం? చెరువు మీద అలిగినట్టుగా ఉంది. అయినా ఇప్పుడు జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనని వాదిస్తున్న వాళ్లు గతంలో జగన్ తలుచుకుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష నాయకుడి హోదా పోతుందని కూశారు. తెలంగాణలో కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నాయకుడి హోదా తొలగించినప్పుడు అలా ఎలా అని ప్రశ్నించలేదు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి పదిహేను రోజులు మాత్రమే అయింది. అయినా తన ఏలుబడిలో సజావుగా ఉన్న రాష్ట్రంలో ప్రజలు ఇప్పుడు సమస్యలతో అల్లాడిపోతున్నట్టుగా చిత్రించే పనిలో జగన్‌రెడ్డి అండ్ కో ఉండటం మరీ రోతగా ఉంది. తమ పాలన నిజంగా అంత గొప్పగా ఉండి ఉంటే వైసీపీకి 11 సీట్లు మాత్రమే ఎందుకు వచ్చినట్టు? ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో జగన్‌రెడ్డి చాలా బలంగా రుజువు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అనుక్షణం ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. జగన్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పోకడలను, ప్రభుత్వ దుశ్చర్యలను గుర్తుకు తెచ్చుకొని బ్లూ బుక్ రూపొందించుకొని అందుకు అనుగుణంగా ప్రస్తుత మంత్రులు నడుచుకోవాలి. ప్రభుత్వం ఎలా ఉండకూడదో జగన్‌రెడ్డి మన కళ్ల ముందు ఆవిష్కరించారు. అది తెలుసుకొని వాటిని గుర్తుచేసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవడం చంద్రబాబు ప్రభుత్వ బాధ్యత. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వాళ్లను ప్రజలు క్షమించరు. భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన వారిని ప్రజలు మరింత నిశితంగా గమనిస్తారు. 2019లో 151 సీట్లతో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు ఆహా ఓహో అనుకున్నాం. అయితే ఆ ప్రభుత్వ పోకడలను గమనించిన ప్రజలకు అనతికాలంలోనే విరక్తి కలిగింది. జగన్మోహన్‌రెడ్డి వికృత ఆలోచనలు చేసి ఉండకపోతే ఇప్పుడు 11 సీట్లకే పరిమితమై ఉండేవారు కాదు. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం దేబిరించాల్సిన దుస్థితి వచ్చి ఉండేది కాదు. ప్రజలే ఆయనకు ఆ హోదా ఇచ్చి ఉండేవారు. పగ, ప్రతీకారాలతో రగిలిపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించి ఉంటే పెద్దగా అద్భుతాలు చేయకపోయినా జగన్‌రెడ్డి అధికారంలో కొనసాగి ఉండేవారు. అలా చేయలేదు కనుకే ప్రజలు ఆయనకు గర్వభంగం కలిగించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దీనివల్ల ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో ఫలితం ఉండడం లేదు. ఇది పదే పదే రుజువైంది. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ఆధారంగానే ప్రజలు తీర్పు ఇస్తారు. ఇప్పుడు 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆనవాయితీ ప్రకారం జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం మొదలుపెట్టింది. పోలవరం ప్రాజెక్టుపై శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి శ్వేతపత్రం విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి చేతగానితనం వల్ల పోలవరం ప్రాజెక్టు నాశనం అయిందని, వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆయనను నిందించారు. త్వరలో మరో ఆరేడు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. నిజమే, జగన్ పాలనతో పోలవరం ప్రాజెక్ట్ అతీగతీ లేకుండా పోయింది. ప్రజలకు ఆ విషయం తెలియదా? రాష్ట్రంలో రాజధాని లేకుండా పోయిందని, పోలవరం వంటి ప్రాజెక్టులు మూలనపడ్డాయని గుర్తించారు కనుకే ప్రజలు జగన్‌రెడ్డిని చిత్తు చిత్తుగా ఓడించారు. మూడు రాజధానులు అని చెప్పినా కర్నూలు, విశాఖలలో కూడా ఆయనకు ఆదరణ లభించలేదు. ఈ నేపథ్యంలో జగన్ వైఫల్యాల గురించి ప్రజలకు కొత్తగా చెప్పాల్సింది ఉందా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. గత ప్రభుత్వంలో తమ ఆశలు అడియాశలయ్యాయి కనుకే కనీవినీ ఎరుగని మెజారిటీతో కూటమిని ప్రజలు గెలిపించారు. కుంటుపడిన పోలవరం ప్రాజెక్టును తాము ఎలా ముందుకు తీసుకువెళ్లబోతున్నారో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వివరించాల్సిన అవసరం ఉంది. జగన్ చర్యల కారణంగా పోలవరంలో కొన్ని వేల కోట్ల రూపాయల నష్టం జరిగిన మాట వాస్తవమే అయితే ఆ నష్టానికి బాధ్యులు అయిన వారిపై చర్యలు తీసుకోవాలి కదా? నిబంధనలకు విరుద్ధంగా జగన్ ప్రభుత్వం చేపట్టిన రివర్స్ టెండరింగ్‌ను సరిదిద్దుతారా? కాంట్రాక్టర్‌ను మార్చడం తప్పిదం అని చెబుతున్నందున ఆ తప్పును సరిదిద్దుతారా? లేదా? వంటి ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ కారణంగా జరిగింది చెప్పడంతో పాటు జరగబోయేది కూడా చెబితేనే శ్వేతపత్రాల విడుదల వల్ల ప్రయోజనం ఉంటుంది. అధికారం ఉన్నప్పుడు దుర్మార్గంగా వ్యవహరించిన వారిని ఎన్నికల్లో ఓడించడం ద్వారా తమ బాధ్యత తీరిపోయిందని ప్రజలు భావిస్తారు. జగన్ విషయంలో కూడా ఇదే జరిగింది. గంపెడు ఆశతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ వాస్తవాన్ని చంద్రబాబు అండ్ కో గుర్తించాలి. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా, అంతకుముందు ఉన్న చంద్రబాబు ప్రభుత్వాన్ని తిట్టిపోశారు. ప్రజలు అవేవీ గుర్తుంచుకోకుండా జగన్‌రెడ్డి దుష్పపాలన ఆధారంగానే తీర్పు ఇచ్చారు. కాగా రామోజీరావు సంస్మరణ సభ ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి విమర్శ ఎదుర్కొంటున్నారు. రామోజీరావుకు అర్హత ఉందా? లేదా? అన్న విషయం పక్కన పెడితే ప్రభుత్వ పరంగా ఆయన సంస్మరణ సభ ఏర్పాటు చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక బిడ్డ జన్మించినప్పుడు ఆ ఇంట్లో వాళ్లు సంబరాలు చేసుకుంటారు. ఆ బిడ్డ ఎదిగి పెద్దవాడై తాను ఎంచుకున్న మార్గంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి కన్నుమూసినప్పుడు ఆయన వల్ల ప్రయోజనం పొందినవాళ్లు, ఆయనతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నవాళ్లు బాధపడతారు. గతించిన వారితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకోవడం కోసం సంస్మరణ సభలు పెట్టుకుంటారు. నాయకుడైతే ఆయనను అభిమానించే ప్రజలు స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో రామోజీరావు సంస్మరణ సభను ప్రభుత్వపరంగా కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న వారితో కమిటీ ఏర్పాటు చేసి నిర్వహింపజేసి ఉంటే విమర్శలకు అవకాశం ఉండేది కాదు. ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత జాగ్రత్త తీసుకుంటారని ఆశిద్దాం!



> రాష్ట్రంలో రాజధాని లేకుండా పోయిందని, పోలవరం వంటి ప్రాజెక్టులు మూలనపడ్డాయని గుర్తించారు కనుకే ప్రజలు జగన్‌రెడ్డిని చిత్తు చిత్తుగా ఓడించారు. మూడు రాజధానులు అని చెప్పినా కర్నూలు, విశాఖలలో కూడా ఆయనకు ఆదరణ లభించలేదు. ఈ నేపథ్యంలో జగన్ వైఫల్యాల గురించి ప్రజలకు కొత్తగా చెప్పాల్సింది ఉందా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. గత ప్రభుత్వంలో తమ ఆశలు అడియాశలయ్యాయి కనుకే కనీవినీ ఎరుగని మెజారిటీతో కూటమిని ప్రజలు గెలిపించారు. కుంటుపడిన పోలవరం ప్రాజెక్టును తాము ఎలా ముందుకు తీసుకువెళ్లబోతున్నారో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వివరించాల్సిన అవసరం ఉంది. జగన్ చర్యల కారణంగా పోలవరంలో కొన్ని వేల కోట్ల రూపాయల నష్టం జరిగిన మాట వాస్తవమే అయితే ఆ నష్టానికి బాధ్యులు అయిన వారిపై చర్యలు తీసుకోవాలి కదా? నిబంధనలకు విరుద్ధంగా జగన్ ప్రభుత్వం చేపట్టిన రివర్స్ టెండరింగ్‌ను సరిదిద్దుతారా? కాంట్రాక్టర్‌ను మార్చడం తప్పిదం అని చెబుతున్నందున ఆ తప్పును సరిదిద్దుతారా? లేదా? వంటి ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ కారణంగా జరిగింది చెప్పడంతో పాటు జరగబోయేది కూడా చెబితేనే శ్వేతపత్రాల విడుదల వల్ల ప్రయోజనం ఉంటుంది.

> లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం బీజేపీతో చేతులు కలిపిన ఎన్సీపీ నేత అజిత్ పవార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తిరిగి శరద్ పవార్ వర్గంలో చేరబోతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేనను వదిలి వచ్చిన వాళ్లలో కూడా కొందరు అదే ఆలోచన చేయవచ్చు. వీటన్నింటికీ తోడు అధికారంలో కొనసాగడం కోసం ఒకప్పుడు బీజేపీని తిట్టి పోసిన వారితో చేతులు కలపడాన్ని ఆరెస్సెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ ముందుకు రాకపోవచ్చు. మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వస్తే ఏక్‌నాథ్ షిండే వంటి వారిని ఇతర రాష్ట్రాలలో ప్రోత్సహించడానికి బీజేపీ అగ్రనేతలు సిద్ధపడకపోవచ్చు. దీన్నిబట్టి కేసీఆర్ జాతకంలో ఇప్పుడప్పుడే మార్పులు ఉండకపోవచ్చు.

మూర్తీభవించిన ప్రజాస్వామ్య పరిణతి

వెంకయ్యనాయుడు పదవీకాలం పూర్తయ్యిందని, వారు రాజకీయాల నుంచి కూడా విశ్రాంతి తీసుకోబోతున్నారు అన్న విషయం ఎంతో భావోద్వేగాన్ని కలిగిస్తోంది. అయితే ఆయన 'ఐ హేవ్ రిటైర్డ్ ఫ్రం పొలిటిక్స్, బట్ నాట్ టైర్డ్ ఆఫ్ పబ్లిక్ లైఫ్' అని అనటం సంతోషదాయకం. రాజ్యసభకు నేతృత్వం వహించే బాధ్యత పూర్తి అయినప్పటికీ ఆయన గడించిన అనుభవాలు భవిష్యత్తులో ఎంతోకాలం పాటు దేశానికి లాభం చేకూరుస్తాయని, ప్రజాజీవితంలో పనిచేస్తున్న మావంటి కార్యకర్తలకు మార్గదర్శకంగా ఉంటాయని భావిస్తున్నాను.

వెంకయ్యనాయుడు ఎల్లప్పుడు దేశ యువతకు అత్యంత చేరువగా ఉంటూ, యువజనుల అభ్యున్నతికి పాటుపడుతూ వచ్చారు. పార్లమెంట్‌లో కూడా యువ సభ్యులను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శకంగా నిలిచేవారు. విద్యార్థినీ విద్యార్థులను కలుసుకుని, వారితో సంభాషించేందుకు విశ్వవిద్యాలయాలకు, ఎన్నో సంస్థలకు తరచూ వెళుతూ ఉంటారు. కొత్త తరంతో సదా అనుబంధం కొనసాగిస్తూ ఉన్నారు. యువత కూడా ఆయన్ని కలుసుకోవటానికి ఉత్సుకత చూపుతూ ఉంటుంది. పార్లమెంట్ వెలుపల ఉపరాష్ట్రపతిగా ఆయన చేసిన ఉపన్యాసాల్లో 25 శాతం యువత మధ్య చేసినవే కావటం గొప్ప విశేషం. యువతలోనూ, ప్రజల్లోనూ ఆయనకు గల ఆదరాభిమానాలకి ఇది ప్రధాన కారణం.

పార్టీ కార్యకర్తగా ఆయన అంకితభావం కానీ, శాసనసభ్యునిగా పనితీరు కానీ, పార్లమెంట్ సభ్యునిగా చూపిన క్రియాశీలత కానీ భారతీయ జనతా పార్టీ అధ్యక్షునిగా ప్రదర్శించిన దక్షత–నాయకత్వం గానీ, కేబినెట్ మంత్రిగా చేసిన నిరంతర శ్రమ గానీ, 'నవాచార్' కోసం చేసిన కృషి – పొందిన సఫలత్వం కానీ... ఇవన్నీ దేశానికి మహోపకారం చేశాయి. ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభాపతిగా ఆయన తన బాధ్యతలన్నింటినీ పట్టుదలతో నిర్వహించటం చూశాను. ఎప్పుడూ ఏ బాధ్యతనీ ఆయన భారంగా భావించలేదు. అప్పగించబడిన ప్రతి పనికి న్యాయం చేశారు. పార్లమెంట్ సభ్యులందరితోపాటు దేశ యువత కూడా సమాజం గురించి, దేశం గురించి, ప్రజాస్వామ్యం గురించి వెంకయ్యనాయుడు నుంచి ఎంతో నేర్చుకోవాలని నేను కోరుతున్నాను. లిజనింగ్, లెర్నింగ్, కనెక్టింగ్, కమ్యునికేటింగ్, చాటింగ్ ఔర్ రిఫ్లెక్టింగ్, రీకలెక్టింగ్, రీకనెక్టింగ్ వంటి ఆయన మాటలు వెంకయ్య గురించి ఎంతో తెలియపరుస్తాయి. ఆయనకున్న అపారమైన అనుభవాలు మన దేశ యువతకు మార్గనిర్దేశం చేస్తాయి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యగలుగుతాయి.

వెంకయ్యనాయుడి పుస్తకాల శీర్షికలే ఆయనకున్న పదప్రయోగ ప్రతిభను ప్రస్ఫుటింపజేస్తాయి. ఆయన 'వన్ లైనర్స్' – 'విట్ లైనర్స్', 'విన్ లైనర్స్'గా కూడా ఉంటాయి. అంతే, ఆ తరువాత ఇంకేమీ చెప్పవలసిన అవసరం ఉండదు. 'హిజ్ ఈచ్ వర్డ్ ఈజ్ హర్డ్, ప్రిఫర్డ్, రివర్డ్ అండ్ నెవర్ కౌంటర్డ్' తన సాటిలేని భాషా పటిమ, సహజ ప్రతిభ, సమయస్ఫూర్తి సాయంతో గడ్డు పరిస్థితుల దిశని మార్చగలిగే ఆయన సామర్థ్యాన్ని నేను అభినందిస్తున్నాను. వెంకయ్యనాయుడు దక్షిణ భారతావనిలో విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ తన రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. ఆయనకున్న భావజాలం, తదనుగుణమైన పార్టీకి దక్షిణాదిన అప్పటికి సమీప భవిష్యత్తులో ఏ సామర్థ్యమూ ఉండే అవకాశమే లేదు. అయినా సామాన్య విద్యార్థి కార్యకర్తగా యాత్ర ప్రారంభించి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుని వంటి అత్యున్నత పదవిని చేరుకోగలిగారు. ఇది ఆయనకున్న భావనిబద్ధత, కర్తవ్యపరాయణతలకు ప్రతీక. దేశభక్తి, భావాల్ని వ్యక్తీకరించే కళ ఉంటే, భాషా వైవిధ్యంపై విశ్వాసం ఉంటే, 'భాష–ప్రాంతం' అనేవేవీ ఎప్పుడూ మనకి అడ్డుగోడలు కావు అని వెంకయ్యనాయుడు నిరూపించారు.

వెంకయ్యనాయుడికి మాతృభాష అంటే ఎనలేని ప్రేమ. అదే విషయాన్ని ఆయన "మాతృభాష కంటిచూపు వంటిది, పరభాష కళ్ళజోడు వంటిది" అని చెపుతూ ఉండటం మనమంతా పలుసార్లు విన్నాం. అది ఆయన హృదయపు లోతులనుంచి వెలువడిన భావన. వెంకయ్య హయాంలో పార్లమెంట్ వ్యవహారాల్లో భారతీయ భాషలకి విశేష ప్రాధాన్యం ఇవ్వబడింది. వారు అధ్యక్షులుగా ఉన్న కాలంలో సభలోని సభ్యులకు 22 షెడ్యూల్డ్ భాషల్లో, దేనిలోనైనా మాట్లాడటానికి అవకాశం కల్పించారు. ఆయన ప్రతిభ, కార్యనిష్ఠ ఇకపై కూడా పార్లమెంట్‌కు ఎల్లప్పుడూ ఒక దిక్సూచిలా నిలుస్తాయి. పార్లమెంటరీ మర్యాదను పాటిస్తూ సముచితమైన భాషలో ఏ సభ్యుడైనా తాను చెప్పదలచిన విషయాన్ని ప్రభావవంతంగా చెప్పవచ్చు అనేందుకు వెంకయ్య స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు. వెంకయ్యనాయుడి నాయకత్వ ప్రతిభ, క్రమశిక్షణ రాజ్యసభ నిబద్ధతను, పని సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాయి. ఆయన పదవీకాలంలో రాజ్యసభ పని సామర్థ్యం 70 శాతం పెరగటమే కాక సభ్యుల హాజరు సహితం పెరిగింది. వెంకయ్య హయాంలో సుమారు 177 బిల్లులు పాసవ్వటం, లేదా వాటిపై చర్చ జరగటం ఒక రికార్డు. ఆయన మార్గదర్శకత్వంలో భారతీయ సంకల్పనలను సాకారం గావించే ఎన్నో చట్టాలు రూపొందాయి. ఆయన తీసుకున్న ఎన్నో నిర్ణయాల వల్ల ఎగువసభ ఎగువ దిశగా ప్రయాణం సాగించింది.

> వెంకయ్య హయాంలో పార్లమెంట్ వ్యవహారాల్లో భారతీయ భాషలకి విశేష ప్రాధాన్యం ఇవ్వబడింది. వారు అధ్యక్షులుగా ఉన్న కాలంలో సభలోని సభ్యులకు 22 షెడ్యూల్డ్ భాషల్లో, దేనిలోనైనా మాట్లాడటానికి అవకాశం కల్పించారు. ఆయన ప్రతిభ, కార్యనిష్ఠ ఇకపై కూడా పార్లమెంట్‌కు ఎల్లప్పుడూ ఒక దిక్సూచిలా నిలుస్తాయి. పార్లమెంటరీ మర్యాదను పాటిస్తూ సముచితమైన భాషలో ఏ సభ్యుడైనా తాను చెప్పదలచిన విషయాన్ని ప్రభావవంతంగా చెప్పవచ్చు అనేందుకు వెంకయ్య స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు.



న సా సభా యత్ర న సంతి వృద్ధాః
వృద్ధా న తే యే న వదంతి ధర్మమ్

ఏ సభలో అయితే అనుభవజ్ఞులు ఉంటారో అదే నిజమైన సభ. కర్తవ్యబోధ చేసే వారే అనుభవజ్ఞులు అని శాస్త్రాలు చెపుతున్నాయి. వెంకయ్యనాయుడు మార్గదర్శకత్వంలో రాజ్యసభ ఆ స్థాయిని ఎంతో సమర్థంగా నిలిపింది. వారు సభలోని సభ్యులకు దిశానిర్దేశం చేయటమే కాదు, క్రమశిక్షణ దృష్ట్యా ప్రేమగా మందలించే వారు కూడా. ఆయన మాటని ఏ సభ్యుడూ ఎన్నడూ అన్యథా భావించలేదని నా విశ్వాసం. ఒక వ్యక్తి తాను చెప్పే విషయాల్ని తన వ్యక్తిగత జీవితంలో ఆచరించి చూపినప్పుడు మాత్రమే ఆయనపైన అంతటి గౌరవం ఏర్పడుతుంది.




పార్లమెంట్ కార్యకలాపాల్లో ఒక పరిమితిని మించి జాప్యం సభా తిరస్కారంతో సమానం అని వెంకయ్యనాయుడు భావిస్తారు. ఆయన ఆదర్శాల్లో ప్రజాస్వామ్యపు పరిపక్వతను నేను గమనిస్తున్నాను. మునుపు సభలో చర్చ జరిగేటప్పుడు గోల జరిగితే కార్యకలాపాలు నిలుపు చేయబడేవి. కానీ వెంకయ్య సభ్యులతో మాట్లాడి, సంప్రదింపులు జరిపి, సమన్వయంతో సభని కొనసాగించటంలో సఫలీకృతులయ్యారు. సభ జరిగే సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని గొడవపడే పరిస్థితి ఏర్పడితే వెంకయ్య గారి నోటినుండి "లెట్ ద గవర్నమెంట్ ప్రొపోస్, లెట్ ద అపోజిషన్ అపోస్, లెట్ ద హౌస్ డిస్పోస్" అనే మాటలు గంభీరంగా వినవచ్చేవి. రాజ్యసభకు ఇతర సభ నుంచి వచ్చే బిల్లుల్ని ఆమోదించే లేక తిరస్కరించే హక్కు తప్పకుండా ఉంది. ఈ సభ వాటిని పాస్ చెయ్యొచ్చు, కొట్టివేయ్యొచ్చు, మార్పు చెయ్యొచ్చు, కానీ వాటిని అడ్డుకుని, నిలుపుచెయ్యాలన్న ఆలోచనకు మన ప్రజాస్వామ్యంలో తావు లేదు.

మనందరి సిద్ధాంతాలు, అభిప్రాయాలు భిన్నమైనవి అయినప్పటికీ వెంకయ్యనాయుడికి వీడ్కోలు చెప్పటానికి సభ్యులందరం హాజరయ్యాం. ఇదే ప్రజాస్వామ్యంలో ఉన్న సౌందర్యం, గొప్పతనం. వెంకయ్య పట్ల సభకి ఉన్న గౌరవ భావం. వారు ప్రత్యేకమైన పద్ధతిలో సభను నిర్వహించటంలో ఏర్పరిచిన ప్రమాణాలు ఇకపై ఈ పదవిని చేపట్టబోయేవారికి స్ఫూర్తినిస్తాయి. వారు ప్రవేశపెట్టి ఆచరించిన సంప్రదాయాల్ని రాజ్యసభ అనుసరిస్తూ దేశం పట్ల జవాబుదారీతనంతో పనిచేస్తుందని విశ్వసిస్తూ సభ్యులందరి పక్షాన, నా పక్షాన వెంకయ్యనాయుడికి అనేకానేక శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

■ నరేంద్రమోదీ
(అనువాదం: యార్లగడ్డ లక్ష్మీప్రసాద్)

(భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ అధ్యక్షుడిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు పదవీవిరమణ సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యసభలో వెలువరించిన వీడ్కోలు ప్రసంగంలోని కొన్ని భాగాలు. నేడు హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు 75వ జన్మదినోత్సవ వేడుక)



వార్ @ మేయర్

- 49 మంది కార్పొరేటర్లు.. నాలుగు గ్రూపులు
- మేయర్ సీటుకు ఎసరు పెట్టేలా మంతనాలు
- వైసీపీ నేత అవినాశ్ సమక్షంలోనే బాహాబాహీ
- ఫ్లోర్‌లీడర్‌పై డిప్యూటీ మేయర్ తండ్రి ఆగ్రహం
- మేయర్ తీరుపై మరో డిప్యూటీ మేయర్ గుర్రు
- మేయర్, డిప్యూటీ మేయర్ల వ్యతిరేక గ్రూపుతో పుణ్యశీల చర్చలు
- అటు టీడీపీ, ఇటు వైసీపీ కార్పొరేటర్లతో తెరవెనుక పన్నాగాలు

వైసీపీ కార్పొరేటర్లలో ముదిరిన రచ్చ



భాగ్యలక్ష్మి, బెల్లం దుర్గ, పుణ్యశీల, శైలజారెడ్డి

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వైసీపీ కార్పొరేటర్లలో ముసలం మొదలైంది. మొత్తం 49 మంది వైసీపీ కార్పొరేటర్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి ఆధిపత్యం కోసం అంతర్గత పోరుకు దిగుతున్నారు. వీరి మధ్య వివాదాలు మేయర్ సీటుకు ఎసరు పెట్టే వరకూ వెళ్లాయి. మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్ పుణ్యశీల ఆధ్వర్యంలోని ఈ గ్రూపులు శుక్రవారం జరిగిన సమావేశంలో బహిరంగంగా రచ్చ చేశాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్‌లో వైసీపీకి 49 మంది కార్పొరేటర్ల బలం ఉంది. ప్రస్తుతం వీరంతా నాలుగు గ్రూపులుగా ఏర్పడ్డారు. మేయర్, డిప్యూటీ మేయర్లు ఇద్దరు, గతంలో మేయర్ సీటు ఆశించి భంగపడ్డ కార్పొరేటర్ బండి పుణ్యశీల ఆధ్వర్యంలో ఈ గ్రూపులున్నాయి. ఇటీవల జరిగిన విజయవాడ నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీల ఎన్నికలో ఎవరికి వారు గ్రూపులుగా విడిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ సమక్షంలో నగర పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో పోటీ చేసిన వైసీపీ అభ్యర్థులు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయవాడ పశ్చిమ నుంచి పోటీ చేసిన షేక్ ఆసిఫ్, సెంట్రల్ నుంచి పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావుతో పాటు ఎమ్మెల్సీ రుహుల్లా, పలువురు వైసీపీ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ల నడుమ విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి.

మేయర్‌పై డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి ఆగ్రహం

మరో డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి.. ఎన్నికల సమయంలో కార్పొరేటర్లు అందరికీ డబ్బులు వస్తున్నాయని చెప్పారని, ఈ ప్రచారంతో తమపై డివిజన్ స్థాయి నాయకుల నుంచి ఒత్తిడి పెరిగిందని, కానీ ఒక్క పైసా కూడా వచ్చింది లేదని, ఇలాంటి ప్రచారాలు ఎందుకు చేయాలని మేయర్‌ను ప్రశ్నించారు. కాగా, తొలి నుంచి మేయర్ తన పనుల వరకే పరిమితమయ్యారని, సొంత పార్టీ కార్పొరేటర్ల బాగోగులు కూడా పట్టించుకోలేదని పలువురు కార్పొరేటర్లు మండిపడ్డారు.

ఫ్లోర్‌లీడర్‌పై డిప్యూటీ మేయర్ వర్గం ఫైర్

వీఎంసీలో వైసీపీ ఫ్లోర్‌లీడర్ అరవ సత్యంపై డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తండ్రి, వైసీపీ నాయకుడు చల్లారావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లోర్‌లీడర్‌గా అరవ సత్యం అనర్హుడంటూ మండిపడ్డారు. చల్లారావుకు పలువురు కార్పొరేటర్లు మద్దతు నిలిచినట్లు సమాచారం. మరోవైపు మేయర్ రాయన భాగ్యలక్ష్మి తీరుపైనా పలువురు కార్పొరేటర్లు అసంతృప్తి స్వరాన్ని వినిపించారు.

పుణ్యశీల వెనుక మరో వర్గం

2021, మార్చిలో జరిగిన వీఎంసీ - మిగతా 6లో



ఇక బంగారు మల్లన్న

- ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి బంగారు ఆభరణాలు
- రూ.40 లక్షల ఆభరణాలను సమర్పించిన హైదరాబాద్ భక్తులు

వన్‌టౌన్, జూన్ 29 : ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి హైదరాబాద్ నార్సింగ్ సర్వీస్ రోడ్డులోని జయభేరి టెంపుల్ వీధికి చెందిన మాగంటి సత్యనారాయణమూర్తి, మధురావు కుటుంబసభ్యులు శనివారం రూ.40 లక్షలకు పైగా విలువైన బంగారు తాపడంతో చేసిన ఆభరణాలను సమర్పించారు. నాగాభరణం, జటాఝూటం, నాగపడగ, పానమట్టం, ధారపాత్ర, మకరతోరణం తదితర ఆభరణాలను ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు. ఆభరణాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మల్లేశ్వరస్వామికి అలంకరించారు. దాతలకు ఈవో అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు.

అర్ధరాత్రి ఘోరం

- ఐతవరం వద్ద రోడ్డు ప్రమాదం
- తండ్రీకొడుకు దుర్మరణం

రోడ్డు ప్రమాద సహాయ చర్యల్లో ఉండగా ఘటన



ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ



మృతులు మాధవరావు, రామరాజు (ఫైల్)

నందిగామ రూరల్, జూన్ 29 : విధి ఎప్పుడు ఎలా పరీక్ష పెడుతుందో, ఎందుకు ప్రాణం తీస్తుందో ఎవరికీ అర్థంకాని ప్రశ్నే. నందిగామ రూరల్ మండలం ఐతవరంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదమే ఇందుకు నిదర్శనం. విధులు ముగించుకుని ఇంట్లో ఉన్న ఒక కుమారుడు, అతనికి సాయం చేద్దామనుకున్న తండ్రి ఇద్దరూ ఒకేసారి అనుకోని రీతిలో మృతిచెందడం విధి ఆడిన వింత నాటకమే. ఒక రోడ్డు ప్రమాద సహాయక చర్యల్లో ఉన్న వీరిని మరో రోడ్డు ప్రమాదం కబళించడం కన్నీరు తెప్పించే విషయమే. వివరాల్లోకి వెళితే.. ఐతవరం గ్రామ సమీపంలోని సొసైటీ వద్ద, జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఓ లారీడ్రైవర్ తన లారీని ఆపాడు. చిరుజల్లులు పడుతున్న ఆ సమయంలో విజయవాడ వైపు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ లారీ వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే, కీసర టోల్‌ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రామరాజు (39) విధులు ముగించుకుని ఇంట్లో ఉండగా, టోల్‌ప్లాజా నుంచి ఫోన్ వచ్చింది. ప్రమాదం జరిగిన ప్రాంతానికి రక్షణ గార్డులు పంపుతున్నామని, లారీల ఫొటోలు తీసి ఆ గార్డులు అక్కడ ఏర్పాటుచేయాలని వారు రామరాజును ఆదేశించారు. ఇంట్లో సేదతీరుతున్న రామరాజు ప్రమాదస్థలిలో రక్షణ గార్డులు అమర్చడానికి బయల్దేరాడు. ఇంతలో ఆ ప్రాంతంలో వాటర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రామరాజు తండ్రి సంకు మాధవరావు (59) కుమారుడిని అనుసరించాడు. ఇద్దరూ ప్రమాదానికి గురైన గ్యాస్ సిలిండర్ లారీ ఎదురుగా నిలబడి ఉండగా, విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ వెనుకగా వచ్చి ఢీకొట్టింది. మాధవరావు, రామరాజును తొక్కుకుంటూ ఖాళీ స్థలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం ఆ కంటైనర్ ఆర్టీసీ బస్సును స్వల్పంగా ఢీకొట్టింది. టోల్‌ప్లాజా సిబ్బంది ఆ కంటైనర్ లారీని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. రామరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకుని వారంతా గుండలవిసేలా విలపించారు. ఎస్ఐ దుర్గామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత వెంకట కృష్ణప్రసాద్, మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు పరామర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం, టోల్‌ప్లాజా అధికారులు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

ఇంటికే రేషన్

వీధుల్లో వాహనాలు పెట్టి ఇచ్చే పద్ధతికి చెల్లు

- రేపటి నుంచి జిల్లావ్యాప్తంగా రేషన్ పంపిణీ
- ఎండీయూ ఆపరేటర్లే ఇంటింటికీ వెళ్లాలని ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నిత్యావసరాలను ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటివరకు అస్తవ్యస్తంగా ఉన్న డోర్ టు డోర్ పంపిణీ విధానాన్ని ప్రతి గడపకు చేర్చేలా చర్యలు తీసుకుంది. సోమవారం నుంచి ప్రతి గడప తొక్కి నిత్యావసరాలు ఇవ్వాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించింది. జూలై 1 నుంచి 20వ తేదీ వరకు యథావిధిగా ఎండీయూ ఆపరేటర్లే నిత్యావసరాలను పంపిణీ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీని చేపట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఎండీయూ ఆపరేటర్లు తాము ఎంపిక చేసిన వీధుల్లో వాహనాన్ని పార్కింగ్ చేసి బియ్యాన్ని పంపిణీ చేసేవారు. ఇంటి వద్దకు వచ్చి బియ్యం ఇచ్చింది లేదు. అలాగే, ఉదయాన్నే కాకుండా, అందరూ పనులకు వెళ్లిన సమయంలో ఎండీయూ ఆపరేటర్లు రావటంతో చాలామంది రేషన్ అందుకోలేని పరిస్థితి ఉండేది. ఇన్ని సమస్యలున్న ఈ విధానంపై ప్రభుత్వం త్వరలో సమీక్షించనుంది. ప్రస్తుతానికి సోమవారం నుంచి డోర్ టు డోర్ విధానాన్ని నూరుశాతం అమలు చేసేలా సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు.. జిల్లాస్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చింది. గతంలోలా ఏదో ఒక బజారులో వాహనాన్ని పెట్టి బియ్యం ఇవ్వటం కాకుండా, ప్రతి ఇంటికీ వెళ్లి బియ్యం అందించాలని స్పష్టం చేసింది.

మదర్సా ఘటనపై కలెక్టర్ ఆరా



మృతురాలు కరిష్మా (ఫైల్)

కేసును వేగవంతం చేసిన పోలీసులు

- పిల్లలను తీసుకెళ్లిపోయిన తల్లిదండ్రులు
- ఖాళీ అయిన అజిత్‌సింగ్‌నగర్‌లోని మదర్సా
- పోలీసుల అదుపులో నిర్వాహకుడు

6లో..

ప్యాకేజీలపై ప్రశ్నలు, గందరగోళం

అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు రైతుల సమావేశం నేటికి వాయిదా

6లో..

ఇద్దరినీ చంపాలనే..

తండ్రీ కూతురిపై పగ పెంచుకున్న మణికంఠ

- మొదటి నుంచి ప్రేమను తిరస్కరించిన దర్శిని
- కూతురు వెంట పడొద్దని వారించిన శ్రీరామచంద్రప్రసాద్
- వారం పాటు బృందావన్ కాలనీలో మణికంఠ రెక్కీ
- మాంసం నరికే కత్తితో శ్రీరామచంద్రప్రసాద్ హత్య

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బృందావన్ కాలనీలో జరిగిన వ్యాపారి హత్య కేసులో కొత్త కోణాలు బయటకొస్తున్నాయి. వ్యాపారి శ్రీరామచంద్రప్రసాద్‌తో పాటు ఆయన కుమార్తె దర్శినీని కూడా హత్య చేయాలని మణికంఠ నిర్ణయించుకున్నాడు. మణికంఠను శనివారం పున్నమి ఘాట్ వద్ద పోలీసులు అరెస్టు చేసి, విచారణ చేశారు. ఈ విచారణలో అసలు విషయాలు బయటపడ్డాయి. దర్శిని తనకు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైందని, తరచూ మాట్లాడుకునేవారమని అంగీకరించాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వేధించేవాడు. ఆమె అనేకసార్లు తిరస్కరించింది. అయినా వెంటపడుతుండేవాడు. ఈ విషయాన్ని దర్శిని తన తండ్రి శ్రీరామచంద్రప్రసాద్‌కు చెప్పింది. ఆయన మణికంఠ తల్లికి విషయం చెప్పాడని దర్శిని చెబుతోంది. నెలరోజుల క్రితం శ్రీరామచంద్రప్రసాద్.. మణికంఠ ఇంటికి వెళ్లాడు. అక్కడ గొడవ జరగడంతో తప్పు తన కుమారుడిదేనని మణికంఠ తల్లి అంగీకరించింది. ఈ విషయంలో మణికంఠ, అతడి తల్లికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. తల్లి మాట్లాడటం మానేసింది. అప్పటి నుంచి శ్రీరామచంద్రప్రసాద్, దర్శినీలను హత్య చేయాలని మణికంఠ భావించాడు. శ్రీరామచంద్రప్రసాద్ నిత్యం ఉదయం బృందావన్ కాలనీకి వస్తారు. ఇక్కడే కిరాణా వ్యాపారం చేస్తుంటారు. ఆయన భార్య రోజూ మధ్యాహ్నం భోజనం తీసుకొచ్చేది. ఈనెల 27వ తేదీన దర్శిని తండ్రికి భోజనం తీసుకొచ్చింది. అప్పటికే నాలుగు రోజుల నుంచి తండ్రీకూతుళ్ల కదలికలను మణికంఠ గమనించాడు. 27వ తేదీ మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లిన దర్శిని.. తండ్రితో కలిసి రాత్రికే తిరిగి ఇంటికి వస్తుందని గ్రహించాడు. అదునుగా చేసుకుని మాంసం నరికే కత్తి తీసుకుని బృందావన్ కాలనీ సింధు భవన్ వద్ద కాపుకాశాడు. ఇంటికి బయల్దేరిన శ్రీరామచంద్రప్రసాద్‌పై దాడిచేసి చంపేశాడు. అతడిని అడ్డుకునే ప్రయత్నంలో దర్శినికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, మణికంఠను కృష్ణలంక పోలీసులు విజయవాడలోని రెండో ఏసీఎంఎం కోర్టులో హాజరుపరిచారు.



గొల్లపూడిలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల గోదామును పరిశీలిస్తున్న సీఈవో ముఖేశ్ కుమార్ మీనా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ఈవీఎంలు, వీవీ ప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూన్ 29: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం), వీవీ ప్యాట్లు ఉంచిన గోదాముకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం గొల్లపూడిలోని ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన గోదామును రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా, సమన్వయ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆమె పరిశీలించారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలకోసారి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేస్తామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలించినట్లు వివరించారు. వర్షాకాలం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, వై.రామయ్య(టీడీపీ), వై.ఆంజనేయరెడ్డి, ఎల్.శివరామ్‌ప్రసాద్(వైసీపీ), బి.కిరణ్ (ఐఎన్‌సీ), వై.కృష్ణకిశోర్ (నవతరంపార్టీ) పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 29: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గాన ద్వారకాతిరుమల వెళుతూ అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్, ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. నూజివీడు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి సన్నిధిలో జస్టిస్ వెంకటజ్యోతిర్మయి దంపతులు

ఎన్‌హెచ్ పెండింగ్ పనులపై చంద్రబాబుకు నివేదిక

వన్‌టౌన్, జూన్ 29: విజయవాడ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారుల పెండింగ్ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నివేదిక ఇచ్చారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేశ్‌తో పాటు చంద్రబాబును చిన్ని కలిశారు. ఢిల్లీలో జాతీయ రహదారుల విభాగం, జాతీయ రోడ్డు రవాణా మంత్రిత్వశాఖల ద్వారా సేకరించిన పెండింగు పనుల వివరాలను నివేదిక రూపంలో అందించానని తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పెండింగ్ పనుల వివరాలు తెలుపుతున్న ఎంపీ కేశినేని చిన్ని

రైతు సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు

» రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశంలో ఏపీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, జూన్ 29: రైతు సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతు ఉద్యమాలు కొనసాగుతాయని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు స్పష్టంచేశారు. సమితి సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు ద్రోహం చేసిన బీజేపీ సంఖ్యాబలం తగ్గడానికి 14 నెలల రైతు ఉద్యమమే కారణమన్నారు. ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీల సహకారం లేకుండా కేంద్ర ప్రభుత్వ మనుగడ సాగదన్నారు. రాహుల్‌గాంధీ జోడోయాత్ర వల్ల కాంగ్రెస్‌పార్టీకి పార్లమెంట్‌లో సభ్యుల సంఖ్య పెరిగిందన్నారు. జూలై 10న ఢిల్లీలో నిర్వహించే సంయుక్త మోర్చా అనుబంధ రైతు సంఘాల ప్రతినిధులందరూ విస్తృతస్థాయి సమావేశానికి హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా చేయించాలని రైతు సంఘం సీనియర్ నేత కేశవరావు డిమాండ్ చేశారు. రైతు నేతలు కేవీవీ ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ, ఎం.కృష్ణయ్య, చుండూరు రంగారావు, కొల్లా రాజమోహన్, గోపాలకృష్ణయ్య, కూర ప్రసాద్, హరినాథ్, అక్కినేని భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత రైతు నేతలు అతుల్‌కుమార్ అంజన్, యెర్నేని నాగేంద్రబాబు, మాజీ మంత్రి యేర్నేని సీతాదేవి, పత్రికా సంపాదకుడు చెరుకూరి రామోజీరావు చిత్రపటాలకు నేతలు నివాళులర్పించారు.

ముగిసిన పీఏసీఎస్ ఈవోల శిక్షణ

వన్‌టౌన్, జూన్ 29: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను డిజిటలీకరించి ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కేంద్ర సహకార శాఖ నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. శనివారం కేబీఎన్ కళాశాలలో ఎన్టీఆర్ జిల్లాలోని 58 మంది కార్యనిర్వాహణాధికారులకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డ్ సంయుక్త సహకారంతో సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చేందుకు శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ పోర్టల్ ద్వారా ప్రభుత్వపరంగా అందించే సేవలు, బ్యాంకింగ్, బీమా ఆన్‌లైన్ సర్వీస్‌లు అందుతాయన్నారు. 32 కేంద్ర ప్రభుత్వ సేవలు, 174 రాష్ట్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. రెండు రోజుల శిక్షణలో 116 పీఏసీఎస్‌ల కార్యనిర్వాహణాధికారులు పాల్గొన్నారని తెలిపారు. పోర్టల్‌లోని వివిధ సేవలనుపై ఏపీ సీఎస్‌సీ రాజాబాబు వివరించారు.

అధికారులు సహకరించటం లేదు

● కమిషనర్‌ను కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

● టీడీపీ నేతలు చెప్పినట్టు వింటున్నారని ఫిర్యాదు ● అదేం లేదన్న కమిషనర్

చిట్టినగర్, జూన్ 29: వైసీపీ కార్పొరేటర్లలో అక్రమ కట్టడాల భయం వెంటాడుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అక్రమ భవన నిర్మాణాలను ప్రోత్సహించి దగ్గరుండి ఎత్తులు పెంచారు. తద్వారా అందినకాడికి వెనకేసుకున్నారు. డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనుల కంటే అక్రమ కట్టడాల కే ప్రాధాన్యత ఇచ్చి రూ.లక్షల్లో సంపాదించారు. ప్రభుత్వం మారడంతో వైసీపీ కార్పొరేటర్లలో గుబులు మొదలైంది. డివిజన్లలో టీడీపీ నేతల ప్రమేయం ఏమీ లేకపోయినా ఏదో జరిగిందంటూ నానాయాగీ చేస్తున్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు నిలిపేశారని, అధికారులు తమ ఫోన్‌లు లిఫ్ట్ చేయటంలేదని, టీడీపీ కార్పొరేటర్లు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తున్నారని వైసీపీ కార్పొరేటర్లు కమిషనర్ వద్ద వాపోయారు. కమిషనర్ స్వప్నల్ మాత్రం పనులు నిలిపివేయమని తామెవరికీ చెప్పలేదని సమాధానం ఇచ్చారు. అయితే వైసీపీ కార్పొరేటర్లలో మాత్రం భయం వెంటాడుతుంది. గతంలో తాము ఏకాధిపత్యంతో టీడీపీ శ్రేణుల పట్ల వ్యవహరించిన తీరు తమకెక్కడ ఎదురవుతుందోనన్న భయం వెంటాడుతోంది. దీంతో శనివారం వైసీపీ ఫ్లోర్‌లీడర్‌తోపాటు సుమారు 30 మంది కార్పొరేటర్లు కమిషనర్‌ను కలిశారు. కార్పొరేషన్‌లో తాము అధికారంలో ఉన్నా టీడీపీకి ప్రాధాన్యత ఇస్తున్నారని, వారు చెప్పిన పనులు చేస్తున్నారని, డివిజన్‌లో కట్టడాలను కూలుస్తున్నారని ఆరోపించారు. 64వ డివిజన్‌లో రోడ్డు పక్కనే ఆక్రమణలు తొలగించడాన్ని జీర్ణించుకోలేని ఓ కార్పొరేటర్ ఏసీపీతో పాటు అధికారులపై ఆగ్రహావేశాలను వెల్లగక్కింది. మిగిలిన ఒకటిన్నరేళ్లు తమ పరిస్థితి ఏమిటోనని ఆలోచనలో పడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ శ్రేణులతో గొడవలు పడి రాణించగలమా అన్న డైలమాలో పడ్డారు.

రూ. 3వేల నుంచి రూ.4 వేలకు పింఛన్ పెంచి

మాట నిలబెట్టుకున్నాం

రేపు లబ్ధిదారులకు రూ.7వేలు అందిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 29: పింఛన్ సొమ్మును రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని, ఆ సొమ్మును మునుపటి నెలల బకాయిలతో కలిపి రూ.7 వేల చొప్పున జూలై 1న ఉదయం 6 గంటలకే సచివాలయ కార్యదర్శులు ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మంత్రి మాట్లాడారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 31,068 మందికి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. గతంలో మచిలీపట్నం నియో జకవర్గంలో రూ.9.31 కోట్లు పంపిణీ చేయగా, ప్రస్తుతం పెంచిన పింఛనుతో కలిపి రూ.21 కోట్లకు పైగా పంపిణీ చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో మచిలీపట్నాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు మోటమర్రి బాబా ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఇన్‌చార్జి డీఆర్డీయే పీడీ, డీపీవో నాగేశ్వర నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణాజిల్లాలో 2,42,341 మందికి ఇంటి వద్దకే పింఛన్లు

» రూ.162.42 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు చేశాం: కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): "కృష్ణాజిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 2,42,321 మందికి జూలై 1న ఇంటివద్దకే సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలో రూ. 162.42 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జూలై 1వ తేదీన ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తారు. ధ్రువీకరణపత్రాలు, ముఖ్యమంత్రిలేఖను పింఛనుతోపాటు అందిస్తారు." అని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక పింఛన్ల పంపిణీపై ఆయన సమీక్ష నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి నూతనంగా రూపొందించిన మొబైల్‌యాప్‌ను అధికారులు, సచివాలయ సిబ్బంది ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నారని ఆయన తెలిపారు. బయోమెట్రిక్ పరికరాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే బ్యాంకులనుంచి 70శాతం నగదును డ్రా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేయిస్తున్న అధికారులు

కబ్జాకు గురైన కామన్ స్థలానికి ఫెన్సింగ్

● అంబాపురంలో వైసీపీ నేతల ఆగడాలకు చెక్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ రూరల్, జూన్ 29: మండలంలోని అంబాపురం గ్రామ పంచాయతీలో వైసీపీ నేతల కంబద హస్తాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కబ్జాకు గురైన రూ.కోటి విలువైన స్థలానికి ఫెన్సింగ్ వేశారు. పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 97/2లో పంచాయతీకి చెందిన 370 గజాల స్థలం ఉం ది. సదరు స్థలంపై కన్నేసిన గ్రామ వైసీపీ నేత బెంజిమెన్, అతడి సోదరుడు విజయ్‌కుమార్ గత ఏడాది ప్రభుత్వ స్థలంలో పాగా వేశారు. కొంతభాగంలో రేకుల షెడ్ నిర్మా ణం జరిపి మరి కొంతభాగాన్ని స్వాధీనంలో ఉంచుకున్నా రు. దీనిపై అప్పట్లో అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ప ట్టించుకోలేదు. అధికారులను సైతం వారు బెదిరింపులు గు రి చేశారు. దీంతో అధికారులెవరూ వెళ్లకపోవడంతో నాటినుంచి ఆ స్థలం వైసీపీ నేతల స్వాధీనంలోనే ఉంది. ఈ వి షయమై గత నెలలో 'కన్ను గప్పి కబ్జా' పేరుతో ఆంధ్రజ్యోతిలో కథనం కూడా ప్రచురితమైంది. అప్పట్లో స్పందించడానికి వెనకడుగు వేసిన అధికారులు ప్రభుత్వం మారడం తో చర్యలకు సిద్ధమయ్యారు. వైసీపీ నేతల ఆక్రమణలోని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. అలాగే ఆక్రమిత స్థలంలో నిర్మించిన రేకుల షెడ్‌పై పంచాయతీ స్థలంలో నిర్మించినట్టు పెయింటింగ్ రాయించారు.



టీడీపీ నేతలంతా

ఎంపీ కేశినేని చిన్నిని సత్కరిస్తున్న బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, పట్టాభిరామ్, చెన్నుపాటి శ్రీను

ఒకే మాట, బాటగా నడుస్తాం

సీనియర్ నాయకులకు పదవుల్లో న్యాయం జరిగేలా చూస్తాం: ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జూన్ 29: "టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న చిత్తశుద్ధితో పని చేసే నాయకుడు. నాకు, బుద్దా వెంకన్నకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు. నాగుల్ మీరా, బుద్దా వెంకన్న ఎనికల్లో నాకు పూర్తి సహకారం అందించారు. అండగా నిలిచారు. ఇక నుంచి నగరంలో ఉన్న టీడీపీ నాయకులమంతా ఒకే మాట, ఒకే బాటగా నడుస్తాం. పశ్చిమ నియోజకవర్గంలోని సీనియర్ నాయకులకు పదవుల్లో న్యాయం జరిగేలా చూస్తాం." అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుద్దా వెంకన్న నివాసంలో శనివారం కేశినేని చిన్నికి సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. రథం సెంటర్ నుంచి తన కార్యాలయం వరకు ఓపెన్ టాప్ జీప్‌పై చిన్నిని భారీ ర్యాలీతో వెంకన్న తీసుకొచ్చారు. నాయకులు నాగుల్‌మీరా, చెన్నుపాటి శ్రీను, పట్టాభిరామ్‌తో కలిసి ఎంపీని సత్కరించారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చెన్నుపాటి శ్రీనుకు కూడా పదవులు దక్కేలా కృషి చేస్తానని చిన్ని హామీ ఇచ్చారు. విజయవాడ టీం టీడీపీకి కేశినేని చిన్నిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), నాయకులు కాండ్రేగుల రవీంద్ర, పేరాబత్తుల రమణ, కామదేవరాజు, కొట్టేటి హనుమంతరావు, ఈగల సాంబ, నందకుమారి, తుపాకుల రమణమ్మ, పత్తి నాగేశ్వరరావు, మైలవరపు వీరబాబు, గుర్రం కొండా, గంగాధర్ రెడ్డి, కుంచం దుర్గారావు, వల్లభనేని ప్రసన్నలక్ష్మి, పితాని పద్మ, షేక్ అమానుల్లా, బడుగు వెంకన్న, శివాజీ పాల్గొన్నారు.

చిన్ని సారథ్యంలో నడుస్తాం: బుద్దా వెంకన్న

"కేశినేని చిన్ని అంకితభావం గల నాయకుడు. మరో రెండుసార్లు విజయవాడ ఎంపీగా ఆయన ఎన్నికవుతారు. మూడోసారి ప్రమాణస్వీకారం చేసేంతవరకు ఆయన వెంట ఉంటా. కేశినేని నాని ఎంపీగా ఎన్నికయ్యాక చంద్రబాబుపై వ్యాఖ్యలు చేశారు. అందువల్లే ఆయనను వ్యతిరేకించా. ఇప్పుడు మేమంతా చిన్ని సారథ్యంలో నడుస్తాం. పశ్చిమ నియోజకవర్గంలోని నాయకులందరం చిన్నితోనే ఉంటాం. చిన్నిపై అనవసరంగా ఎవరైనా నోరు పారేసుకుంటే అక్కడ నుంచే మా పోరాటం ప్రారంభిస్తాం" అని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

మదర్సా ఘటనపై ఎన్టీఆర్ కలెక్టర్ ఆరా

» సృజన ఆదేశాలతో కేసును వేగవంతం చేసిన పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 29: అజిత్‌సింగ్‌నగర్ మదర్సా ఘటనపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆరా తీశారు. జరిగిన ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరిష్మా మృతి పట్ల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో పోలీసులు కేసును వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. కాగా మదర్సాలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో పాటుగా తెలంగాణకు చెందిన విద్యార్థినులు 60 మందికి పైగా ఉన్న విషయం తెలిసిందే. కరిష్మా అనుమానాస్పదంగా మృతిచెందడంతో మదర్సా నుంచి విద్యార్థినులను తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. దీంతో మదర్సా ఖాళీ అయిపోంది. మదర్సా నిర్వాహకుడు సయ్యద్ షాహీద్ ఫర్వీజ్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఇప్పటికే మదర్సాలో నిల్వ ఉంచిన బీఫ్, మటన్ శాంపిల్స్‌ను ల్యాబ్ టెస్టింగ్‌కు అధికారులు పంపించారు. మదర్సాలో మొత్తం 60 మంది విద్యార్థులు ఉండగా కరిష్మాకు మాత్రమే ఫుడ్ పాయిజన్ కావడంపై సర్వత్రా అనుమానాలు రేకెత్తుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసును మరింత వేగవంతం చేశారు.

కారు అడ్డుతీయమని హారన్ కొట్టినందుకు

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి

» ఇద్దరిపై కేసు

గుడివాడ: బస్సుకు అడ్డుగా ఉన్న కారును తీయమని హారన్ కొట్టినందుకు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై ఇద్దరు దాడి చేశారు. ఈ ఘటన గుడివాడలో శనివారం జరిగింది. డ్రైవర్ ఫిర్యాదుపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలి పారు. అవనిగడ్డ నుంచి గుడివాడకు ఏపీ 39 యూజే 6006 నెంబరు ఆర్టీసీ బస్సు వస్తుండగా స్థానిక హోటల్ అతిథి ఇన్ వద్ద ఏపీ 16డీజే 8010కారు అడ్డుగా ఉంది. కారును పక్కకు తీయాలని బస్సు డ్రైవర్ సిరిపెళ్ల రాకేష్ పలుమార్లు హారన్ కొట్టాడు. దీంతో ఫుల్లుగా మద్యం తాగి ఉన్న ఇద్దరు కారు నుంచి దిగి డ్రైవర్‌ను దుర్భాషలాడి, చెయ్యి చేసుకున్నారు. స్థానికులు గుమిగూడడంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపో యారు. మళ్లీ వారు నేరుగా బస్టాండ్‌కు వెళ్లి బస్సు డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారు. రాకేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఎం.నాగ దుర్గారావు తెలిపారు. దాడికి పాల్పడిన వారి వివరాలు ఇంకా తెలియలేదు.



దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గుడివాడ ఆర్టీసీ డిపో వద్ద డిమాండ్ చేస్తున్న డ్రైవర్లు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: సీఐటీయూ

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిచేసి గాయపరచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్వీపీ రెడ్డి డిమాండ్ చేశారు. కారు అడ్డుగా ఉండటంతో డ్రైవర్ హారన్ కొట్టాడని, దీనికే ఇద్దరు నేరుగా బస్టాండ్‌లోకి వచ్చి దాడి చేశారని, రాష్ట్రంలో అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె బస్సు



ఉండవల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు, అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాకేజీలపై ప్రశ్నలు, గందరగోళం

» అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ రైతుల సమావేశం నేటికి వాయిదా

తాడేపల్లి టౌన్, జూన్ 29: సీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణ కోసం గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి గ్రామ సచివాలయం-2లో సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశం గందరగోళానికి దారితీసింది. సమావేశం ప్రారంభం కాగానే ఓ రైతు భూములకు సంబంధించి వివరాలు తెలపాలని కోరారు. అదేవిధంగా ఎంత ప్యాకేజీ ఇస్తారు? ఏ విధంగా ఉంటుంది? అని ప్రశ్నిస్తుండగా అక్కడే ఉన్న టీడీపీకి చెందిన రైతులు కలగజేసుకుని గత ప్రభుత్వంలో నాలుగేళ్లుగా ఏం చేశారంటూ నిలదీశారు. ఇప్పుడు వచ్చి ప్రశ్నిస్తున్నారని, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా మళ్లీ సర్వే ఎలా చేస్తారని కొందరు రైతులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రెండున్నరేళ్లపాటు కనీసం కౌలు డబ్బులు కూడా ఇవ్వకపోతే ఎందుకు నిలదీయలేదని మరికొందరు రైతులు ప్రశ్నించారు. రాజధాని పేరుతో ధరలు పెరగ డంతో భూములను రూ.కోట్లకు అమ్ముకుంటున్నారని, అమరావతి కోసం ఏర్పాటు చేస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డుకు అడ్డుపడుతూ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తు న్నారని విమర్శించారు. రైతుల అరుపులు, కేకలతో గందరగోళం ఏర్పడ డంతో డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు సమావేశం అర్ధాంతరంగా నిలిపి వేశారు. ఆదివారం సాయంత్రం మరోసారి భేటీ అవుదామని రైతులకు తెల్పి చెప్పారు.

ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

» విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఎఫ్ఏల సస్పెన్షన్

» ఏపీవో, టీఏలకు షోకాజ్‌లు: డ్వామా పీడీ సూర్యనారాయణ

చల్లపల్లి, జూన్ 29: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలని జిల్లా డ్వామా పీడీ జీఎన్ సూర్యనారాయణ సూచించారు. చల్లపల్లి మండల పరిషత్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామాల వారీగా తనిఖీ వివరాలను ఆయన పరిశీలించారు. తమ గ్రామంలో చెరువు తవ్వకం అసంపూర్తిగా చేశారని, ఉపాధి పథకం సిబ్బందికి చెప్పినా పట్టించుకోవటం లేదని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు చెప్పడంతో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవోలను పీడీ మందలించారు. సాంకేతిక సమస్యలను వారు ప్రస్తావించగా మీస్థాయిలో పరిష్కరించలేని సమస్యను తన దృష్టికి ఎందుకు తేలేదని ప్రశ్నించారు. ఎన్నోసార్లు కాన్ఫరెన్సులు పెట్టాను. సమస్యను చెప్పారా అని నిలదీశారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించిన కారణంగా ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు పీడీ సూర్యనారాయణ తెలిపారు. నడకుదురు ఎఫ్ఏ కె.గంగాభవాని, మాజేరు ఎఫ్ఏ ఎం.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశామన్నారు. పేదలకు 100 రోజుల పనికల్పించే విషయంలో అశ్రద్ధ, మస్టర్ దిద్దివేతలు, విధుల్లో నిర్లక్ష్యం వహించటం కారణాలతో చర్యలు తీసుకున్నామన్నారు. ఏపీవో, టీఏలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఏపీడీ పి.రామ్మోహనరావు, అంబుడ్స్‌మెన్ జి.శ్రీనివాసరావు, ఎస్ఆర్పీ సత్యనారాయణ, ఏవో నాగమహేష్‌రావు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 1,940 కేసుల పరిష్కారం

మచిలీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 40 బెంచ్‌లలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 1,940 పెండింగ్ కేసులను పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. 1,144 క్రిమినల్, 180 సివిల్, ఇన్సూరెన్స్ సంస్థలకు సంబంధించి 170 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. 82 మోటారు వాహన కేసులు పరిష్కరించి రూ.69.03 లక్షలను బాధితులకు ఇప్పించామన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పామర్రు అభివృద్ధికి తోడ్పాటునందించండి

» కలెక్టర్‌కు ఎమ్మెల్యే కుమార్‌రాజా వినతి

పామర్రు/ కూచిపూడి: నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కలెక్టర్ డీకే బాలాజీని శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు. కలెక్టర్‌ను సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, రైతుసంఘ ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, కూటమినేతలు పాల్గొన్నారు.

వార్ @ మేయర్

(మొదటి పేజీ తరువాత)

ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించిన వెంటనే మేయర్ అభ్యర్థిగా బండి పుణ్యశీల పేరు తెరపైకి వచ్చింది. అయితే, అప్పట్లో మంత్రిగా ఉన్న వెలంపల్లి రాజకీయం కారణంగా పుణ్యశీలకు మేయర్ సీటు దక్కలేదు. దీంతో అప్పటి నుంచి ఆమె తీవ్రమైన అసంతృప్తితో రగిలిపోతున్నారు. పుణ్యశీల 34వ డివిజన్ నుంచి విజయం సాధించారు. అంతకుముందు ఐదేళ్లపాటు వైసీపీ ఫ్లోర్‌లీడర్‌గా పనిచేశారు. దీంతో పుణ్యశీలను మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేశారని భావించారు. చివరి నిమిషంలో అనూహ్యంగా 46వ డివిజన్ కార్పొరేటర్ రాయన భాగ్యలక్ష్మి పేరును ప్రతిపాదించి, అధిష్ఠానంతో ఆమోదముద్ర వేయించుకోవడంలో వెలంపల్లి విజయం సాధించారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకున్న పుణ్యశీల.. మేయర్, డిప్యూటీ మేయర్లపై అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లతో జతకట్టి ఓ గ్రూపును తయారు చేశారు. అవుతు శైలజారెడ్డి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ సైతం తమకు అనుకూలమైన కార్పొరేటర్లతో జత కట్టి వీఎంసీలో పైచేయి సాధించాలని చూస్తున్నారు. మేయర్‌గా భాగ్యలక్ష్మి పదవీకాలం మూడేళ్లు పూర్తికావడంతో ఆమెను పక్కనపెట్టి టీడీపీ వారితో కలిసి మేయర్ సీటును అధిష్ఠించేందుకు ఎవరికి వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29: గ్రామీణ ప్రజలకు, మహిళలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తూ వీరవల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ యార్లగడ్డ మాధవి సేవలందించడం అభినందనీయమని సర్పంచ్ పిల్లా అనిత కొనియాడారు. చీఫ్ మేనేజర్‌గా పదవీవిరమణ చేసిన యార్లగడ్డ మాధవికి గుడివాడ ఆర్ఎం(రీజనల్ మేనేజర్) జీఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ 35 ఏళ్లుగా వివిధ రకాల బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువచేయడంతో పాటు, డ్వాక్రా మహిళలు, రైతులకు మెరుగైన సేవలందించి వీరవల్లి శాఖను ముందంజలో నిలిపేందుకు మాధవి చేసిన కృషి అద్వితీయమని నాయకులు లంక సురేంద్రమోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్ పేర్కొన్నారు. మాధవి, రవికుమార్ దంపతులను బాపులపాడు మండల ఏపీఎం భూపతిరావు, కలపాల నాని, డ్వాక్రా మహిళలు, స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు.



పదవీ విరమణ చేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ యార్లగడ్డ మాధవి దంపతులను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు, స్థానిక నేతలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ధర్నాచౌక్, జూన్ 29: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అసోసియేషన్ ఆవరణలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు.

గణాంక శాస్త్రంపై పట్టు ఉండాలి

● గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కిరణ్‌కుమార్
● స్టాటిస్టికల్ డే సందర్భంగా నగరంలో పలు కార్యక్రమాలు

వన్ టౌన్, జూన్ 29: దేశాభివృద్ధి కోసం రూపొందించే ప్రణాళికలకు గణాంకాలు ఎంతో దోహదం చేస్తాయని గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్‌కుమార్ అన్నారు. స్టాటిస్టికల్ డేను పురస్కరించుకుని కేబీఎన్ కాలేజీ మేథమేటిక్స్, గణాంకాల విభాగం, జాతీయ గణాంకాల కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సమాజవికాసానికి, దేశాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి గణాంకాలు చాలా అవసరమని తెలిపారు. గణాంకాలను సేకరించడం, ఫలితాలను విశ్లేషించేందుకు గణాంక శాస్త్రంపై పట్టు ఉండాలని తెలిపారు. గణాంకశాస్త్రంలో నిపుణులకు మంచి ఉపాధి అవకాశాలున్నాయన్నారు. కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కళాశాల గణాంకశాఖ విభాగాధిపతి సీహెచ్ రాధిక, అధ్యాపకులు శేషుబాబు, కల్మబేగం పాల్గొన్నారు.


విజేతలతో గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కిరణ్‌కుమార్


గాంధీజీ మహిళా కళాశాలలో


నలంద డిగ్రీ కళాశాలలో

● వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాలలో గణాంకాలు-ఉద్యోగావకాశాలు అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్ఞాన్ యూనివర్సిటీ గణాంకాల ప్రొఫెసర్ డాక్టర్ కే.కల్యాణి మాట్లాడుతూ డేటా విశ్లేషణ ప్రాముఖ్యత దేశానికి ఎంతో అవసరమన్నారు. సెక్రటరీ, కరస్పాండెంట్ సీఎల్ కాంతారావు, వైస్ ఛైర్మన్ కేవీ పిచ్చయ్య, ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ, గణాంకాల హెచ్‌వోడీ సీహెచ్ మహీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణాంకాల ఆవిష్కర్త పీసీ మహలనోబిస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం గణాంకాలలో నిపుణత సాధించిన విద్యార్థినులకు జ్ఞాపికలను అందజేశారు.

● ఏపీ పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయి 49వ ర్యాంకు సాధించిన కళాశాల విద్యార్థిని ఎస్‌కే నీలం జహా, 89వ ర్యాంకు సాధించిన ఎండీ సహిస్తా బేగంలను సీఎల్ కాంతారావు, కే.వీ పిచ్చయ్య, రమణశ్రీలు అభినందించారు. వారిద్దరికీ బహుమతులు అందజేశారు.

మొగల్రాజపురం: స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రోజువారీ జీవితంలో గణాంకాల ప్రాముఖ్యతను ప్రోత్సహించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. స్టాటిస్టిక్స్ విభాగానికి చెందిన విద్యార్థులు పోస్టర్ ప్రజంటేషన్ చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీలకు డాక్టర్. బి.జయప్రకాష్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి. బాబూ రావు, హెడ్‌వోడీ జి.చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాలలో జరిగిన సెమినార్‌లో డైరెక్టర్, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఏపీ సెక్రటేరియట్ డి.వి.వి .సీతాపతిరావు మాట్లాడుతూ స్టాటిస్టిక్స్‌లో నిష్ణాతులైన మహనీయులు పీసీ మహలనోబిస్, సీఆర్ రావులు వివిధ రంగాల్లో చేసిన సేవలను వివరించారు. అనంతరం యూనివర్సిటీ పరీక్షల్లో స్టాటిస్టిక్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, స్టాటిస్టిక్స్ అధ్యాపకులు పి.రవికుమార్, ఎ.గాయత్రి, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీనగర్: ఆంధ్ర లయోల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాంఖ్యాక శాస్త్ర నిపుణులు డాక్టర్ నడిపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణకుమార్, విభాగపతి సున్నా శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్

లబ్బీపేట, జూన్ 29: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమాన్ని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శనివారం లబ్బీపేటలోని సెయింట్ ఆన్స్ నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నేనే డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో అని ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా ఉంచడానికి అందరూ సహకరించాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి అంబ్రోసీ, ఉపాధ్యాయులు, నవజీవన్ బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్స్ ఎస్.జాకబ్ రాజు, ఎస్‌కె.నజ్మా, జె.జ్యోతి చంద్రి పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, జూన్ 29: చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 7వ డివిజన్ జమ్మిచెట్టుసెంటర్ ఎల్ఎస్ టవర్స్‌లో కాలనీ వాసులతో శనివారం ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీల మీద నమ్మకంతో ప్రజలు కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీలతో విజయాన్ని అందించారని అన్నారు. తాను మూడోసారి తూర్పు నుంచి ఎమ్మెల్యేగా గెలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. తాను విజయం సాధించడానికి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు, జగన్ ప్రజావ్యతిరేక విధానాలు కూడా కారణం అని చెప్పారు. చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ఎప్పుడైతే మద్దతు పలికారో అపుడే టీడీపీ విజయం ఖాయం అయిం దన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, బుజ్జి, జీవీఎస్ శర్మ, వెలగపూడి వెంకటేశ్వర రావు, బీఎస్ఎస్ కోటేశ్వరరావు, రామకోటయ్య, ధూళిపాళ్ల రమేష్, గద్దె రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాణిగారితోట: రాణిగారితోటలోని తాడికొండ సుబ్బారావు మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్, యూనిఫామ్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ పథకంలోని నిధులతో ఈ పాఠశాలలో ఖాళీ స్థలాల్లో భవనాల నిర్మాణం చేసి పదో తరగతి వరకు తరగతులు నిర్వహించడంతో పాటుగా జూనియర్ కళాశాలను కూడా ఏర్పాటు చేయిస్తానని అన్నారు. ఈ సందర్భంగా 17వ డివిజన్‌లో స్వయం ఉపాధి కింద ఉప్పల విజయలక్ష్మికి గద్దె రామ్మోహన్ టిఫిన్ బండిని అందజేశారు. ప్రధాన ఉపాధ్యాయులు బి.శ్రీదుర్గ, డివిజన్ అధ్యక్షులు దుర్గారావు, రాయి రంగమ్మ, ముని, కొక్కెర తిరుపతయ్య పాల్గొన్నారు.

భారతీనగర్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో మూడవ డివిజన్ పరిధిలోని శ్రీ రామచంద్ర నగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దెరామ్మోహన్ శనివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జూలై ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, యలమంచిలి పండు, గద్దె రాజేష్, పి.సీతారామయ్య, సూర్యనారాయణ, కొండయ్య, కోటేశ్వరరావు, సత్యనారాయణరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గాయాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ ప్రశాంత్

పటమట, జూన్ 29 : క్రీడల్లో కలిగే గాయాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరం అని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సీహెచ్ ప్రశాంత్ పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ మారు అధ్యక్షతన క్రీడల్లో గాయాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గాయాలు కేవలం వాపులు, బెణుకులు , నొప్పులు, కీళ్ల నొప్పులు, ముక్కు నుంచి రక్తం కారడం గానో మరో విధంగా ఉంటాయన్నారు. వెన్నుముకకి అయ్యే గాయాలు, తలకు తగిలే దెబ్బలు, నరాలకు తగిలే దెబ్బలు పక్షవాతాలకు కారణమవుతాయన్నారు. క్రీడల్లో గాయాలను నివారించాలంటే క్రీడలకు తగిన ఫిట్నెస్ ప్లాన్ ఉండాలని, కార్డియోస్కులర్ ఎక్సర్‌సైజు చేయాలని, ప్రతి క్రీడాకారుడికి క్రీడల్లో తగిలే గాయాలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి తప్పనిసరిగా అవగాహన అవసరమన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పటమట, జూన్ 29 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను మంగళగిరిలోని కేంద్ర టీడీపీ కార్యాలయంలో శనివారం గద్దె క్రాంతి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రానున్న రోజుల్లో యువతను టీడీపీకి మరింత చేరువ చేసేలా నారా లోకేశ్ నేతృత్వంలో ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎంతో మంది యువకులు పార్టీ కోసం పనిచేయడానికి ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఏపీ సీఆర్‌డీఏ ఉద్యోగుల సేవలు శ్లాఘనీయం


ఉద్యోగులను సత్కరించిన కమిషనర్

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 29 : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సాధికార సంస్థ(ఏపీ సీఆర్‌డీఏ) ఉద్యోగుల సేవలు శ్లాఘనీయమని సంస్థ కమిషనర్ కాటంనేని భాస్కర్ కొనియాడారు. సీఆర్‌డీఏ విభాగంలో ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్‌మెన్‌గా పని చేసిన సుడికొండ వెంకటేశ్వర్లు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్‌లో పని చేసిన చల్లా తిరుపాల్‌లు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కమిషనర్ భాస్కర్ వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర్లు, తిరుపాల్‌లు సంస్థకు అందించిన సేవలను కొనియాడారు.

కళాకారుడు రాంపిళ్ల మోహన్ కృష్ణ మృతి

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 29 : అనారోగ్యంతో బాధపడుతూ నాటక రంగం కళాకారుడు రాంపిళ్ల మోహన్ కృష్ణ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రజా నాట్యమండలి సభ్యులు అజిత్‌సింగ్‌నగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ప్రజా నాట్య మండలి నగర గౌరవ అధ్యక్షుడు కేవీ భాస్కరరావు, లంకా దుర్గారావు, నజీర్, రైల్వే రంగారావు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు

పాయకాపురం, జూన్ 29 : స్థానిక కండ్రిక కాలనీ ప్రధాన రహదారి వెంబడి ఆక్రమణలను శనివారం టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. కండ్రిక కాలనీ సెంటర్‌లో చాలా కాలంగా రోడ్డును ఆక్రమించుకుని పలువురు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీరిపై ఫిర్యాదులు అందటంతో స్పందించిన అధికారులు కాలనీ సెంటర్ ప్రధాన రహదారి వెంబడి ఉన్న నాలుగు అక్రమ దుకాణాలను తొలగించారు.

అన్న ప్రసాద వితరణ

చిట్టినగర్, జూన్ 29: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ, కె.రాంకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం చిట్టినగర్ వీరాంజనేయ మార్కెట్‌లో వీరాంజనేయస్వామి ఆలయం ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సామాజిక వేత్త, న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా, మాజీ కార్పొరేటర్ డీవీ రమణబాబు, క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ దుర్గా మల్లేశ్వరరావు, అధ్యక్షుడు కె. రామలింగేశ్వరరావు, కోశాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో బొండా సమావేశం

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 29 : స్థానిక టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని చెప్పారు.

పదవీ విరమణ సత్కారం

చిట్టినగర్, జూన్ 29: పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేసిన వై. పద్మావతిని శనివారం కానూరులోని ఓ కల్యాణ మండపంలో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆమెను సత్కరించిన వారిలో పట్టణ ప్రణాళిక సంఘం సభ్యులు పి.. మోహన్‌బాబు, వెంకట కృష్ణ, వెంకటేశ్వరరావు, గంధం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అగ్రి డిప్లొమాలు



ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ/ఎన్‌ఐఓఎస్/ఏపీఓఎస్‌ఎస్/టీఓఎస్‌ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in

డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్‌ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్‌ఈ/ఎన్‌ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్‌ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్‌ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్‌ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఉస్మానియా యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

రిజిస్ట్రేషన్ ఫీజు: రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 30

వర్క్‌షాప్ వ్యవధి: జూలై 8 నుంచి 13 **వెబ్‌సైట్:** www.uceou.edu

దిక్సూచి DIKSUCHI

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉం టుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/soMebZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి


ఫహాద్‌పై సుమోటో కేసు

మలయాళ నటుడు, నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో




అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహాద్‌పై కేసు నమోదు చేసింది.

'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టి ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన ఆర్టిస్టుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.

గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మీ కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.


స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను



తమన్నా

దక్షిణాదిన అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడిపాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో" చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.

'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయుర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశ' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరఫున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడీ విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.

ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బొకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్తాం అక్కడికే వెళ్తాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్లు వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండొచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.

మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?

నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.


• సీవీఎల్ఎన్ ప్రసాద్



సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్స్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!



సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఇదో కెరీర్ అని ఒప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్(2010)'లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.



నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్గా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్పయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నుస్రత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'ఆజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్ లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నుస్రత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయ్యే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యుమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది.. తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.



భారత్ ఖాతాలో రెండో టీ20 ప్రపంచకప్



'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' బుమ్రా

కప్పు దంచేరె..

మది ఉప్పొంగె!

● ఉత్కంఠ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం ● విరాట్ అర్ధసెంచరీ
● అదరగొట్టిన హార్దిక్, బుమ్రా ● మలుపు తిప్పిన సూర్య క్యాచ్

1292 టీ20 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ చేసిన మొత్తం పరుగులు. టోర్నీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

281 ఈ వరల్డ్‌కప్‌లో రహ్మానుల్లా గుర్బాజ్ (అఫ్ఘానిస్థాన్) చేసిన పరుగులు. ఈ టోర్నీలో అత్యధిక పరుగుల వీరుడు ఇతనే.

98 నికోలస్ పూరన్ (వెస్టిండీస్) వ్యక్తిగత స్కోరు ఇది. ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరర్ ఇతనే.

17 ఫజల్ ఫరూఖి (అఫ్ఘానిస్థాన్), అర్ష్‌దీప్ పడగొట్టిన వికెట్లు. టోర్నీలో అత్యధిక వికెట్ల వీరులుగా నిలిచారు.

5/9 ఫరూఖి బౌలింగ్ గణాంకాలు. అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన ఇతనిదే.

8 టోర్నీలో భారత్, దక్షిణాఫ్రికా గెలిచిన మ్యాచ్‌లు. అత్యధిక విజయాలు ఈ జట్లవే.

26 ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) కొట్టిన ఫోర్లు. ఈ టోర్నీలో అత్యధిక ఫోర్లు ఇతనివే. ఇబ్రహీం జద్రాన్ (25), రోహిత్ శర్మ (22) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

17 నికోలస్ పూరన్ బాదిన సిక్సర్లు. ఈ టోర్నీలో అత్యధిక సిక్సర్ల వీరునిగా నిలిచాడు. గుర్బాజ్ (16), రోహిత్ శర్మ (15), హెడ్ (15)లది తర్వాతి స్థానం.

3 ఈ టోర్నీలో రోహిత్ శర్మ అత్యధికంగా మూడు అర్ధ సెంచరీ (7 మ్యాచుల్లో)లు సాధించాడు.

134 ఉగాండాపై వెస్టిండీస్ గెలిచిన పరుగుల తేడా. పరుగుల పరంగా ఓ జట్టుకు భారీ విజయం ఇదే.

10 అమెరికాపై ఇంగ్లండ్ గెలిచిన వికెట్ల తేడా. వికెట్ల పరంగా ఇదే భారీ గెలుపు.

218/5 అఫ్ఘానిస్థాన్‌పై వెస్టిండీస్ చేసిన ఈ స్కోరు ఈ టోర్నీలో ఓ జట్టుకు అత్యధికం.

39 వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఉగాండా చేసిన ఈ స్కోరు టోర్నీ చరిత్రలోనే అత్యల్పం.

డబ్బే డబ్బు

మొత్తం ప్రైజ్‌మనీ: రూ. 93.78 కోట్లు
చాంపియన్‌కు: రూ. 20.42 కోట్లు
రన్నరప్‌కు: రూ. 10.67 కోట్లు
సెమీస్‌లో ఓడిన జట్టుకు: రూ. 6.56 కోట్లు
సూపర్-8 పరాజితులకు: రూ. 3.18 కోట్లు
9 నుంచి 12వ స్థానం జట్లకు: రూ. 2.06 కోట్లు
13 నుంచి 20వ స్థానం జట్లకు: రూ. 1.87 కోట్లు
ఒక్కో మ్యాచ్‌కు: రూ. 25.97 లక్షలు

ఓహ్ గాడ్.. ఎన్నాళ్లకెన్నాళ్లకు.. మొత్తానికి 17 ఏళ్ల సుదీర్ఘ ఎదురుచూపులకు తెర పడింది. టన్నుల కొద్దీ టాలెంట్ ఉన్నా అందకుండా ఊరిస్తోన్న టీ20 టైటిల్ టీమిండియా దరి చేరింది. అజేయ ఆటతీరుతో దూసుకెళ్లిన రోహిత్ సేన అంతిమ సమరంలోనూ అదే సత్తా చూపింది. విరాట్ కోహ్లీ తన కెరీర్ చివరి టీ20లో ఫామ్‌ను చాటుకోగా.. బౌలర్లు ఒత్తిడికి లోనుకాకుండా తుదిపోరుకు చక్కటి ముగింపు నిచ్చారు. ఓ మాదిరి ఛేదనలో క్లాసెన్ గుబులు రేపినా.. చివరి 5 ఓవర్లలో 30 పరుగులే ప్రత్యర్థికి కావాల్సి వచ్చినా భారత్ బెదరలేదు. స్టార్ పేసర్ బుమ్రా పరుగులను కట్టడి చేయగా.. ఐపీఎల్‌లో తీవ్ర విమర్శలకు గురైన హార్దిక్ నేటి ఫైనల్లో హీరోగా నిలిచాడు. క్లాసెన్ వికెట్‌తో పాటు చివరి ఓవర్‌లోనూ రెండు వికెట్లతో ప్రభావం చూపాడు. దీంతో గెలవాల్సిన చోట సఫారీలు తడబడగా.. ఒత్తిడికి లోనుకాని భారత్ విశ్వవిజేతగా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది.

టీ20 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో అత్యధిక స్కోరు (176) నమోదు చేసిన జట్టుగా భారత్.

1 ఒక్క మ్యాచ్ కోల్పోకుండా టీ20 వరల్డ్‌కప్‌ను అందుకున్న జట్టుగా భారత్

ఒకే వరల్డ్‌కప్‌లో ఎక్కువ రన్స్ (243) చేసిన సౌతాఫ్రికా బ్యాటర్‌గా డికాక్

2 వరల్డ్‌కప్ చరిత్రలో నెమ్మదైన హాఫ్ సెంచరీ (48 బంతుల్లో) సాధించిన రెండో భారత బ్యాటర్‌గా కోహ్లీ. సూర్య (49) ముందున్నాడు.

అపజయమన్నదే ఎరుగని ప్రస్థానం..
రోహిత్ సేన అందించిన చరిత్రాత్మక విజయం..
హృదయం పులకించిన మధుర క్షణం..



హార్దిక్ భావోద్వేగం

బ్రిడ్జ్‌టౌన్: ఉత్కంఠభరితంగా ముగిసిన టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో రోహిత్ సేన 7 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో 2007 తర్వాత మరోసారి ఈ మెగా టోర్నీని కైవసం చేసుకున్నట్టయ్యింది. అలాగే 2011 తర్వాత ఏ ఫార్మాట్‌లోనైనా జట్టుకిదే తొలి వరల్డ్‌కప్. అటు మొదటిసారి ఐసీసీ టోర్నీలో ఫైనల్‌కు చేరిన దక్షిణాఫ్రికా విజయం అంచులవరకు వచ్చినా చివర్లో మ్యాచ్‌ను చేజార్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 76), అక్షర్ పటేల్ (31 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 47), శివమ్ దూబే (16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) రాణించారు. కేశవ్, నోకియాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసి ఓడింది. క్లాసెన్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52), స్టబ్స్ (31), డికాక్ (39), మిల్లర్ (21) రాణించారు. హార్దిక్‌కు మూడు.. బుమ్రా, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా బుమ్రా నిలిచారు.

చివర్లో పేసర్ల కట్టడి: ఓ మాదిరి ఛేదనలో సఫారీలు క్లాసెన్, స్టబ్స్ ధాటికి విజయం వైపు సాగినా.. డెత్ ఓవర్లలో బుమ్రా, హార్దిక్ ధాటికి పూర్తిగా తేలిపోయారు. రెండో ఓవర్‌లో బుమ్రా కళ్లు చెదిరే బంతితో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (4)ను బౌల్డ్ చేయగా.. ఆ వెంటనే కెప్టెన్ మార్‌క్రమ్ (4)ను అర్ష్‌దీప్ వెనక్కి పంపాడు. 12 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయిన దశలో ఓపెనర్ డికాక్‌కు స్టబ్స్ జత కలిశాడు. మరో ఆరు ఓవర్ల పాటు ఈ జోడీ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. కనీసం ఓ బౌండరీ ఉండేలా చూసిన వీరు స్కోరును సైతం పది పరుగుల రన్‌రేట్‌తో పరిగెత్తించారు. అయితే తొమ్మిదో ఓవర్‌లో స్వీప్ షాట్ కోసం వెళ్లి స్టబ్స్ బౌల్డయ్యాడు. అక్షర్ ఈ వికెట్ తీయడంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే డికాక్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపింది. కానీ క్రీజులో హిట్టర్లు క్లాసెన్, మిల్లర్ ఉండడంతో పరుగుల వేటలో ఇబ్బంది పడలేదు. స్పిన్నర్లు అక్షర్, కుల్దీప్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. 14వ ఓవర్‌లో మిల్లర్ 4,6తో 14 రన్స్ రాబట్టగా.. 15వ ఓవర్‌లో క్లాసెన్ ఏకంగా 4,6,6,4తో 24 పరుగులు సమకూర్చడంతో సమీకరణం 30 బంతుల్లో 30 రన్స్‌కు మారింది. ఒక్కసారిగా మ్యాచ్ సఫారీల వైపు మొగ్గినట్టు కనిపించడంతో భారత్‌లో ఆందోళన నెలకొంది. అయితే చివరి నాలుగు ఓవర్లలో భారత బౌలర్లు చెలరేగారు. 16వ ఓవర్‌లో బుమ్రా 4 పరుగులే ఇవ్వగా.. 17వ ఓవర్‌లోనూ పాండ్యా నాలుగు పరుగులే ఇచ్చి ప్రమాదకర క్లాసెన్ వికెట్ తీయడంతో భారత్ శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఐదో వికెట్‌కు ఈ జోడీ 22 బంతుల్లోనే 45 పరుగులు జత చేసింది. ఓ సూపర్ ఇన్‌స్వింగర్‌కు జాన్సెన్ (2) వికెట్ తీసిన బుమ్రా 18వ ఓవర్‌లో 2 పరుగులే ఇచ్చాడు. ఈ దశలో 12 బంతుల్లో 20 రన్స్ కావాల్సి రావడంతో సఫారీలు ఒత్తిడిలో పడ్డారు. మిల్లర్ క్రీజులో ఉన్నా షాట్లు ఆడలేకపోయాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 16 పరుగులు అవసరమయ్యాయి. హార్దిక్ వేసిన వైడ్ ఫుల్ టాస్‌ను మిల్లర్ భారీ సిక్సర్‌గా మలిచే ప్రయత్నంలో సూర్య సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. రబాడ (4) ఓ ఫోర్ సాధించినా ఐదో బంతికే తను అవుటయ్యాడు. దీంతో భారత్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

విరాట్-అక్షర్ నిలబెట్టారు..: బంతి నేరుగా బ్యాట్‌పైకి వస్తుందన్న అంచనాతో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆరంభంలో బౌలర్లకు పట్టు లభించడంతో 34 పరుగులకే రోహిత్ (9), పంత్ (0), సూర్యకుమార్ (3)ల వికెట్లను కోల్పోయిన జట్టు షాక్‌కు గురైంది. కానీ పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్న విరాట్ కోహ్లీ విలువైన ఇన్నింగ్స్‌తో అండగా నిలవగా.. హిట్టర్ పాత్రలో అక్షర్ సహకరించాడు. దీంతో సఫారీల ముందు జట్టు సవాల్ విసిరే స్కోరును ఉంచింది. రెండో ఓవర్‌లోనే స్పిన్నర్ కేశవ్ మహరాజ్.. రోహిత్, పంత్‌ల వికెట్లు తీశాడు. ఇక ఐదో ఓవర్‌లో సూర్యను రబాడ కట్టడి చేశాడు. వాస్తవానికి తొలి ఓవర్‌లోనే కోహ్లీ మూడు ఫోర్లతో 15 రన్స్ అందించి జోష్‌ను నింపినా.. ఆ తర్వాత వికెట్ల పతనంతో అతడితో పాటు అక్షర్ జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. మధ్య ఓవర్లలో పేసర్లు జాన్సెన్, నోకియా రన్స్‌ను నియంత్రించారు. అయితే అడపాదడపా అక్షర్ సిక్సర్లతో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. కానీ 14వ ఓవర్‌లో లేని పరుగు కోసం వెళ్లిన అక్షర్ దురదృష్టవశాత్తు రనౌటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 72 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. వచ్చీ రాగానే దూబే సిక్సర్‌తో ఆకట్టుకోగా.. అటు నెమ్మదిగా ఆడుతూ వచ్చిన విరాట్ 48 బంతుల్లో ఫిఫ్టీ పూర్తయ్యాక జోరు పెంచాడు. 18వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లో 4,2,6తో 12 రన్స్ అందించి జాన్సెన్‌కు చిక్కాడు. అప్పటికే దూబేతో కలిసి ఐదో వికెట్‌కు 33 బంతుల్లో 57 పరుగులు జత చేశాడు. అయితే చివరి ఓవర్‌లో దూబే, జడేజా (2) వికెట్లను తీసిన నోకియా 9 పరుగులే ఇవ్వడంతో భారత స్కోరు 180లోపే ముగిసింది.



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లీ

విజేతగా వీడ్కోలు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. భారత జట్టు విశ్వవిజేతగా ఆవిర్భవించి దేశ క్రికెట్ ఫ్యాన్స్ అంతా ఆనందోత్సాహల్లో మునిగిన వేళ.. 35 ఏళ్ల విరాట్ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు ప్రపంచకప్ ఫైనల్ ముగిసిన క్షణాన ప్రకటించాడు. 59 బంతుల్లో 76 పరుగులు చేసి టీమిండియా విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించిన కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. 'నేను ఆశించింది ఈ వరల్డ్ కప్పే. అది అందుకున్నా. దాంతో ఇదే నా చివరి మ్యాచ్' అని అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ముందు మాట్లాడుతూ విరాట్ వెల్లడించాడు. 'మనం పరుగులు సాధించలేమని భావించే రోజు ఒకటి వస్తుంది. భగవంతుడు గొప్పవాడు. రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇంతకు మించిన తరుణం లేదు' అని కోహ్లీ అన్నాడు.

విరాట్ టీ20 కెరీర్ ఇలా..	
మ్యాచ్‌లు	125
ఇన్నింగ్స్	117
పరుగులు	4188
అత్యధిక స్కోరు	122*
సెంచరీలు	1
అర్ధ సెంచరీలు	38
సగటు	48.69
స్ట్రయిక్ రేట్	137.04



భార్యతో రోహిత్

ఆటగాడిగా, కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్ నెగ్గిన రోహిత్. 2007లో ధోనీ సారథ్యంలో చాంపియన్‌గా నిలిచిన భారత జట్టులో రోహిత్ సభ్యుడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) మహరాజ్ 9, విరాట్ (సి) రబాడ (బి) జాన్సెన్ 76, పంత్ (సి) డికాక్ (బి) మహరాజ్ 0, సూర్యకుమార్ (సి) క్లాసెన్ (బి) రబాడ 3, అక్షర్ (రనౌట్) డికాక్ 47, దూబే (సి) మిల్లర్ (బి) నోకియా 27, హార్దిక్ (నాటౌట్) 5, జడేజా (సి) మహరాజ్ (బి) నోకియా 2, **ఎక్స్‌ట్రాలు: 7, మొత్తం: 20 ఓవర్లలో 176/7; వికెట్ల పతనం:** 1-23, 2-23, 3-34, 4-106, 5-163, 6-174, 7-176; **బౌలింగ్:** జాన్సెన్ 4-0-49-1, మహరాజ్ 3-0-23-2, రబాడ 4-0-36-1, మార్‌క్రమ్ 2-0-16-0, నోకియా 4-0-26-2, షంసి 3-0-26-0.

దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్ (బి) బుమ్రా 4, డికాక్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 39, మార్‌క్రమ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 4, స్టబ్స్ (బి) అక్షర్ 31, క్లాసెన్ (సి) పంత్ (బి) హార్దిక్ 52, మిల్లర్ (సి) సూర్య (బి) హార్దిక్ 21, జాన్సెన్ (బి) బుమ్రా 2, మహరాజ్ (నాటౌట్) 2, రబాడ (సి) సూర్య (బి) హార్దిక్ 4, నోకియా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 9, మొత్తం: 20 ఓవర్లలో 169/8; వికెట్ల పతనం:** 1-7, 2-12, 3-70, 4-106, 5-151, 6-156, 7-161, 8-168; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-20-2, బుమ్రా 4-0-18-2, అక్షర్ 4-0-49-1, కుల్దీప్ 4-0-45-0, హార్దిక్ 3-0-20-3, జడేజా 1-0-12-0.



దక్షిణాఫ్రికా ఆటగాళ్ల నిర్వేదం



థాంక్యూ.. ద్రవిడ్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

2007 వన్డే ప్రపంచకప్.. విండీస్‌లోనే జరిగిన ఈ మెగా టోర్నీని భారత్ క్రీడాభిమానులు పొరపాటున కూడా గుర్తుంచుకోవడానికి ఇష్టపడరు. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, బంగ్లా జట్లు సూపర్-8కి వెళ్లగా.. బెర్ముడాతో కలిసి భారత్ ఇంటిముఖం పట్టింది. అప్పుడు కెప్టెన్ రాహుల్ ద్రవిడ్. ఆ దారుణ పరాభవంతో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న ద్రవిడ్ సారథ్యం కూడా కోల్పోయాడు. సుదీర్ఘ కాలం భారత్‌కు ఆడినా అతడి ఖాతాలో ఒక్క వరల్డ్‌కప్ కూడా లేకుండానే ముగిసిపోయింది. అయితే అప్పుడు కలగానే మిగిలిన కప్‌ను.. తన అపార అనుభవంతో జట్టు కోచ్‌గా ద్రవిడ్ సాధించి చూపాడు. అంతకుముందే అండర్-19 జట్టు సైతం తన ఆధ్వర్యంలోనే వన్డే వరల్డ్‌కప్ అందుకోవడం విశేషం.

దూకుడు నేర్పాడు..

రవిశాస్త్రి కోచ్‌గా ఉన్నప్పుడు 2021 టీ20 వరల్డ్‌కప్‌లో జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. అనంతరం ద్రవిడ్ కొత్త కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. ఆ పరాభవానికి కారణాలను విశ్లేషించాక ఆటతీరులో మార్పు తెచ్చాడు. సంప్రదాయ ఆటతీరుకు స్వస్తి చెప్పి మూడు ఫార్మాట్లలోనూ దూకుడుగా వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నాడు. ఆటగాళ్లను వెన్నంటి ప్రోత్సహిస్తూ వారి నుంచి సరైన ఆటతీరును రాబట్టాడు. వివాదాల జోలికి వెళ్లకుండా ప్రపంచ క్రికెట్‌లో జట్టు ఆధిపత్యానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఫలితంగా.. మూడు ఫార్మాట్లలోనూ జట్టు నెంబర్ వన్ స్థాయికి ఎదిగింది. అలాగే అద్భుత ఆటతీరుతో నాలుగు ఐసీసీ టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరగలిగింది. అయితే మూడుసార్లూ తుదిమెట్టుపైనే బోల్తా పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో భారత జట్టు ఇంగ్లండ్ చేతిలో ఓడింది. 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో.. అదే ఏడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లోనూ ఆసీస్ చేతిలోనే పరాభవం పాలైంది. కానీ నాలుగోసారి ఫైనల్‌కు చేరిన క్రమంలో కోచ్‌గా ద్రవిడ్ అనుకున్నది సాధించాడు. అపజయమన్నది లేకుండా రోహిత్ నేతృత్వంలోని టీమిండియా టీ20 వరల్డ్‌కప్‌ను తమ శిక్షకుడి చేతికి అందించి సగర్వంగా సెండాఫ్ పలికేలా చేసింది. అంతకుముందు రవిశాస్త్రి శిక్షణలో భారత్ భారీ విజయాలు సాధించినా.. ఐసీసీ టైటిల్ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. 2019 వన్డే వరల్డ్‌కప్ సెమీస్, 2021 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2021 టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్‌కు పరాజయాలు ఎదురయ్యాయి.

కోచ్‌గా ద్రవిడ్ ప్రస్థానం

- 24 టెస్టుల్లో 14 గెలిచి మూడింట్లో ఓడింది.
- 13 వన్డే ద్వైపాక్షిక సిరీస్‌ల్లో భారత్ పదింటిని గెలుచుకుంది. అలాగే రోహిత్-ద్రవిడ్ కాంబినేషన్‌లో ఆడిన 56 మ్యాచ్‌ల్లో 41 విజయాలున్నాయి.
- 77 టీ20 మ్యాచ్‌ల్లో 56 గెలిచింది.

భారత్ రికార్డు స్కోరు

● 603/6 డిక్లేర్ ● మహిళల టెస్ట్ క్రికెట్‌లోనే అత్యధిక స్కోరు
● సౌతాఫ్రికా 236/4 ● స్నేహ్ రాణాకు 3 వికెట్లు



1 మహిళల టెస్ట్ క్రికెట్‌లో 600 పరుగుల మార్క్ దాటిన తొలి జట్టుగా భారత్. ఈ ఏడాదే పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై ఆస్ట్రేలియా సాధించిన 575/9 (డిక్లేర్) రికార్డును మన మ్మాయిలు బద్దలు కొట్టారు.

చెన్నై: బ్యాటర్ల ఆధిపత్యంతో.. మహిళల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే భారత్ అత్యధిక స్కోరు నమోదు చేసింది. క్రితం రోజు స్కోరు 525/4తో శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 603/6 వద్ద డిక్లేర్ చేసింది. మొదటి రోజు స్కోరుకు 78 రన్స్ జోడించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు హర్మన్‌ప్రీత్ (69), రిచా ఘోష్ (86) ఐదో వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో తొలి అర్ధ శతకం సాధించిన హర్మన్‌ను టుమి అవుట్ చేసింది. ధాటిగా ఆడుతూ టీమ్ స్కోరును 600 మార్క్ దాటించిన ఘోష్‌ను మ్లాబా ఎల్బీ చేయడంతో.. భారత్ డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా రెండోరోజు ఆట ముగిసేసరికి 236/4 స్కోరు చేసింది. స్నేహ్ రాణా (3/61) మూడు వికెట్లు తీసింది. మరిజానె కాప్ (69), నడిన్ డి క్లార్క్ (27) క్రీజులో ఉన్నారు. సునె లుస్ (65) అర్ధ సెంచరీ చేయగా, ఓపెనర్లు వొల్వార్ట్ 20, బాష్ 39 రన్స్ చేశారు. కానీ, భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సౌతాఫ్రికా 367 పరుగులు వెనుకంజలో ఉంది.

క్రిస్టీకి మాళవిక షాక్

ఫోర్ట్‌వర్త్ (అమెరికా): యూఎస్ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో 2014 కామన్వెల్త్ గేమ్స్ రజత పతకధారి క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)కు భారత షట్లర్ మాళవిక బన్సోడ్ షాకిచ్చింది. శనివారం జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో 22 ఏళ్ల మాళవిక 10-21, 21-15, 21-10తో క్రిస్టీని ఓడించింది. సెమీస్‌లో ఆరో సీడ్ నట్సుకి నిదైరా (జపాన్)తో మాళవిక తలపడనుంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 21-15, 11-21, 18-21తో లీ లాన్ జి (చైనా) చేతిలో ఓడాడు. డబుల్స్‌లో రెండో సీడ్ గాయత్రి-ట్రీసా జాలీ జోడీ 17-21, 21-17, 19-21తో హిరోకామి-యున కాటో (జపాన్) జంట చేతిలో ఓటమిపాలైంది.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

స్పీకర్ పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తా

» నా నోటికి చంద్రబాబు ప్లాస్టర్ వేశారు: అయ్యన్న

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి), గోపాలపట్నం, నర్సీపట్నం, జూన్ 29: 'స్పీకర్ పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తా. ఇదివరకటిలా ఏది పడితే అది మాట్లాడలేను. చంద్రబాబు నా నోటికి ప్లాస్టర్ వేసేశారు' అని చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి శనివారం ఆయన విశాఖకు వచ్చారు. నగరంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, కూటమికి చెందిన ఎమ్మెల్యేలు, నగరానికి చెందిన వ్యాపార ప్రముఖులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన అక్కడ నుంచి నర్సీపట్నం వెళ్లారు. అక్కడ అయ్యన్నకు పౌరసన్మానం జరిగింది. ముందుగా విమానాశ్రయంలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. విశాఖ, నర్సీపట్నంలో అయ్యన్న మాట్లాడుతూ... 'నాకు 40 ఏళ్ల కిందట ఎన్‌టీ రామారావు మంత్రి పదవి ఇస్తే, ఇప్పుడు సీఎం చంద్రబాబు రాష్ట్రంలోనే అత్యున్నతమైన అసెంబ్లీ స్పీకర్ పదవిని ఇచ్చి గౌరవించారు. అసెంబ్లీకి ఎన్నికైన వారిలో 85 మంది కొత్తవారు ఉన్నారు. వారికి సభా మర్యాద, సంప్రదాయాలతోపాటు నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరికీ సభలో మాట్లాడే అవకాశం కల్పిస్తా. అవసరమైతే సమావేశాలను మరో రెండు రోజులు పొడిగిస్తాం' అని అయ్యన్న అన్నారు.

'జగన్ నామస్మరణ'పై ఉన్నతాధికారుల సీరియస్


» రేపర్లు తొలగించి చిక్కీలు ఇవ్వాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిఠాపురం, జూన్ 29: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినా విద్యార్థులకు అందించే వేరుశనగ చిక్కీ ప్యాకెట్లపై ఇంకా జగన్ నామస్మరణ చేయడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. దీన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. కాకినాడ జిల్లాలో పాఠశాలల విద్యార్థులకు అందించే చిక్కీ ప్యాకెట్లపై జగన్ ఫొటో బదులుగా రాజముద్ర ముద్రించగా, వెనుకభాగంలో మాత్రం వెబ్‌సైట్ చిరునామా 'జగనన్న గోరుముద్ద'గా ఉండడాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా చిక్కీ ప్యాకెట్లపై ఇదే విధంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. దీంతో విద్యాశాఖాధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. చిక్కీ ప్యాకెట్లపై జగనన్న గోరుముద్ద అని ఉన్న రేపర్లను తొలగించి చిక్కీలను విద్యార్థులకు అందజేయాలని ఎంఈవోలను జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశించారు. వచ్చే నెల నుంచి 'పీఎం పోషణ్' పేరుతో చిక్కీలు వస్తాయని వారు తెలిపారు.

డిస్కమ్‌లు దివాలా!

- » రూ.1,38,000 కోట్లకు చేరువలో అప్పులు
- » జగన్ ఎగ్గొట్టిన సబ్సిడీ రూ.70,000 కోట్లు
- » అస్మదీయుల చేతికి విద్యుత్ సంస్థలు
- » కలకలం రేపిన ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్ల తీరు
- » రేపు విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల



అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా జగన్ ముంచేసిన ప్రభుత్వ సంస్థల్లో విద్యుత్ రంగమే ముందు వరసలో ఉంటుంది. అటు వినియోగదారులను బాదేస్తూ, ఇటు విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ ఐదేళ్ల పాలనలో ఏపీకి కళా'కాంతి' లేకుండా చేశారు. 2014-19 మధ్య కాలంలోని వాస్తవ వ్యయాల వసూలు పేరిట.. రూ. 3,542 కోట్లను ట్రూఅప్ చార్జీల పేరిట భారం వేశారు. అదేవిధంగా నెలకు 500 యూనిట్లకుపైగా వాడే వారి నుంచి రూ.1,300 కోట్లు వసూలు చేశా రు. శ్లాబులు పెంచి రూ.1500 కోట్ల భారం వేశారు. కిలోవాట్‌కు రూ.10 పెంచడం ద్వారా రూ.2,600 కోట్లను వసూలు చేశారు. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ కింద రూ.700 కోట్ల మేర భారం వేశారు. సర్దుబాటు చార్జీల కింద రూ.3,669 కోట్లను గుంజారు. గృహ విద్యుత్తు చార్జీల పెంపు, సర్దుబాటు కింద రూ.4,300 కోట్ల భారం వేశారు. ఇలా రూ.16,611 కోట్లను ప్రజలపై చార్జీల భారాన్ని వేశారు. 2022-23లో రూ.7,200 కోట్లు.. 2023-24లో రూ.10,015 కోట్లు.. భారం వేశారు. ఇలా ఐదేళ్లలో రూ.33,826 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపారు. విద్యుత్తు చార్జీలను 2014- 2019 మధ్య చంద్రబాబు ప్రభుత్వం పెంచలేదు. అయినా.. ప్రతిపక్షంలో ఉండగా, బాదుడే బాదుడు అంటూ జగన్ ఆరోపణలు చేసేవారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలు పూర్తిగా తగ్గించేస్తానంటూ హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీల్లోనూ, గిరిజన తండాల్లోనూ నెలకు 200 యూనిట్ల దాకా ఉచితంగా కరెంటును అందిస్తానని హామీ గుప్పించారు. కానీ .. తర్వాత .. దానికి షరతులు విధించారు.

హామీలన్నీ హుళక్కే

వ్యవసాయానికి పగటి పూట 9 గంటల నిరంతరాయంగా విద్యుత్తును ఇస్తానని ఆనాడు జగన్ హామీ ఇచ్చారు. కానీ, అధికారంలోకి రాగానే వ్యవసాయ విద్యుత్తు వాడకంపై గణాంకాలు సేకరించాల్సిందేనని డిస్కమ్ లకు షరతులు విధించారు. వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లను బిగించేందుకు సిద్ధమయ్యారు. తన బంధువుకు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి మీటర్ల బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగిస్తామంటూ టెండర్లను పిలిచారు. ఈ బాధ్యతను తన మిత్రుడు అదానీకి అప్పగించారు. వ్యవసాయ మీటర్లపై భారం ప్రభుత్వం భరిస్తుంటే, గృహ విద్యుత్తు భారం రూ.12000 వినియోగదారులపై పడుతోంది. ఈ రెండింటి కోసం డిస్కమ్‌లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.14,000 కోట్లను రుణంగా తీసుకున్నాయి. వీటి వడ్డీభారం కూడా వినియోగదారులపైనే పడనుంది.

డిస్కమ్‌లను ముంచేశారు

జగన్ నిర్వాకంతో విద్యుత్తు పంపిణీ సంస్థలు, జెన్కో రూ.వేల కోట్ల అప్పుల్లోకి వెళ్లిపోయాయి. గత ఏడాది అధికారికంగా అసెంబ్లీకి ఇచ్చిన లెక్కల మేరకు ఏపీసీపీ డీఎల్ అప్పులు రూ.28,832.95 కోట్లకు చేరుకున్నాయి. ఏపీసీపీడీసీఎల్ అప్పు రూ.11,005.48 కోట్లు.. ఏపీఈపీడీసీ ఎల్ అప్పు రూ.12,633.99 కోట్లుగా ఉంది. మొత్తం డిస్కమ్‌ల అప్పు రూ.42533.16 కోట్లుగా ఉందని విద్యుత్తు సంస్థలు చెబుతున్నాయి. ఇక, జెన్కో అప్పులు రూ.19,438.06 కోట్లు. కృష్ణపట్నం థర్మల్ విద్యుత్కేంద్రం రుణం రూ.29,000 కోట్లకు చేరుకుంది. వీటీపీఎస్‌ను కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావడంలో చేసిన జాప్యం వల్ల రూ.26,000 కోట్ల మేర జెన్కోకు నష్టం వాటిల్లిందని విద్యుత్తు రంగ నిపుణులు చెబుతున్నారు. అయితే, మొత్తంగా విద్యుత్తు సంస్థలు చేసిన రుణాలు రూ.1,38,000 కోట్లకు చేరుకున్నాయని చెబుతున్నారు. ఈ రుణాలన్నీ సంస్థలకు తలకు మించిన భారంగా మారాయి.

ఇప్పటికీ రెండు పోస్టుల్లో సంతోశ్‌రావు

రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థలను సొంత సామ్రాజ్యాలుగా, వాటి సీఎండీలను సామంత రాజులుగా చేసుకుని నాడు సీఎం జగన్ ఇష్టారాజ్యం పాలించారు. కీలకమైన పోస్టులను అస్మదీయులతో నింపేశారు ఏపీఈపీడీసీఎల్‌లో సంతోశ్‌రావును రెండేళ్లపాటు కొనసాగించారు. ఏపీసీపీడీసీఎల్‌లో షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ యజమాని విశ్వేశ్వరరెడ్డి బంధువు పద్మా జనార్ధనరెడ్డిని నియమించారు. జగన్ అండ చూసుకుని సీఎండీలు చెలరేగిపోయారు. విచ్చలవిడిగా షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ నుంచి రెట్టింపు ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తెలంగాణ కంటే రెట్టింపు ఉండటంపై ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. చివరికి..డిస్కమ్‌లలో వ్యవహారం శ్రుతి మించిందని ఉన్నతాధికారులు సైతం అనుకున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఏపీఈపీడీసీఎల్‌కు ఐఏఎస్ అధికారి పృథ్వీతేజ్‌ను నియమించారు. అక్కడ సీఎండీగా ఉన్న సంతోశ్‌రావును ఏపీఎస్పీడీసీఎల్‌కు మార్చారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా ఉన్న పద్మాజనార్ధనరెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వవద్దంటూ వచ్చిన ఒత్తిడితో .. ఈ సంస్థకు సంతోష్‌రావును సీఎండీగా అదనపు బాధ్యతలు ఇచ్చి కొనసాగిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి, జగన్ ఇంటికి వెళ్లిపోయినా, ఇంకా రెండు పదవుల్లోనూ ఇప్పటికీ సంతోశ్‌రావును కొనసాగించడంపై విద్యుత్తు పంపిణీ సంస్థల ఉద్యోగులు, నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కార్యాలయాలను ప్రజావసరాల కోసం కేటాయించాలి

» బాబు కేంద్రం నుంచి నిధులు తెచ్చి పోలవరం పూర్తి చేస్తారు: రామకృష్ణ

» ఎస్వీయూలో ఏఐఎస్ఎఫ్ మహాసభలు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 29: ప్రభు త్వ స్థలాల్లో అనుమతుల్లేకుండా రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన వైసీపీ కార్యాలయాలను ప్రజల అవసరాల కోసం కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వానికి సూచించారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో శనివారం ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్మాణం పేరుతో వైసీపీ ప్రభుత్వం రూ.వేల కోట్ల నిధులు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. కేంద్రం నుంచి చంద్రబాబు తగినన్ని నిధులు తీసుకొచ్చి పోలవరాన్ని పూర్తి చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. ప్రజాభిమానాన్ని కోల్పోయిన జగన్ ప్రతిపక్ష హో దా కావాలని అడగటం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో దేశంలోని విద్యారంగ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చేపట్టవలసిన ఉద్యమ ప్రణాళికను రూపొందించనున్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు చేయించాలి

» సుబ్రహ్మణ్యం కుటుంబానికి వైసీపీ అన్యాయం: ముప్పాళ్ల సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 29: 'వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు మధ్యంతర బెయిల్ రద్దు చేయించాలి. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి' అని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేం ద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అనంతబాబును కాపాడడానికి ఆ రోజు ఉన్న దిగువస్థాయి పోలీసు అధికారుల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు పనిచేశారు. ఈ కేసులో అనంతబాబు, తన అనుచరులను జాగ్రత్తగా తప్పించాడు. అతని వెంట ఉండే గన్‌మెన్ కూడా కేసు విచారణలో లేడు. కాకినాడ పోలీసులు పూర్తిగా అనంతబాబుకు వత్తాసుపలికి ఆనాటి అధికార పార్టీ ఒత్తిడితో విచారణ సక్రమంగా చేయలేదు. ఈ కేసులో అనేక వాస్తవాలు బయటకు రావాల్సి ఉంది. హత్యలో పాల్గొన్న మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది' అని వివరించారు. అనంతరం వీధి సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు నూకరాజు, సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌లు స్పందించి తమకునాయ్యం చేయాలని కోరారు.

శాంతిభద్రతల బాధ్యతలు శ్రీకాంత్‌కు

» హోంగార్డ్స్ హరికృష్ణకు... ఎఫ్ఎస్ఎల్ రాజశేఖర్ బాబుకు

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. శాంతిభద్రతల విభాగం నుంచి శంకబ్రత బాగ్చీని విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా నియమించి, ఆక్టోపస్ ఐజీ శ్రీకాంత్‌కు శాంతిభద్రతల బాధ్యతలను డీజీపీ తిరుమలరావు అప్పగించారు. టెక్నికల్ సర్వీసెస్ ఐజీ హరికృష్ణకు హోంగార్డ్స్, సిబ్బంది బాధ్యతలు అప్పగించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు చైర్మన్‌గా ఉన్న రాజశేఖర్ బాబుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కట్టబెట్టారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల ఆస్తి పట్టింపు లేదు / కమ్మ /డైవర్సీ /42y/5'6"/MD. / Radiologist/ మంచి ఆస్తి గల అందమైన వధువుకు వరుడు కావలెను. వాట్సాప్ : 9553394348 AJH-001966

★ కుల ఆస్తి పట్టింపు లేదు / చౌదరి /2వ మ్యారేజ్ / 43y/5'5"/Doctor / Gynecologist / మంచి ఆస్తి గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 8096038221 AJH-001966

★ 53y/ రెండవ పెళ్ళి/ విడో/ ఫెయిర్/ Govt Job/ పిల్లలు లేరు/ సొంత ఇల్లు, రెంట్స్ , ప్రాపర్టీ/ ఎలాంటి బాదరాబందీలేని ఏకైక వధువుకి వరుడు కావలెను. సంప్రః 7995376608 AJH-4021

★ రెడ్డి 2nd మ్యారేజ్ / కుల, మత, ఆస్తి పట్టింపు లేదు / ఎత్తు : 5.4 : Qly : ఇంటర్, కలర్ : తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 9063623252 AJH-002485

★ గౌడ/ 49y/ విడో/ C. Govt Job VRS / సొంత ఇల్లు, పొలాలు వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు FC/ BC వరుడు కావలెను. సంప్రః 8498936945 AJH-4021

★ రెండవ మ్యారేజ్ /విడో/ 46y/ Govt Job /Own Villa, Rents / Lands / మంచి ఆస్తి / ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్ : 9100818693 AJH-15733

★ రెండవ పెళ్ళి /విడో/ 48y/తిరుపతి/Own House, Lands, Well సెటిల్ ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్ : 8519803423 AJH-15733

★ 2వ పెళ్ళి /46y/Govt. ఎంప్లాయి, మంచి జీతం / సొంత ఇల్లు, గల సెటిల్డ్ వధువుకు ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్ : 9701605100 AJH-15733

★ రెండవ పెళ్ళి / కుల ప్రసక్తి లేదు / 40y/M.Sc / M.Phil, Ph.D/ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ / మంచి ఆస్తి గల పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా ఒకే) : 8341454870/7396213324 AJH-001966

★ రెడ్డి 2nd మ్యారేజ్ (కుల, మత, ఆస్తి) ప్రసక్తి లేదు Age : 30, H.5.4, Own House, Business, Agriculture Land గల అందమైన సాంప్రదాయ వధువుకి 1 వేదా 2వ వరుడు కావలెను. ఫోన్ : 9908279018 AJH-002485

★ రెడ్డి, విడో: కుల, ఆస్తి పట్టింపు లేదు / Age : 33, Qly: B.Ed / Own Business లు కలిగిన అందమైన వధువుకి మంచి వరుడు కావలెను. ఫోన్ : 9121300377 AJH-002485

★ కాపు, విడో Govt. 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు : 45, కలర్ : తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 9676896226 AJH-002488

★ కుల పట్టింపు లేదు / 40-60y / విడో / ఆంధ్ర / పిల్లలు లేరు / GVT. JOB / Good Salary / సొంత ఇల్లు / పొలాలు / అందమైన వధువులకు వరుడు కావలెను. ఫోన్ : 9989350417 AJH-002488

★ కుల పట్టింపు లేదు / విడో /40y / ఆంధ్ర / Govt. Employee / Good Salary / Own House / Rents / Agriculture Lands / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8374476725 AJH-002488

★ బ్రాహ్మణ / 27y /5'4"/ 1st మ్యారేజ్ / Qua : Inter / Pvt. Job / Own House / 2nd మ్యారేజ్ also OK. పౌరోహితం also OK. వరుడు కావలెను. ఫోన్ : 7207552927 AJH-002488

★ కుల పట్టింపు లేదు / విడో / 60 Y / Retd. Employee / ఓన్ బిజినెస్ / రెంట్స్ / లాండ్స్ మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 81252 50397 AJB-232

★ పద్మశాలి, పట్టుశాలి, దేవాంగులు : 1st మ్యారేజ్, 26 సం॥రాలు, సొంత ఇల్లు, ఫాదర్ బిజినెస్ ఉన్న వధువుకు సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : +917601021292 AJL_186384

★ (నాయుడు) కాపు, కమ్మ, బలిజ : మొదటి సంబంధం, 26 సం॥రాలు, డిగ్రీ, 5.4, సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న అమ్మాయిలకు వరుడు కావలెను. సెల్ : +917601021292 AJL_186384

★ రెడ్డి : 1st మ్యారేజ్, 27 సం॥రాలు, డిగ్రీ, 5.4., ఫాదర్ వ్యవసాయం, బ్రదర్ సాఫ్ట్‌వేర్‌గా ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : +917601021292 AJL_186384

★ (ఆచారులు) : విశ్వబ్రాహ్మన్స్ : 26 సం॥రాలు, Inter, సొంత ఇల్లు, బ్రదర్ ప్రైవేట్ జాబ్, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి మంచి సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : +917601021292 AJL_186384

★ యాదవ్స్, (పూజగొల్ల, ఎర్రగొల్ల, కర్ణగొల్ల, ఆల్లగొల్ల) : 1st మ్యారేజ్, 10 to డిగ్రీ, 26 సం॥ రాలు, ఉన్న అమ్మాయికి మంచి వరుడు కావలెను. సెల్ : +917601021292 AJL_186384

★ నాయి బ్రాహ్మన్స్: ఇంటర్, 26 సం॥ రాలు, 5.3, సొంత ఇల్లు, ఫాదర్ కులవృత్తి, బ్రదర్ జాబ్ ఉన్న అమ్మాయికి మంచి కుటుంబ వరుడు కావలెను. సెల్ : +917601021292 AJL_186384

★ రాజులు, (సూర్యవంశం, చంద్రవంశం) బటీరాజులు : 27 సం॥ రాలు, సొంత ఇల్లు, స్థిరాస్తి ఉన్న అమ్మాయికి ఆంధ్ర, తెలంగాణాలలో మంచి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను.సెల్ : +917601021292 AJL_186384

★ రెండవపెళ్లి (పద్మశాలి) : 45 సం॥ రాలు, విడో, సొంత ఇల్లు, అలాగే రెడ్డి 46 సం॥ రాలు, కాపు 42 సం॥ రాలు, రాజులు 35 సం॥ రాలు ఉన్న వధువుకు వరులు కావలెను. పిల్లలు ఉన్నా Ok. సెల్ : +917601021292 AJL_186384

★ రెడ్డి, యువతి MBBS, MPH, Bosten యూనివర్సిటీ USA, చదివి స్థిరపడిన, 30 సం.లు, 5.5 ఎత్తు కలిగిన యువతికి రెడ్డి కులస్తులైన వరుడు కావలెను. నోబ్రోకర్స్ సం.ప్ర.సెల్: 94402 85822 AJR-178085

వధువు కావలెను



★ డైరెక్ట్/ మున్నూరుకాపు /31y/5'.8"/ Bhmct/ హైదరాబాద్‌లో మంచిజాబ్/ సొంత ఇల్లు, ఆస్తి/ గల గద్వాల వరునికి కులపట్టింపులేదు తగిన వధువు కావలెను. డైరెక్ట్ సంప్రః 9440122661 AJH-4021

★ కాపు/ 53y/5'8"/ USA సిటిజెన్ / B-tech& MS (USA) మంచి జీతం/ మంచి ప్రాపర్టీ/ సొంత ఇల్లు గల వరుడుకు 35-48 వయస్సు గల ఇండియా / USA వధువు కావలెను. విడాకులతో డైరెక్ట్ సంప్రః 8555961146 AJH-4021

★ రజక/కట్నం ప్రసక్తి లేదు / B.Tech/ Govt. గెజిటెడ్ ఆఫీసర్ / ఇరిగేషన్ Dept. /Good Salary / మంచి జీతం/ 6' ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9618007652 AJH-15733

★ SC మాల/కట్నం ప్రసక్తి లేదు / M.Tech/ Govt. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ / మంచి జీతం / 5'10" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15734

★ గౌడ/M.Tech/ Govt. ఎంప్లాయి / గ్రేడ్-1 ఆఫీసర్ / మంచి జీతం / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-15734

★ కుల ప్రసక్తి లేదు /M.Tech/ C.Govt. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ / (IRTC) / మంచి జీతం/ గ్రూప్-1 ఆఫీసర్ / 5'8" ఎత్తు / 32 సం.ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15734

★ పద్మశాలి /M.A/ Govt. గెజిటెడ్ ఆఫీసర్ /Jr. కాలేజ్ / 5'9" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను.ఫోన్ : 7032058965 AJH-15734

★ వడ్డెర /B.Tech/ Govt. కస్టమ్స్ & సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ / మంచి జీతం / 5'6" ఎత్తు / 29 సం.ల వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 9618579861 AJH-15734

★ 2వ పెళ్ళి /B.Tech/ ECE / సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / మంచి జీతం / 5'9" ఎత్తు / 40 సం.ల కుల ప్రసక్తి లేని వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-15734

★ కాపు /B.Tech/ Govt. Asst. ఇంజనీర్ / ట్రాన్స్‌కో / మంచి జీతం / 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 9618579861 AJH-15734

★ యాదవ /CA/ చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతం / 5'7" ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-15734

★ క్రిస్టియన్ / మాల /కుల మత ప్రసక్తి లేదు / 60y / వెల్‌సెటిల్డ్ / హైదరాబాద్ / రిచ్ / వరుడికి విడో వధువు కావలెను. నో బ్రోకర్స్. ఫోన్ : 9391511400 AJH-4021

★ బలిజ, 35yrs, డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువుకావలెను. డైరెక్ట్ కాంటాక్ట్ : 9440378427 AJH-002485

★ కాపు, 40 సం., 5.10, రెడ్ కలర్, ఏకైక కుమారుడు, నో బ్రదర్స్, నో సిస్టర్స్, Qul: M.S., ఆస్ట్రేలియా, నో జాబ్, విజయవాడలో అపార్ట్మెంట్స్, వ్యవసాయ భూములు గల వరుడుకు, బి.కాం. వరకు చదివిన, ఎరుపు రంగు కలిగిన విజయవాడ పరిసర ప్రాంత వాసులైన, 30-35 సం.లు వధువు కావలెను. సెల్ : 99481 98655 AJB-194730

కళ్యాణ వేదిక

★ సికింద్రాబాద్‌లో మాదిగ వివాహ పరిచయ వేదిక. ఈ రోజు ఆదివారం 10-6 pm ఫీ : 1 వెయ్యి ముందుగా మీ ఫోటో బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సంప్రః 9347046175 AJH-001966

★ ఏ కులమైనా మొదటి లేదా ద్వితీయ వధూవరుల పెళ్లి కావలసినవో వారి వారి కులము, ఎత్తు, చదువు ఉద్యోగము, ఊరు, జిల్లా సహము & ఫుల్ ఫోటో బయోడేటా నింపి వాట్సప్ చేసి సంప్రః 9440170407 AJH-320

★Free Registration హిందు / మాల / మాదిగ క్రిస్టియన్ వధూవరుల Online స్వయంవరం July 14th Bhavani Matrimony, Hyd. Ph: 9704656103 /9533608887 AJH-4021

★ కావ్య మ్యారేజ్ లింక్స్ : 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ (స్త్రీలకు ఫ్రీ). ఫోన్ : 7702526428 AJH-4021

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matchesకై సంప్రః Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-4021

★ వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ. 9 గంటలకు 65వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ. 2 గంటలకు 20వ పునర్వి వివాహ పరిచయవేదిక. విజయవాడ KBN కాలేజిలో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. సంప్ర. 99895 00130 AJB-285

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

ధాత్రి జగద్ధాత్రి మ్యారేజి బ్యూరో

(అన్ని కులముల వారికి)

Head Office : Vijayawada, Contact : 96422 15777
B.O : HYD : 96429 57888

వధువు కావలెను

రెడ్డి : 31, 6, MCH (Surgical Oncology) 30Cr ★ 32, 5.10, MCH (Neuro Surgeon) 20Cr ★ 33, 5.11, DM (Cardio) 20Cr ★ 96422 15777

కాపు : 33, 5.11, DM (Cardiology) 25Cr ★ 32, 5.11, DM (Nephrology) CMC, 10Cr ★ 31, 5.10, DM (Neurology) 20Cr ★ 96429 57888

పద్మనాయక్ వెలమ : 33, 5.10, DM (Cardiology) 50Cr ★ 33, 6, DM (Gastro) 30Cr ★ 34, 5.11, DM (Cardiology) 30Cr ★ 96422 15777

కమ్మ : 33, 5.11, MCH (Neuro Surgeon) 50Cr ★ 31, 5.8, MS (GS) 20Cr ★ 32, 5.11, MS (GS) 15Cr ★ 96429 57888

కమ్మ : 32, 6, DM (Cardiology) 40Cr ★ 34, 5.11, DM (Cardiology) 30Cr ★ 31, 5.11, DM (Nephrology) CMC, 30Cr ★ 96422 15777

కాపు : 30, 5.8, MD (GM) 10Cr ★ 30, 5.10, MD (GM) 15Cr ★ 30, 5.10 MD (Radiology) 25Cr ★ 96429 57888

కొప్పుల వెలమ : 33, 5.8, MD (Internal Medicine) 300K$, 15Cr ★ 32, 5.11, MD (Internal Medicine) 350K$, 10Cr ★ 34, 5.9, MD (Internal medicine) 300K$, 15Cr ★ 96422 15777

కాపు : 32, 5.9, M.Tech, 1Cr/A, 200Cr ★ 33, 5.10, M.Tech, 25L/A, 10Cr ★ 32, 5.11, M.Tech, 20L/A, 10Cr ★ 96429 57888

కాపు : 29, 5.10, B.Tech, 18L/A, 10Cr ★ 32, 5.8, b.Tech, 18L/A, 15Cr ★ 32, 5.10, B.Tech, 25L/A, 20Cr ★ 96422 15777

పద్మశాలి : 30, 5.9, B.Tech (MBA) 20L/A, 10Cr ★ 31, 5.11, B.Tech (MBA) 30L/A, 5Cr ★ 32, 5.9, B.Tech (MBA) 18L/A, 10Cr ★ 96429 57888

కమ్మ : Divorce : 30, 5.11, IIT (KGP) MBA (IIM) COZ, 60L/A, 25Cr ★ 33, 5.10, IIT (Kanpoor) MBA (IIM) CAL, 1Cr/A, 50Cr ★ 96422 15777

వరుడు కావలెను

కాపు : 28, 5.6, MS (OBG) 50Cr ★ 28, 5.6, MS (OBG) 20Cr ★ 30, 5.2, MD (Pulmonology) 10Cr ★ 96422 15777

కాపు : 33, 5.2, MS (GS) 15Cr ★ 34, 5.3, MS (OBG) 15Cr ★ 30, 5.4, MS (OBG) 10Cr ★ 96429 57888

కాపు : 31, 5.4, MS (GS) 10Cr ★ 29, 5.5, MD (Emergency Medicine) 15Cr ★ 31, 5.7, MS (OBG) 10Cr ★ 96422 15777

కాపు : 29, 5.5, MD (Pediatrics) 12Cr ★ 30, 5.4, MD (Pediatrics) 15Cr ★ 30, 5.4, MD (Pediatrics) 10Cr ★ 96429 57888

రెడ్డి : 31, 5.7, MS (OBG) 18L/A, 10Cr ★ 32, 5.7, MS (ENT) 30Cr ★ 33, 5.6, MS (ENT) 25Cr ★ 96422 15777

విశ్వబ్రాహ్మణ : 30, 5.2, MD (Pediatrics) 15L/A, 10Cr ★ 27, 5.6, MS (OBG), 2Cr ★ 30, 5.5, MS (OBG) 10Cr ★ 96429 57888

దేవాంగ : 28, 5.2, MD (GM) 15Cr ★ 31, 5.2, MS (OBG) 10Cr ★ 32, 5.6, MD (Radiology) 10Cr ★ 96422 15777

మున్నూరు కాపు : 27, 5.5, NIT (Warangal) IES, 20L/A, 20Cr ★ 29, 5.6, Bits Pilani, 25L/A, 10Cr ★ 30, 5.5, IIT (Chennai) 30L/A, 10Cr ★ 96429 57888

పద్మనాయక్ వెలమ : 30, 5.7, MS, 180K$, 20Cr ★ 32, 5.5, MS, 150K$, 10Cr ★ 31, 5.4, MS, 120K$, 10Cr ★ 96422 15777

పద్మశాలి : 28, 5.7, B.Tech (MBA) 19L/A, 5Cr ★ 29, 5.4, B.Tech (MBA) 16L/A, 7Cr ★ 30, 5.3, B.Tech (MBA) 12L/A, 5Cr ★ 96429 57888

కమ్మ : 28, 5.5, IIT (Gowhathi) 40L/A, 20Cr ★ 30, 5.4, IIT (Khanpoor) 50L/A, 15Cr ★ 31, 5.6, IIT (Rurki) 30L/A, 15Cr ★ 96422 15777

కమ్మ : Divorce : 33, 5.6, MS (OBG) 36L/A, 20Cr ★ 34, 5.4, MS (OBG) 40L/A, 15Cr ★ 33, 5.7, MD (GM) 40L/A, 25Cr ★ 96429 57888

స్నేహ మ్యారేజ్ బ్యూరో

(కమ్మవారికి మాత్రమే)

HEAD OFFICE : #11-160, గడ్డం రత్తయ్యవీధి, Near Time హాస్పిటల్, అశోక్‌నగర్, VJA-7: 99481 29111, 99481 29222
Branch Office : Hyderabad : 87905 99799, 99510 32647
Khammam, Vizag, Rajhamundry
www.snehamarriage.com. 87905 99799 (whatsapp)

వరుడు కావలెను

కమ్మ : 28, 5.7, MS (OBG) IVF, 50 L/A, 100 CR ★ 29, 5.6, MS (OBG) 45 L/A, 80 Cr ★ 30, 5.5, MS (OBG) IVF, 40 L/A, 50 Cr ★ 96666 58789

కమ్మ : 27, 5.2, MD (Pediatrics) 36 L/A, 30Cr ★ 28, 5.6, MS (OBG) 40 L/A, 50 Cr ★ 27, 5.5, MD (GM) 20Cr ★ 98488 97778

కమ్మ : 27, 5.6, MD (GM) 30Cr ★ 27, 5.6, MD (GM) 20Cr ★ 28, 5.5, MD (Pediatrics) 36 L/a, 25 Cr ★ 27, 5.4, MD (GM) 30 Cr ★ 89782 17967

కమ్మ : 27, 5.5, MD (Pediatrics) 30Cr ★ 27, 5.3, MD (GM) 20Cr ★ 27, 5.5, MD (Emergency Medicine) 10Cr ★ 83745 39819

కమ్మ : 27, 5.4, MD (GM) 30Cr ★ 27, 5.6, MD (GM) 30Cr ★ 27, 5.4, MD (Radiology) 40Cr ★ 27, 5.7, MD (Palmonology) 30Cr ★ 99481 29222

కమ్మ : 31, 5.8, DM (Neurology) 50Cr ★ 32, 5.6, DM (Cardiology) 40Cr ★ 31, 5.6, DM (Nephrology) CMC, 50Cr ★ 98487 54267

కమ్మ : USA Citizen : 27, 5.4, MD (Internal Medicine) 30Cr ★ 27, 5.6, MD (Internal Medicine) 50Cr ★ 27, 5.6, MD (Internal Medcine) 50Cr ★ 99481 29111

కమ్మ : USA Citizen : 28, 5.4, MD (Internal Medicine 300K$, 50Cr ★ 28, 5.6, MD (Internal Medicine) 250K$, 40Cr ★ 28, 5.6, MD (Internal Medicine) 250K$, 40Cr ★ 28, 5.6, MD (Internal Medicine) 250K$, 30Cr ★ 99510 32647

కమ్మ : Australia : 28, 5.5, MD (Medicine) 50Cr ★ 30, 5.7, MD (Medicine) 30Cr ★ 26, 5.6, MD (Medicine) 100Cr ★ 95420 16659

కమ్మ : UK : 28, 5.5, MD (Medicine) 40Cr ★ 27, 5.6, BDS (Cambridge) 30Cr ★ 29, 5.5, MD (Accute Medicine) Oxford University, 50Cr ★ 96666 58789

కమ్మ : Divorce : 34, 5.3, MD (GM), 36 L/A, 30Cr ★ 34, 5.4, MS (OBG) (IVF) 40 L/A, 20Cr ★ 34, 5.7, DM (Nephrology) 40 L/A, 20Cr ★ 98488 97778

కమ్మ : Divorce : 34, 5.4, MCH (Plastic Surgeon) 50 L/A, 10Cr ★ 34, 5.4, MD (Pediatrics) 55 L/A, 25 Cr ★ 30, 5.6, MD (Palmonology) 20Cr ★ 89782 17967

కమ్మ : 26, 5.5, MS, 100K$, 10Cr ★ 26, 5.7, MS, 110K$, 10Cr ★ 26, 5.5, MS, 120K$, 15Cr ★ 27, 5.4, MS, 140K$, 20Cr ★ 95420 16659

కమ్మ : 27, 5.4, MS, 172K$, 35 Cr ★ 27, 5.3, MS, 140K$, 30Cr ★ 27, 5.5, MS, 135 K$, 20Cr ★ 27, 5.4, MS, 110K$, 25Cr ★ 99510 32647

కమ్మ : 27, 5.6, MS, 150K$, 50Cr ★ 27, 5.4, MS, 140K$, 30Cr ★ 28, 5.6, MS, 160K$, 30Cr ★ 27, 5.7, MS, 172K$, 20Cr ★ 99481 29111

కమ్మ : 29, 5.5, MS, 200K$, 20Cr ★ 28, 5.9, MS, 180K$, 30Cr ★ 28, 5.5, MS, 140K$, 60Cr ★ 28, 5.3, MS, 130K$, 20Cr ★ 98487 54267

కమ్మ : 28, 5.4, MS (Standford) 335K$, 60Cr ★ 28, 5.6, MS (Harward) 250K$, 60Cr ★ 29, 5.5, MS, 200K$, 20Cr ★ 99481 29222

కమ్మ : Australia : 28, 5.7, MS, 100 AUD$, 15Cr ★ 30, 5.3, MS, 100 AUD$, 20Cr ★ 27, 5.6, MS, 90 AUD$, 20Cr ★ 83745 39819

కమ్మ : Canada : 33, 5.5, MS, 110K$, CAD, 20 Cr ★ 29, 5.2, MS, 100$ CAD, 15Cr ★ 26, 5.5, MS, 90K$ CAD, 12 Cr ★ 89782 17967

కమ్మ : 30, 5.6, IIT (KGP) MBA, IIM (CAL) 1Cr / A, 100Cr ★ 27, 5.6, IIT (BNG), MBA, IIM (BNG) 50 L/A, 75 Cr ★ 30, 5.6, IIT (KGP) MBA, IIM (AHM) 1Cr /A, 30Cr ★ 98488 97778

కమ్మ : 30, 5.6, MS (Standford) 1000Cr ★ 30, 5.8, MS, 1000Cr ★ 27, 5.6, MS, 600Cr ★ Own Business Bangalroe ★ 96666 58789

కమ్మ : 27, 5.5, M.Tech, 40 L/A, 30Cr ★ 28, 5.4, M. Tech, 75 L/A, 30Cr ★ 28, 5.4, M. Tech, 35 L/A, 20Cr ★ 28, 5.5, M.Tech, 35 L/A, 15 Cr ★ 95420 16659

కమ్మ : 27, 5.8, B.Tech, MBA, 16 L/A, 45 Cr ★ 26, 5.5, B.Tech, MBA, 13 L/A, 20Cr ★ 27, 5.6, B.Tech, MBA, 18 L/A, 15 Cr ★ 99510 32647

కమ్మ : Divorce : 30, 5.3, B.Tech, MBA, 30 L/A, 20Cr ★ 26, 5.7, B.Tec, MBA, 18 L/A, 15Cr ★ 28, 5.7, MS 35 L/A, 25 Cr ★ 99481 29111

వధువు కావలెను

కమ్మ : 33, 5.11, MCH (Neuro Surgeon) 50Cr ★ 33, 6.1, MCH (Urology) 60 Cr ★ 34, 5.10, MCH (Neuro Surgeon) 40Cr ★ 96666 58789

కమ్మ : 32, 6, MCH (Cardiothoroxis Surgeon) 70Cr ★ 33, 5.11, MCH (Surgical Oncology0 50Cr ★ 34, 5.10, MCH (Plastic Surgeon) 50Cr ★ 98488 97778

కమ్మ : 34, 5.11, DM (Cardiology) AIMS (Delhi) 80Cr ★ 33, 6, DM (Endocronology) 65Cr ★ 31, 5.10, DM (Cardiology) 40Cr ★ 89782 17967

కమ్మ : 30, 5.11, MS (GS), 50Cr ★ 30, 5.7, MS (GS), 70Cr ★ 30, 5.10, MD (Anesthesia) 50Cr ★ 30, 5.8, MD (GM) 40Cr ★ 83745 39819

కమ్మ : 28, 5.10, MD (GM) 200Cr ★ 30, 5.11, MD (GM) 200Cr ★ 30, 5.11, MS (GS) 80Cr ★ 30, 6, MS (Ortho) 30Cr ★ 99481 29222

కమ్మ : 30, 6, MD (Palmonology) 60Cr ★ 30, 5.10, MD (GM) 50Cr ★ 30, 6, MD (GM) 15 Cr ★ 31, 5.10, MD (Radiology) 30Cr ★ 98487 54267

కమ్మ : USA Citizne : 32, 6, MD (Internal Medicine) 350K$, 100Cr ★ 32, 5.11, MD (Internal Medicine) 300K$, 30Cr ★ 33, 5.10 MD (Internal Medicine) 400K$, 40Cr ★ 9948 129111

కమ్మ : USA Citizen : 35, 5.11, DM (Neurology) 450K$, 30Cr ★ 34, 5.10, MD (Pediatrics) 450K$, 50Cr ★ 33, 6, DM (Cardiology) Heart transplant 500K$, 50Cr ★ 99510 32647

కమ్మ : UK Citizen : 31, 6, MS (General Surgery) Gold Medal DMAS, MRCS (Edinburgh) Fellowship in liver transplant surgery london, 100Cr ★ 95420 16659

కమ్మ : Australia : 31, 5.11, MCH (Surgical Oncology) 350 KAUD$, 100Cr ★ 28, 5.10, MD (Radiology) 250K$ AUD, 60 Cr ★ 30, 6, MD (General) 50Cr ★ 96666 58789

కమ్మ : Divorce : 33, 6, MCH (Surgical Oncology) 60 L/A, 100Cr ★ 34, 5.8, DM (Cardiology) 50 L/A, 60Cr ★ 35, 6.1, DM (Cardiology) 50 L/A, 50Cr ★ 98488 97778

కమ్మ : 31, 5.11, MS (Standford) 300K$, 50Cr ★ 31, 6.1, MS (Standford) 250K$, 50Cr ★ 32, 5.10, MS, (Harward), 200K$, 30Cr ★ 95420 16659

కమ్మ : 30, 5.11, MS, PHD, MBA (Harward) 300K$, 25Cr ★ 31, 5.11, MS, 175K$, 20Cr ★ 30, 5.10, MS, 150K$, 20Cr ★ 99510 32647

కమ్మ : 27, 6.1, MS, 175K$, 25 Cr ★ 27, 5.9, MS, 120K$, 25Cr ★ 27, 5.10, MS, 140K$, 15Cr ★ 27, 5.11, MS, 145 K$, 30Cr ★ 99481 29111

కమ్మ : 27, 5.11, MS, 140K$, 20Cr ★ 28, 5.11, MS, 130K$, 15Cr ★ 28, 5.11, MS, 150K$, 20Cr ★ 28, 5.8, MS, 152K$, 10Cr ★ 98487 54267

కమ్మ : 28, 5.7, MS, 187K$, 20Cr ★ 28, 5.10, MS, 255K$, 20Cr ★ 30, 5.6, MS, 195K$, 40Cr ★ 30, 6, MS, 250K$, 20Cr ★ 99481 29222

కమ్మ : Australia : 27, 5.11, MS, 100 AUD, 10Cr ★ 28, 5.8, MS, 80 AUD, 15Cr ★ 28, 6, MS, 100 AUD$, 10Cr ★ 30, 6, MS, 95 AUD$, 35 Cr ★ 83745 39819

కమ్మ : Austrailia : 30, 5.8, MS, 100 AUD$, 10Cr ★ 30, 5.10, MS, MBA, 100 AUD$, 15Cr ★ 30, 5.11, MS, 90 AUD$, 10Cr ★ 89782 17967

కమ్మ : 28, 6, IIT (KGP), 60 L/A, 50Cr ★ 28, 5.10, IIT (Gowhathi) 75 LA, 40Cr, ★ 28, 5.8, IIT (KGP) 50 L/A, 20Cr ★ 98488 97778

కమ్మ : 31, 6, IIT (KGP) MBA, IIM (CAL) 1Cr / A, 100Cr ★ 32, 5.11, IIT (KGP) MBA, IIM, (CAL) 50 L/A, 30Cr ★ 33, 6, IIT (Khanpur) MBA, IIM (KOZ) 80 L/A, 30Cr ★ 96666 58789

కమ్మ : 30, 6, MS (Harward) 1000Cr ★ 33, 6, MBA (Standford) 2 Cr /A, 200Cr ★ Own Business HYD ★ 95420 16659

కమ్మ : Divorce : 30, 5.7, IIT (BNG) IIM (BNG) 40 L/A, 20Cr ★ 32, 5.11, IIT (Khanpur) 80 L/A, 50Cr ★ 34, 6, IIT (KGP) MBA, IIM (CAL) 1 Cr / A, 50C ★ 99510 32647

బిజినెస్

ఫ్రెంచ్ కంపెనీతో ధ్రువ స్పేస్ జట్టు

» వచ్చే ఏడాది నుంచి ఐఓటీ సేవలు

హైదరాబాద్: ఫ్రాన్స్‌కు చెందిన శాటిలైట్ ఆపరేటర్, గ్లోబల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) కనెక్టివిటీ ప్రొవైడర్ కినీస్‌తో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యంలో వచ్చే ఏడాది నుంచి భారత్‌లో కినీస్ ఐఓటీ కనెక్టివిటీ సేవలందించడంతోపాటు ధ్రువ స్పేస్ పీ-30 శాటిలైట్‌పై కినీస్ ఐఓటీ పేలోడ్‌ను లాంచ్ చేయనున్నారు. అలాగే రెండు కంపెనీలు సంయుక్తంగా భారత అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచేందుకు శాటిలైట్ మిషన్‌ను చేపట్టనున్నాయి. అంతేకాదు, భారత వినియోగదారులకు అందుబాటు ధరలో ఆధునిక, నమ్మకమైన ఐఓటీ సేవలందించడంతోపాటు కస్టమర్ల అవసరానికి అనుగుణంగా కొత్త అప్లికేషన్లు, సేవల అభివృద్ధికి ఈ భాగస్వామ్యం కృషి చేయనుంది.

దేశంలో అత్యంత విలువైన బ్రాండ్లలో ఎల్ఐసీకి 4వ స్థానం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ దేశంలోని అత్యంత విలువైన బ్రాండ్లలో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాదికి గాను బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన రిపోర్టు ప్రకారం.. ఎల్ఐసీ బ్రాండ్ విలువ 980 కోట్ల డాలర్లుగా, బ్రాండ్ శక్తి సూచీలో సంస్థ స్కోర్ 88గా నమోదైంది. అంతేకాదు, ఎల్ఐసీకి బ్రాండ్ ఫైనాన్స్ ట్రిపుల్ ఏ బ్రాండ్ రేటింగ్‌ను కేటాయించింది. కాగా, అత్యంత శక్తిమంతమైన దేశీ బ్రాండ్లలో ఎల్ఐసీ మూడో స్థానంలో నిలిచింది.

ఎస్‌బీఐ కొత్త ఛైర్మన్‌గా
తెలుగు తేజం

- చల్లా శ్రీనివాసులు శెట్టి ఎంపిక
- సిఫారసు చేసిన ఎఫ్ఎస్ఐబీ
- ప్రభుత్వ ఆమోదమే తరువాయి



మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త ఛైర్మన్‌గా తెలుగు తేజం చల్లా శ్రీనివాసులు శెట్టి పేరు దాదాపుగా ఖరారైంది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శెట్టి బ్యాంకు తదుపరి ఛైర్మన్ కానున్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదిస్తే ఎస్‌బీఐ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి అవుతారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల సారథులను, డైరెక్టర్లను ఎంపిక చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) శనివారం ఇంటర్వ్యూ చేసిన అనంతరం శ్రీనివాసులు శెట్టి పేరును సిఫారసు చేసింది. శెట్టి సహా మరో ఇద్దరు ఎస్‌బీఐ ఎండీలు అశ్విని కుమార్ తివారీ, వినయ్ ఎం టాన్సేలను కూడా ఎఫ్ఎస్ఐబీ ఇందుకోసం ఇంటర్వ్యూ చేసింది. అయితే ఎస్‌బీఐలో 36 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న శెట్టి పేరును సిఫారసు చేసింది. ఎఫ్ఎస్ఐబీ ఎంపిక చేసిన పేరును ప్రధాని అధ్యక్షతన జరిగే నియామకాల కేంద్ర కేబినెట్ కమిటీ భేటీలో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆమోదిస్తే ప్రస్తుత ఛైర్మన్ దినేష్ ఖారా స్థానంలో శెట్టి ఆగస్టు 28న ఎస్‌బీఐ కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు.

తెలంగాణ వాడే..

తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని పెద్ద పోతుల పాడు శ్రీనివాసులు శెట్టి స్వగ్రామం. ఏడో తరగతి వరకు స్వగ్రామంలోనే ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఎనిమిది నుంచి పదో తరగతి, ఇంటర్ గద్వాలలో పూర్తి చేశారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేశారు. చిన్న వయసులోనే తండ్రి కిరాణా షాపులో గ్రామస్థులు తీసుకున్న అప్పులు వసూలు చేసేవారు. ఈ అప్పుల వసూళ్ల అనుభవం ఎస్‌బీఐలో మొండి బకాయిల వసూళ్లలోనూ ఉపయోగపడిందని ఆయన చెబుతారు. 1988లో ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరిన శెట్టి.. గత మూడున్నర దశాబ్దాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్, రుణాల వసూళ్లు, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ రంగాల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. శెట్టి ప్రస్తుతం ఎస్‌బీఐ ఎండీగా ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఎస్‌బీఐ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా స్వగ్రామం పెద్ద పోతుల పాడు, దాని చుట్టుపక్కల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీకి రూ.40 లక్షల విలువ చేసే సామాగ్రిని అందజేయగా.. అంతక్రితం ఊరూరా తిరిగి రోగులకు ఔషధాలు అందించే ఎస్‌బీఐ సంజీవని వాహనాన్ని డొనేట్ చేశారు. శ్రీనివాసులు శెట్టికి ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు కెనడాలో, మరొకరు ముంబైలో స్థిరపడ్డారు.

హెచ్‌సీజీ గూటికి వైజాగ్‌లోని క్యాన్సర్ ఆసుపత్రి

» డీల్ విలువ రూ.414 కోట్లు

విశాఖపట్నం: దేశంలో అతిపెద్ద క్యాన్సర్ కేర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నెట్‌వర్క్ హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌సీజీ).. వైజాగ్‌కు చెందిన మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంజీసీహెచ్ఆర్ఐ)ను రూ.414 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువకు కొనుగోలు చేసింది. ఎంజీసీహెచ్ఆర్ఐలో హెచ్‌సీజీ తొలుత 51 శాతం వాటాను దక్కించుకోనుంది. ఆ తర్వాత 18 నెలల్లో మరో 34 శాతం వాటాను చేజిక్కించుకోనుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎంజీసీహెచ్ఆర్ రూ.120.2 కోట్ల ఆదాయంపై రూ.42.2 కోట్ల స్థూల లాభాన్ని గడించింది. ప్రముఖ ఆంకాలజీ సర్జన్ డాక్టర్ మురళీ కృష్ణ వూన్న 1986లో ఎంజీసీహెచ్ఆర్ఐని ప్రారంభించారు. 196 పడకల సామర్థ్యంతో కూడిన ఈ ఆసుపత్రి.. 2 లినాక్ మెషీన్స్, ఒక పెట్ సిటీ స్కానర్, ఒక రోబోటిక్ సర్జరీ సిస్టమ్, డెడికేటెడ్ బోన్ మారోవ్ ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ వంటి అత్యాధునిక మౌలిక వసతులను కలిగి ఉంది. కాగా, హెచ్‌సీజీ భారత్, ఆఫ్రికాలో కలిపి 21 ఆసుపత్రులను నిర్వహిస్తోంది.

సీబీడీటీ కొత్త ఛైర్మన్‌గా రవి అగర్వాల్

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) కొత్త ఛైర్మన్‌గా రవి అగర్వాల్ నియమితులయ్యారు. 1988వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి అయిన రవి అగర్వాల్ వచ్చే ఏడాది జూన్ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ జూన్ 30తో సీబీడీటీ ఛైర్మన్‌గా పదవీ కాలం ముగుస్తున్న నితిన్ గుప్తా స్థానాన్ని అగర్వాల్ భర్తీ చేయనున్నారు. అగర్వాల్ ప్రస్తుతం సీబీడీటీలో అడ్మినిస్ట్రేషన్ విభాగ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.26,565 కోట్లు

న్యూఢిల్లీ : విదేశీ సంస్థాగత మదుపరులు(ఎఫ్‌పీఐ) మళ్లీ మన స్టాక్ మార్కెట్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జూన్‌లో ఎఫ్ఐఐలు మన స్టాక్ మార్కెట్‌లో రూ.26,565 కోట్ల విలువైన నికర పెట్టుబడులు పెట్టారు. ఎన్నికల తర్వాత ఎలాంటి ప్రభుత్వం వస్తుందోననే భయంతో ఇదే ఎఫ్ఐఐలు ఏప్రిల్-మే నెలల్లో పెద్ద పెద్ద మొత్తంలో అమ్మకాలు జరిపాయి. ఎన్నికల తర్వాత సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ సంస్కరణలు కొనసాగుతాయనే నమ్మకం, జీడీపీ వృద్ధి జోరు, కంపెనీల ఆర్థిక ఫలితాలు బాగుండటంతో మళ్లీ మన మార్కెట్‌పై దృష్టి పెట్టాయి.

ఎన్‌టీపీసీ రూ.12,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ రూ.12,000 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. రుణ పత్రాలు(బాండ్స్), నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల(ఎన్‌సీడీ) ద్వారా ఎన్‌టీపీసీ ఈ నిధులు సమీకరించనుంది. శనివారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వాయిదాల్లో ఈ నిధులు సమీకరించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. వ్యాపార విస్తరణ కోసం కంపెనీ ఈ నిధులను వినియోగించనుంది.

పోస్ట్ సేల్ డిస్కౌంట్‌పై జీఎస్‌టీ సర్దుబాటు ఎలా..?

డీలర్స్, స్టాకిస్టులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా అమ్మకాలు పెంచుకునేందుకు చాలా కంపెనీలు పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను ప్రకటిస్తుంటాయి. మరి ఈ డిస్కౌంట్‌ను జీఎస్‌టీలో ఎలా చూపించాలో తెలుసుకుందాం..


ఇదీ GST
రాంబాబు గొండాల

లక్ష్మీ సిమెంట్స్ అనేక ప్రాంతాల్లో డీలర్స్‌ను కలిగి ఉంది. వ్యాపార విస్తరణలో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు డీలర్స్ నెట్‌వర్క్‌ను కూడా గణనీయంగా పెంచుకుంది. అమ్మకాలు పెంచుకునేందుకు కంపెనీ తన డీలర్స్‌కు పలు ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెట్టింది. ఒకటి కంపెనీ నుంచి కొనుగోళ్లపై డీలర్‌కు డిస్కౌంట్ ఇచ్చే స్కీమ్. రెండో పథకంలో నెల, త్రైమాసిక, వార్షిక కొనుగోళ్ల టార్గెట్‌ను చేరుకున్న ఆధారంగా వారికి డిస్కౌంట్ అమలయ్యేలా చూడటం. అంటే, అమ్మకం జరిగిన తర్వాత డీలర్స్‌కు డిస్కౌంట్ ఇవ్వడం. ఇది కంపెనీకి, డీలర్‌కు మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఉంటుంది. ఉదాహరణకు, లక్ష్మీ సిమెంట్స్ తన డీలర్స్‌కు ఒక త్రైమాసికంలో 50 లక్షల మేర కొనుగోలు చేస్తే అదనంగా 3 శాతం డిస్కౌంట్, కోటి పైన కొనుగోళ్లపై 5 శాతం డిస్కౌంట్ కల్పిస్తోంది అనుకుందాం.

జీఎస్‌టీ నిబంధనల ప్రకారం, ఇన్వాయిస్‌లో చూపే మొత్తంపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, అమ్మకం జరిగే నాటికే ఇన్వాయిస్ జారీ చేసి ఉండాలి. కాబట్టి, పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను ఇన్వాయిస్‌లో చూపించడం జరగదు. ఎందుకంటే, ఒప్పందం ప్రకారం నిర్దిష్ట మొత్తం కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ పోస్ట్ సేల్ డిస్కౌంట్ వర్తిస్తుంది. లక్ష్మీ సిమెంట్స్ విషయానికొస్తే, త్రైమాసిక కొనుగోళ్ల ఆధారంగా డీలర్స్‌కు ఇవ్వాల్సిన పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను లెక్కించేందుకు చాలా సమయం పడుతుంది. ఆ తరువాత డిస్కౌంట్‌కు సరిపోను క్రెడిట్ నోట్‌ను జీఎస్‌టీ కలిపి జారీ చేయడం జరుగుతుంది. అప్పటికే జరిపిన కొనుగోళ్లకు సంబంధించి ఆ డీలర్, కంపెనీకి ఇన్వాయిస్ మొత్తం జీఎస్‌టీతో సహా చెల్లించడం.. కంపెనీ ఆ మొత్తంపై జీఎస్‌టీ చెల్లించడంతోపాటు సదరు డీలర్ చెల్లించిన జీఎస్‌టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రూపంలో పొందడం జరుగుతుంది. అంటే, అదనపు డిస్కౌంట్‌తో పాటుగా సంబంధిత జీఎస్‌టీని కూడా కంపెనీ సదరు డీలర్‌కు వెనక్కి ఇచ్చేస్తుంది. ఆ సందర్భంలో కంపెనీ తాను చెల్లించిన జీఎస్‌టీని ఎలా వెనక్కి పొందాలి..? దీనికి జీఎస్‌టీ చట్టంలో కొన్ని నియమాలు న్నాయి. దీని ప్రకారం, పోస్ట్ సేల్ డిస్కౌంట్‌పై జీఎస్‌టీలో మినహాయింపు పొందాలంటే, ముందుగానే ఆ మేర ఒప్పందం జరిగి ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా, సదరు డీలర్ తీసుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పోస్ట్ సేల్ డిస్కౌంట్‌కు వర్తించే మేర రివర్స్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే కంపెనీ తను డీలర్‌కు ఇచ్చిన డిస్కౌంట్‌కు సరిపడా జీఎస్‌టీని తగ్గించుకోగలదు. అయితే, డీలర్ జీఎస్‌టీని రివర్స్ చేశాడా..? లేదా..? అని తెలుసుకోవడానికి కంపెనీ దగ్గర ఎలాంటి సదుపాయం లేదు. దాంతో జీఎస్‌టీ ఆడిట్ లేదా ఎంక్వయిరీలు జరిగినప్పుడు చాలా కంపెనీలు ఈ విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈమధ్యనే కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. సంబంధిత డీలర్ తన చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కాస్ట్ అకౌంటెంట్ ద్వారా డిస్కౌంట్ తీసుకున్న మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను రివర్స్ చేసినట్లు కంపెనీకి సర్టిఫికేట్ ఇవ్వాలి. అందులో క్రెడిట్ నోట్, ఇన్వాయిస్ వివరాలు, రివర్స్ చేసిన ఐటీసీ మొత్తం, ఏ విధంగా రివర్స్ చేయడం జరిగిందన్న వివరాలను పొందుపర్చాలి. ఆడిట్ లేదా ఎంక్వయిరీ సమయాల్లో ఆయా కంపెనీలు ఈ సర్టిఫికేట్‌ను ఆధారంగా చూపవచ్చు. ఏదైనా ఆర్థిక సంవత్సరంలో సరఫరాదారుడు తన డీలర్‌కు ఇచ్చిన పోస్ట్ సేల్ డిస్కౌంట్‌కు సంబంధించిన జీఎస్‌టీ మొత్తం రూ.5 లక్షల లోపే ఉంటే గనుక, ఆ డీలర్ సీఏ లేదా కాస్ట్ అకౌంటెంట్‌ల ద్వారా కాకుండా తనే స్వయంగా పైన తెలిపిన వివరాలతో కూడిన సర్టిఫికేట్‌ను జారీ చేయవచ్చు. కాబట్టి, పోస్ట్ సేల్ డిస్కౌంట్ కల్పించే కంపెనీలు తమ డీలర్ల నుంచి ఈ విధంగా సర్టిఫికేట్‌లను పొందాలి. అలాగే, గడిచిన సంవత్సరాలకూ ఈ సర్టిఫికేట్‌లను తీసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,280 ▲	66,250 ▲	94,500 ▲
ముంబై	71,840 ▲	65,800 ▲	88,000 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	535
వరంగల్	522	గోదావరి	525
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	130
కర్నూలు	112	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		


ఎమ్మెల్యే బోడెకు అభినందనలు తెలుపుతున్న ఏపీఎన్జీఓ ప్రతినిధులు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఏపీఎన్జీవో నేతల అభినందన

పెనమలూరు, జూన్ 29: ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను ఏపీఎన్జీవో నేతలు కలిసి అభినందనలు తెలిపారు. సంఘ అధ్యక్షుడు ఏ విద్యాసాగర్, నేతలు ఉండి వెంకట పురుషోత్తమరాజు, కార్యదర్శి కృష్ణారావు, రామకృష్ణ, విక్టర్, సురేష్, ఏడుకొండలు, మునిరాజు, సత్యనారాయణ రెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, మధు, నాగార్జున, రవి పాల్గొన్నారు.

నగరంలో స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్



విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సినీ రచయిత, ఎంపీ విజయేంద్ర ప్రసాద్ నగరంలోని మొగల్రాజపురంలో ఉన్న మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయానికి శనివారం వచ్చారు. ఈ సమితి కులమతాలకు అతీతంగా చేస్తున్న సేవలను అభినందించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీని ప్రశంసించారు. దసరా సమయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ, అయ్యప్ప భక్తులకు భిక్ష సద్ది, రంజాన్ నెలలో ఉపవాస దీక్షల విరమణలను గుర్తుచేశారు. మతసామరస్యాన్ని కాపాడేలా షుబ్లీ సేవలను విజయేంద్రప్రసాద్ అభినందించారు. అనంతరం ఆయనను షుబ్లీ ఘనంగా సత్కరించారు.


డీజీపీకి అభినందనలు తెలియజేస్తున్న గొట్టిపాటి రామకృష్ణ తదితరులు

డీజీపీకి గొట్టిపాటి అభినందనలు

పటమట, జూన్ 29: నూతన డీజీపీగా నియమితులైన ద్వారకాతిరుమలరావును శనివారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో ప్రముఖ న్యాయవాది, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి వెంకటరామకృష్ణ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ సమర్థుడైన నూతన డీజీపీ ద్వారకాతిరుమలరావు నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పరిడవిల్లుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఐ గుత్తికొండ శ్రీనివాస్ (అమెరికా), ఏపీ ప్రైవేట్ మెడికల్ కాలేజ్ అసోసియేషన్‌కు చెందిన గన్నిభాస్కరరావుల ఉన్నారు.

వీఎంసీలో ప్రత్యేక కమిటీల సమావేశం

చిట్టినగర్, జూన్ 29: నగరం పరిధిలోని అభివృద్ధి పనులకు 4 ప్రత్యేక కమిటీల సమావేశం శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాలల్ ప్రాంగణంలో జరిగింది. రోడ్లు, డ్రైన్లు వంతెనలు, భవన నిర్మాణాల ప్రత్యేక కమిటీలో నగర పరిధిలోని పలువురు కార్పొరేటర్లు రోడ్లు, డ్రైయిన్లకు సంబంధించి 22 అంశాలను పెట్టారు. కమిటీ వాటిపై చర్చించింది. అలాగే మంచినీటి సరఫరా, భూగర్భ మురుగునీరు పారుదల ప్రత్యేక కమిటీలో 3 అంశాలు, లైటింగ్ పార్కుల అభివృద్ధి ప్రత్యేక కమిటీలో 6 అంశాలు, క్రీడలు, ట్రాఫిక్ ప్రత్యేక కమిటీ 9 అంశాలపై ఆయా కమిటీ చర్చించారు. తొలుత ఆయా కమిటీ సభ్యులు కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి కమిటీలకు వచ్చిన ప్రతిపాదనలను తెలిపారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి

● కమిషనర్ స్వప్నిల్ దినకర్ ● డయేరియా సంబంధిత ఫిర్యాదులకు వాట్సాప్ 8181960909

చిట్టినగర్, జూన్ 29: డయేరియా, మలేరియా, డెంగ్యూ వ్యాధులపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా డోర్ టు డోర్ అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. నగర ప్రజలు డయేరియా ఫిర్యాదుల తెలిపేందుకు వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటలు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.డయేరియా ఫిర్యాదులను 8181960909 నంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. అలాగే 0866-2422515, 08662427485, 08662424172, 0866-2422400కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ప్రతి సర్కిల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోలన్నారు. మలేరియా. డెంగ్యూ సోకకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్లు రమ్యకీర్తన, ప్రభుదాస్, శివరామకృష్ణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, ఎస్.ఈ నరసింహమూర్తి, ప్రసాద్, శ్రీనివాసరావు, సామ్రాజ్యం, వెంకటేశ్వర రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, రామకోటేశ్వరరావు, బాబు శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్



అత్యున్నత డయాగ్నోస్టిక్‌గా 'నీజెన్'

● ఎండీ డాక్టర్ రామ్‌ప్రకాష్

లబ్బీపేట, జూన్ 29: మహానగరాలకు దీటుగా, అత్యున్నత శ్రేణి డయాగ్నోస్టిక్ సేవలందించేందుకు నీజెన్ డయాగ్నోస్టిక్స్ రూపుదిద్దుకుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రకాష్ తెలిపారు. బందర్‌రోడ్డులోని హోటల్ గ్రాండ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి అత్యాధునిక రిఫరల్‌ల్యాబ్ నీజెన్ ప్రత్యేకతల్లో ఒకటని, స్పెషాలిటీ ల్యాబ్స్ జినోమిక్స్ రాష్ట్ర వైద్యరంగంలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించనుందన్నారు. వ్యాధి నిర్ధారణ ఫలితాల కోసం రోజుల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండా, అత్యాధునిక సాధనా సంపత్తి, నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, క్లినికల్ బృందాలతో నీజెన్‌ను తీర్చిదిద్దామన్నారు. నీజెన్ నందు జెనెటిక్స్, జినోమిక్స్, ఫార్మాకోజినోమిక్స్, మైక్రోబయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, రేడియాలజీ, బయో కెమిస్ట్రీ, పాథాలజీ, హెమటాలజీ ఫ్లోసైటోమెట్రో, ఇమ్యూనాలజీ, యాంటి నేటల్, ప్రీ నేటల్, న్యూబోర్న్ స్క్రీన్ వంటి 2వేల రకాలకు పైగా పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రకాశం రోడ్డులో ఆదివారం ఉదయం 9గంటలకు నీజెన్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు
ఆళ్ల గోపాలకృష్ణ బృందం అభినందన

వన్‌టౌన్, జూన్ 29: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆయన చాంబర్‌లో శనివారం టీడీపీ సీనియర్ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాల కృష్ణారావు నాయకత్వంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కౌలూరి రాజాచంద్రమౌళి, రాష్ట్ర నీరు, చెట్టు కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు చెన్నుపాటి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం గోపాలకృష్ణారావు నగరంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ నేతలపై న్యాయస్థానాల పరిధిలోని రాజకీయ ప్రేరేపిత కేసులను ఏడాదిలోగా తొలగిస్తామని పల్లా శ్రీనివాసరావు తెలిపారన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణంతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అధినాయకత్వంతో కలిసి పనిచేస్తామని వెల్లడించారని ఆయన దూరదృష్టికి ఇది నిదర్శనమన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

ప్రశ్నించే గొంతు మూగబోయింది

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, జూన్ 29: తెలుగుదేశం పార్టీ ఉంగుటూరు మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ ఆకస్మిక మరణం ఆమె కుటుంబానికే కాకుండా పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రమ్యకృష్ణ కుటుంబసభ్యులను శనివారం ఉదయం పెద అవుటపల్లిలోని ఆమె స్వగృహంలో వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు పరామర్శించిఓఐ చారుచారుచారు. రమ్యకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు, పార్టీ వెన్నంటే ఉండి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, నిజాయితీ, నిబద్ధతతో పార్టీ అభివృద్ధికి రమ్యకృష్ణ కష్టించి పనిచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆమెపై ఎన్ని కేసులు పెట్టి వేధించినా బెదరక పోరాడిన తీరు మహిళలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. పార్టీ అధికారంలోకి రావటంకోసం ఎంతగానో కష్టపడిన రమ్యకృష్ణ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే అకాలమరణం చెందడం బాధాకరమన్నారు. గన్నవరంలో ప్రశ్నించే గొంతు మూగబోయిందని, ఆమె కుటుంబానికి, పార్టీతోపాటు తాను అండగా ఉంటానని వెంకట్రావు హామీ ఇచ్చారు. గ్రామపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖర్, స్థానిక నేతలు కొండేటి వెంకటేశ్వరరావు, మాదల భాస్కరరావు, కొండేటి కొండలరావు, సుజన్‌బాబు, గొట్టుముక్కల కిట్టయ్య, యార్లగడ్డ లక్ష్మయ్య, కాటూరి వరప్రసాద్, రెబ్బా తంబి, అజయ్‌శేఖర్ పాల్గొన్నారు.


రమ్యకృష్ణ తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ జ్ఞానేశ్వరి దంపతులు


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నేడు ఆర్యవైశ్య మహాసభ
మహిళా విభాగ్ ప్రమాణ స్వీకారం

మొగల్రాజపురం, జూన్ 29: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు మహాసభ గౌరవాధ్యక్షుడు సీపీ పెనుగొండ సుబ్బారాయుడు చెప్పారు. శనివారం మొగల్రాజపురం నిమ్మతోట ప్రాంతంలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహిళా విభాగ్ నూతన అధ్యక్షురాలిగా కొప్పురావూరి రజని నియమితులయ్యారని ఆమెతోపాటు కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, మహాసభ గౌరవ ఛైర్మన్ టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, మహాసభ అధ్యక్షుడు చిన్నం రామకోటయ్య, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొంటారన్నారు. వెన్యూ ఫంక్షన్ హాలులో నిర్వహించే సమావేశానికి ఆర్యవైశ్యులు తరలి రావాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. నగర మహాసభ అధ్యక్షుడు గడ్డం సత్యన్నారాయణ, ప్రతినిధులు తుమ్మల పెంట శ్రీనివాస్, గోంట్లా రామ్మోహన్‌రావు, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మారం రోజా రాణి, ప్రధాన కార్యదర్శి ఆరవేటి నిర్మల, కోశాధికారి శైలజ రాణి పాల్గొన్నారు.

విద్యార్థి నేతల ప్రమాణ స్వీకారోత్సవం

పటమట, జూన్ 29: నగరంలోని పటమట ఎన్ఎస్ఎం పబ్లిక్‌స్కూల్లో శనివారం విద్యార్థి నేతల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జేసీ కిషోర్‌కుమార్ హాజరై విద్యార్థులు ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థి నేతలుగా మాస్టర్ ఇషాన్ ఈ నాని, డి.మౌనిక ఎన్నికవగా, వివిధ క్లాస్‌లకు, క్లబ్‌లకు ఎంపికైన విద్యార్థులకు ముఖ్య అతిథులు బాధ్యతలు అప్పగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, డాక్టర్ డి. నాగరమేష్, కరస్పాండెంట్ మౌంట్ ఫోర్డు, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

మొగల్రాజపురం, జూన్ 29: పీబీ సిద్ధార్థ కళాశాల రసాయన శాస్త్ర విభాగం, ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా జూలై 1, 2న 'చికిత్స రంగంలో ఆధునిక ఒరవడులు-విప్లవాత్మక మార్పులు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ శనివారం తెలిపారు. ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి ఆచార్యులు, శాస్త్రవేత్తలు విచ్చేస్తున్నట్టు నిర్వాహక సంఘం కన్వీనర్, కృష్ణా విశ్వ విద్యాలయం రసాయిన శాస్త్ర ఆచార్యులు ఎంవీ, బసవేశ్వరరావు చెప్పారు. అనంతరం సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. కళాశాల అధ్యాపకులు, రసాయన శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, జూన్ 29: దుర్గగుడిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కూనపరెడ్డి నాగ వెంకటేశ్వరరావు, కుటుంబసభ్యులు శనివారం రూ.1,00,116 ఈవో రామారావును కలిసి దేవస్థానానికి విరాళంగా చెక్కును అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈవో వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ధర్మపథం వేదికపై శనివారం బెంగుళూరుకు చెందిన నాట్యశాల కళాకారులు భరతనాట్య ప్రదర్శన చేశారు. నాట్యశాల నిర్వాహకుడు దీపక్ ఆధ్వర్యంలో కళాకారులు కీర్తనలకు రాగ, తాళయుక్తంగా తమదైన అభినయ కౌశలం ప్రదర్శించారు.



జియాన్‌ఫ్రాంకో డి సిక్కో(అమెరికా), సీన్ హించ్‌బెర్గర్(కెనడా), డేవిడ్ బి పాల్(అమెరికా), రిచర్డ్ డొనెల్లీ(కెనడా)

నేడు పోలవరానికి విదేశీ నిపుణుల బృందం

» ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సమగ్ర పరిశీలన

పోలవరం, జూన్ 29: ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును ఆదివారం విదేశీ నిపుణుల బృందం పరిశీలించనుంది. ఈ బృంద సభ్యులు ఉదయం 9.45గంటలకు రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టు అతిథి గృహానికి రోడ్డు మార్గాన చేరుకుంటారు. ప్రాజెక్టు అధికారులతో కలసి ఎగువ కాఫర్ డ్యాం, రివర్ బెడ్‌లో జెట్ గ్రౌటింగ్, ఎగువ కాఫర్ డ్యాం సెక్షన్, డ్యాం నిర్మాణం ఫొటో ఎగ్జిబిషన్, ఐసీసీఎస్ ద్వారా నిర్ధారించిన కాఫర్ డ్యాం సామర్థ్యం, సీపేజీ విషయంలో 2023 సెప్టెంబరులో హెచ్‌పీటీ ప్రొఫెసర్ రాజు బృందం నివేదికలను పరిశీలిస్తారు. అనంతరం 2020-23 వరకు జరిగిన సీపేజీ తీవ్రత తెలిపే ఫిజియో మీటర్ రీడింగులు, మట్టి రాతి నాణ్యతా పరిశీలన(సీఎస్ఎంఆర్) జియో ఫిజికల్ నివేదికలు, ఏఎఫ్‌ఆర్‌పై ప్రతిపాదించిన జియో టెక్నికల్ పరిశోధన వివరాలను పరిశీలిస్తారు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద చానల్ 1450 నుంచి 290 వరకు ఫొటోగ్రాఫ్ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే దిగువ కాఫర్ డ్యాంలో రివర్ బెడ్ జెట్ గ్రౌటింగ్, దిగువ కాఫర్ డ్యాం సెక్షన్, క్రాస్ సెక్షన్ స్కవర్, దిగువ కాఫర్ డ్యాం నిర్మాణ ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన చేస్తారు. 2021-22 మే వరకు దిగువ కాఫర్ డ్యాంలో సీపేజీ వివరాలు పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటల వరకూ ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం గ్యాప్ 1, ఇండెక్స్ డ్యాం ప్లాన్, గ్యాప్-1లో సమస్యాత్మక ప్రాంతాన్ని, జియోలాజికల్ సెక్షన్, ఓవర్ ఆల్ లేఅవుట్ గ్రౌండ్ ఇంప్రూవ్ మెంట్, సీడబ్ల్యూసీ అప్రూవల్స్, డయాఫ్రంవాల్ తదితర అంశాలను పరిశీలిస్తారు. పీపీఏ నియమించిన విదేశీ నిపుణుల బృందంలో అమెరికాకు చెందిన జియన్‌ఫ్రాంకో డి సిక్కో ముఖ్యుడు. డయాఫ్రంవాల్, డ్రిల్ షాఫ్ట్‌లు సాయిల్ మిక్సింగ్ సస్టెయినబిలిటీ మెరైన్ ఫౌండేషన్ కమిటీలకు డీఎఫ్ఐ కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

భూకంప ఇంజనీరింగ్‌లో నిపుణుడు

జియో టెక్నాలజీలో 28 ఏళ్ల అనుభవం కలిగిన కెనడా నిపుణుడు సీన్ హించ్‌బెర్గర్‌కు ప్రాజెక్టుల నిర్మాణంలో రిస్క్ మేనేజ్‌మెంట్, ఫౌండేషన్ ఇంజనీరింగ్ టైలింగ్ డ్యాం లు, ఎంబాంక్‌మెంట్ డ్యాంల నిర్మాణం, మట్టిరాతి నాణ్యత స్ట్రక్చర్ ఇంటరాక్షన్, భూకంప ఇంజనీరింగ్‌లో నైపుణ్యం ఉంది.

ఇరాక్ ప్రభుత్వానికి సాంకేతిక సాయం

డేవిడ్ బి పాల్.. మోసుల్ డ్యామ్ టాస్క్‌ఫోర్స్‌కు డ్యామ్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేశారు. డ్యామ్ భద్రతా సమస్యలను తగ్గించడానికి ఇరాక్ ప్రభుత్వానికి సాంకేతిక సహాయాన్ని అందించారు. ఆనకట్టల నిర్మాణంలో మౌలిక సదుపాయాల కల్పన, లెవీ డిజైన్, ఇంజనీరింగ్ ప్రమాద అంచనాలు, డ్యాముల లెవీ భద్రతా మార్పులలో జాతీయ నిపుణుడు.

జియోటెక్నికల్‌లో ఎన్నో పరిశోధనలు

కెనడాకు చెందిన రిచర్డ్ డొనెల్లీ గతంలో జలశక్తికి స్వతంత్ర ప్రపంచ సలహాదారుగా వ్యవహరించారు. రిచర్డ్ జియో టెక్నికల్ ఇంజనీరింగ్, డ్యామ్ సేఫ్టీ, రిస్క్ ఇన్ఫర్మేషన్ డెసిషన్ మేకింగ్ హైడ్రోజియాలజీ, జియాలజీ సివిల్ ఇంజనీరింగ్‌లో ఎన్నో పరిశోధనలు చేశారు.

పింఛన్ల పండగకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ఇతర విభాగాల సిబ్బంది సేవలను కూడా వినియోగించుకునేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో మొదటిసారి పింఛన్ల పంపిణీ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం అని నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. జూలై 1న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉదయం 6 గంటలకు మొదటి పింఛను పంపిణీ చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. పింఛన్ సొమ్ముతోపాటు సీఎం రాసిన లేఖను కూడా లబ్ధిదారులకు తప్పనిసరిగా అందించాలని చెప్పారు. ఒకేరోజులో నూరుశాతం పింఛన్లు పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకుని కనీసం 95 శాతానికి పైగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియను కలెక్టర్లు గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు గాను 11 కేటగిరీల్లోని పింఛనుదారులకు పెంచిన పింఛను రూ.4వేలతో పాటు బకాయిలు కూడా కలిపి పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన మొత్తాన్ని శనివారం రాత్రిలోగా విత్‌డ్రా చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా శనివారం రాత్రికి డబ్బు ఇవ్వలేకుంటే ఆ బ్యాంకులు ఆదివారం తెరిచి ఉంచి పింఛన్ల సొమ్మును డ్రా చేసి ఇవ్వాలని, దీనికి సంబంధించి లీడ్ డిస్ట్రిక్ మేనేజర్లు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం నూతన యాప్‌ను సంబంధిత అధికారులు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.



సీఎం చంద్రబాబు సోమవారం సామాజిక పింఛన్ పంపిణీ చేయనున్న ఇల్లు

పింఛన్ల పంపిణీకి చంద్రబాబు హాజరు

అమరావతి(ఆంధ్రజ్యోతి)/తాడేపల్లి టౌన్, జూన్ 29: ముఖ్యమంత్రి చంద్రబాబు జూలై 1న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొననున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం పెనుమాకలో ఉదయం 6 గంటలకు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో సీఎం ముచ్చటిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 65.18 లక్షల మంది లబ్ధిదారులకు రూ.4,408 కోట్ల పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా స్వయంగా సీఎం ఒక గ్రామంలోని ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వడం చరిత్రలో ఇదే మొదటిసారి కానుంది.. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. కలెక్టర్ నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించారు.

నైరాశ్యం నుంచి నిర్మాణం దిశగా!

» జగన్ ధ్వంస రచనను సరిచేస్తూ అమరావతిలో నిర్మాణ ప్రక్రియ
» ప్రభుత్వ కాంప్లెక్స్ భూముల నోటిఫై
» సీఆర్‌డీఏ గెజిట్ నోటిఫికేషన్ జారీ
» మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం
» రాజధానిపై సర్కారు తొలి అడుగు




విజయవాడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అమరావతి ధ్వంస రచన కోసం.. జగన్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిన మాస్టర్ ప్లాన్‌ను సరిదిద్దేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం వాయువేగంతో కదులుతోంది. దీనిలో భాగంగా అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను నోటిఫై చేస్తూ శనివారం సీఆర్‌డీఏ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం గ్రామాల పరిధిలో ఉన్న 1,575 ఎకరాలను నోటిఫై చేశారు. ఈ మేరకు సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 39 ప్రకారం కమిషనర్ కాటమనేని భాస్కర్ బహిరంగ ప్రకటన జారీ చేయటంతో పాటు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అమరావతిలో ప్రభుత్వ భవనాల కోసం గత టీడీపీ ప్రభుత్వం 1,375 ఎకరాలను కేటాయించగా.. తాజాగా మరో 200 ఎకరాలను పెంచి నోటిఫై చేశారు. ఈ ప్రాంతంలో గత టీడీపీ హయాంలో ఇంటీరియం గవర్నమెంట్ కాంప్లెక్స్(ఐజీసీ), అసెంబ్లీ నిర్మాణాలను చేపట్టింది. వీటితో పాటు రాజ్‌భవన్, ముఖ్యమంత్రి నివాసంతో పాటు పలు కీలకమైన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మించే సచివాలయం కూడా ఉంది. మొత్తం 5 టవర్లను నిర్మించటానికి గతంలో ప్రణాళికలు రూపొందించారు. వీటిలో రెండు టవర్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి విధ్వంసానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో అమరావతిలోని ప్రభుత్వ కాంప్లెక్స్ ప్రాంతంపైనే టార్గెట్ పెట్టారు. ప్రభుత్వ పరిపాలనా భవన నిర్మాణాలను కొనసాగకుండా చేస్తూ.. అప్పటి వరకు 25 శాతం కూడా పురోగతి లేని పనులను నిలుపుదల చేశారు. ఈ ఆదేశాల వెనుక శాశ్వత ప్రాతిపదికన నిర్మించే భవనాల పనులను నిలిపివేయాలన్నదే జగన్ కుట్ర అని అప్పట్లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. శాశ్వత ప్రాతిపదికన చేపట్టే సచివాలయానికి సంబంధించి 5 టవర్లను నిర్మించకుండా తొక్కి పెట్టేందుకే 25 శాతం పురోగతి లేదన్న సాకుతో.. అమరావతిపై జగన్ వేటు వేశారు. శాశ్వత రాజధాని నిర్మాణాలలో భాగంగా మొత్తం ఐదు జీఏడీ టవర్లను 40 నుంచి 45 అంతస్థుల మేర నిర్మించాల్సి ఉంది. వాటిని కూడా జగన్ తన నిర్ణయాలతో సమాధి చేశారు. టీడీపీ హయాంలో రెండు జీఏడీ టవర్లను రాఫ్ట్ ఫౌండేషన్ విధానంలో చేపట్టారు. వాటిని కూడా నిలుపుదల చేయించారు. గత టీడీపీ హయాంలో దాదాపు 70 నుంచి 80 శాతం పనులు పూర్తి చేసుకున్న అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలతో పాటు, ఎన్‌జీవో భవనాల పనులను కూడా నిలుపుదల చేయించారు.

మాస్టర్ ప్లాన్‌కు తూట్లు

అమరావతిపై కత్తికట్టిన జగన్.. రాజధాని అభివృద్ధికి కీలకమైన మాస్టర్ ప్లాన్‌కే తూట్లు పొడిచారు. దీనిని ఇష్టానుసారంగా మార్చారు. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌ను మార్చాలంటే ముందుగా ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాలను ప్రాతిపదికగా తీసుకోవాలి. స్థానికంగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదన్న సాకుతో ఆయా గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారుల నిర్ణయాలను అమలు చేస్తూ మాస్టర్ ప్లాన్ సవరణలకు తెరదీశారు. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోతే గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాల్సింది పోయి.. ప్రత్యేకాధికారులపై ఒత్తిడిపెట్టి అనుకూలంగా తీర్మానాలు రాయించుకున్నారు. వాటి ఆధారంగా మాస్టర్ ప్లాన్‌కు సవరణలు చేశారు. జోనింగ్ రెగ్యులేషన్స్ మార్చాలన్న కుట్రతోనే జగన్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సవరణకు పూనుకొందన్న విమర్శలు వినిపించాయి. భూములు అమ్ముకునేందుకు, టౌన్‌షిప్పులకు ఇచ్చుకునేందుకు వీలుగా రియల్ ఎస్టేట్ ప్రణాళికలతో మాస్టర్ ప్లాన్‌లో సవరణలు చేశారు. మాస్టర్ ప్లాన్‌ను అడ్డగోలుగా మార్చివేసి ఆర్-5 జోన్ తీసుకువచ్చారు. ఇలా రాజధాని మాస్టర్ ప్లాన్‌ను చెడగొట్టేందుకు అప్పటి సీఎం జగన్ ఏకపక్షంగా వ్యవహరించారు.

మీ ఆశలు.. ఆకాంక్షలు నెరవేరుస్తాం



రాష్ట్రంలో జూలై 1న సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో పింఛనుదారులకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. ఆ లేఖలోని వివరాలు యథాతథంగా...

ప్రియమైన పింఛన్లదారులకు నమస్కారం...

"మీ అందరి మద్దతుతో మీకు అండగా నిలిచే.. మీ సంక్షేమం చూసే ప్రజాప్రభుత్వం ఏర్పాటైంది. ఏ ఆశలు, ఆకాంక్షలతో అయితే మీరు ఓట్లు వేసి గెలిపించారో వాటిని నెరవేర్చడమే తక్షణ, ప్రథమ కర్తవ్యంగా మీ ఈ ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మేనిఫెస్టోలో చెప్పినట్లు పింఛను ఒకేసారి రూ.1000 పెంచి... ఇకపై నెలనెలా రూ.4వేలు ఇస్తున్నాం. అలాగే దివ్యాంగులకు రూ.3 వేలు పెంచి... ఇక నుంచి రూ.6 వేలు ఇస్తున్నామని చెప్పడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. రాష్ట్రవ్యాప్తంగా 28 వర్గాలకు చెందిన 65,18,496 మంది పింఛన్ లబ్ధిదారులకు జూలై 1 నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్దనే అందిస్తున్నాం. కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ.. మీ సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే మీకు మంచి చేసే నిర్ణయాలు తీసుకున్నాం.

ఎన్నికల సమయంలో వికృత రాజకీయాల కోసం నాటి అధికార పక్షం మిమ్మల్ని పింఛన్ విషయంలో ఎంతో క్షోభ పెట్టింది. ఆ మూడు నెలల పాటు మీరు పింఛన్ అందుకోవడానికి పడిన కష్టాలు చూసి చలించిపోయాను. మండుటెండలో, వడగాల్పుల మధ్య మీరు పడిన అగచాట్లు చూసి.. ఏప్రిల్ నుంచే పింఛన్ పెంపును వర్తింపజేస్తానని మాటిచ్చాను. అందులో భాగంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు కూడా ఈ పెంపును వర్తింపజేసి మీకు అందిస్తున్నాం. మూడు నెలలకు పెంచిన రూ.3వేలు, జూలై నెల పింఛన్ రూ.4 వేలు కలిపి మొత్తం రూ.7వేలు మీ ఇంటికి తెచ్చి ఇస్తున్నాం.

పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై ఇకపై నెలకు అదనంగా 819కోట్ల భారం పడుతుంది. గడిచిన మూడు నెలలకు పెంచిన పింఛను ఇస్తానన్న హామీని నెరవేర్చేందుకు మరో రూ.1,650 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నాం. మీ శ్రేయస్సు కోసం ఆలోచించే మీ ప్రజా ప్రభుత్వం... దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జూలై 1న రూ.4,408 కోట్లను పింఛన్ల రూపంలో మీకు అందిస్తోంది.

సంక్షేమ పాలకుడు, సామాజిక పింఛన్ విధానానికి ఆద్యుడు ఎన్టీఆర్ పేరుతో 'ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు' ఇకపై మీ ఇంటి వద్దనే పంపిణీ చేస్తారు. పెరిగిన పింఛనుతో మీకు ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నాను. మీరు, మీ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తూ.. మీకు ఎప్పుడూ మంచి చేయాలని చూసే ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించమని కోరుతూ..."

- మీ చంద్రబాబు నాయుడు

అత్తెసరు మార్కులతో పాసైనా.. ఐటీ విభాగానికి జీఎం చేసేశారు!

» టీటీడీ పరువు తీస్తున్న నియామకాలు
» వైసీపీ మీడియా సెల్‌లో సేవలకు ప్రతిఫలం

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల తిరుపతి దేవస్థానాలను ఐదేళ్లుగా వైసీపీ జాగీరుగా మార్చేశారు. తాజాగా బయటపడిన టీటీడీ ఐటీ విభాగం జనరల్ మేనేజర్ నియామక వ్యవహారం ఈ విషయాన్ని తెలియజేస్తోంది. వైసీపీ సోషల్ మీడియా సెల్‌లో పనిచేసిన సందీప్ కోసం నిబంధనలు మార్చేసి, తీర్మానాలు తిరగరాసి జీఎం కుర్చీలో కూర్చోబెట్టిన తీరు నివ్వెరపరుస్తోంది. బీటెక్ బొటాబొటీ మార్కులతో పాసైన ఆయనకు టీటీడీలో ప్రతిష్ఠాత్మకమైన పోస్టునే కట్టబెట్టేశారు. టీటీడీలో సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు అవసరం అంటూ(నంబరు 268)2019 డిసెంబరు 29న బోర్డు సమావేశంలో తీర్మానం చేశారు. దీని నిర్వహణ కోసం సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్‌ను రెండేళ్ల కాలానికి కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించాలంటూ 2020 ఫిబ్రవరి 29న బోర్డు మరో తీర్మానం(నంబరు 296) చేసింది. అదే ఏడాది మే 28న జరిగిన సమావేశంలో రూ.లక్ష వేతనంతో ఎల్ఎం సందీప్‌ను ఈ పోస్టులో నియమిస్తూ తీర్మానం(నంబరు 110) ఆమోదించారు. జూన్ 8న ఆయన విధుల్లో చేరారు. ఆయన గతంలో వైసీపీ సోషల్ మీడియా విభాగంలో సేవలందించారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడకు చెందిన ఆయన ఎక్స్‌పర్ట్‌గా ఎటువంటి సేవలందించారోగానీ, ఆయన కాంట్రాక్టు ఉద్యోగం 2022 జూన్ 7న ముగియాల్సి ఉండగా, ఆ ఏడాది ఏప్రిల్ 30న జరిగిన బోర్డు సమావేశంలో మరో మూడేళ్ల పాటు పొడిగిస్తూ తీర్మానం(నంబరు 71) ఆమోదించారు. ఇక అక్కడి నుంచి నిచ్చెనలు పేర్చి సందీప్‌ను పైపైకి ఎక్కించే పని మొదలు పెట్టారు. సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్‌గా ఉన్న సందీప్‌కు టీటీడీ ఐటీ విభాగంలో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా మానిటరింగ్‌కు, టీటీడీ డేటా సెంటర్, డేటా రికవరీ సెంటర్ల సూపర్‌వైజరీ మెయింటెనెన్స్ కోసం, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు రూపొందించడానికి, టీటీడీలోని అన్ని విభాగాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఎస్ఎస్‌డీ కౌంటర్లు, అకామిడేషన్ అలాట్‌మెంట్ సెంటర్స్, తిరుమల, తిరుపతి సహా దేశవ్యాప్తంగా ఉన్న ఆపరేటివ్ సెంటర్లతో సమన్వయం కోసం ఆయన సేవలు అత్యవసరమని పాలకవర్గం భావించినట్లు బోర్డు తీర్మానంలో పేర్కొన్నారు. ఇంతటితో తృప్తి చెందలేదు. ఐటీ విభాగం మొత్తానికి ఆయనను అధిపతిని చేసేందుకు జీఎం పోస్టును సృష్టిస్తూ తీర్మానం చేశారు. ఆ వెంటనే 2022 జనవరి 29న ఐటీ విభాగం జీఎం పోస్టు భర్తీకి నోటిఫికేషన్(నంబర్ 1-2022) జారీ చేశారు. దానికి స్పందనగా 69 దరఖాస్తులు వచ్చాయి. వడపోతలో ఎల్ఎం సందీప్, ఎం.దివ్యతేజ్ మాత్రమే అర్హులుగా తేలారు. దివ్యతేజ్ అసలు ఇంటర్వ్యూకే హాజరు కాలేదు. అంతే సందీప్‌ను జీఎం పోస్టుకు ఎంపిక చేశారు. అయితే జీఎం పోస్టు తీర్మానం ప్రభుత్వ ఆమోదం పొందలేదు. దీంతో జీఎం పోస్టు భర్తీ నోటిఫికేషన్ చెల్లదని, రద్దు చేస్తున్నామంటూ అదే ఏడాది ఆగస్టు 10న అప్పటి ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అయినా బోర్డు పట్టు వదల్లేదు. నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఈవో జారీ చేసిన ఉత్తర్వులను బోర్డు ఆమోదించలేదు సరికదా మునుపటి నోటిఫికేషన్ చెల్లుబాటయ్యేలా, సందీప్‌ను జీఎంగా ఎంపిక చేసిన నిర్ణయం చెల్లుబాటయ్యేలా తీర్మానాలు చేసింది. అయినా సందీప్ నియామకం సాధ్యం కాకపోవడంతో ఏడాదిన్నర ప్రయత్నాల తర్వాత ప్రభుత్వం కూడా టీటీడీ ఐటీ విభాగంలో జీఎం సహా 34 పోస్టులు క్రియేట్ చేసేందుకు అనుమతిస్తూ 2023 డిసెంబరులో జీవోఎంఎస్ నంబరు 319 జారీ చేసింది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని తెలిసి మార్చి 15న సందీప్‌ను టీటీడీ ఐటీ విభాగానికి జీఎంగా నియమించేశారు.

పట్టుబట్టి మరీ నియామకం..

టీటీడీలో ఐటీ విభాగం జనరల్ మేనేజర్ పోస్టుకు ఎంతో క్రేజ్, డిమాండ్ ఉన్నాయి. అంతటి ఉద్యోగానికి నోటిఫికేషన్ వస్తే దేశవ్యాప్తంగా హేమాహేమీల్లాంటి సాఫ్ట్‌వేర్, సైబర్ టెక్నాలజీ నిపుణులు క్యూకడతారు. అలాంటిది బొటాబొటీ మార్కులతో పాసైన వ్యక్తి కోసం టీటీడీ పాలకమండలి పట్టుబట్టిన తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. సందీప్ తమిళనాడు స్టేట్ టెక్నికల్ బోర్డు నుంచి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిప్లొమా 52.62 శాతం మార్కులతో పాసయ్యారు. ఇంత తక్కువ మార్కులు సాధించిన ఈయన నియామకంలో జరిగిన పరిణామాలు అనేక సందేహాలను లేవనెత్తుతున్నాయి.

..బందరు పోర్టు బలి

(మొదటి పేజీ తరువాయి)

పోర్టు నిర్మాణాన్ని చేపట్టిన నవయుగను కాదని కమీషన్లు కురిపించే ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానాన్ని తెరపైకి తెచ్చారు. టెండరు నిబంధనలను తుంగలో తొక్కి మరీ మేఘ సంస్థకు టెండరు కట్టబెట్టారు. పైగా తాము ఎంతో నిజాయతీపరులమని ప్రజలను మభ్యపెట్టేందుకు రివర్స్ టెండరింగ్ అంటూ నాటకాలాడారు. మొత్తానికి బందరు పోర్టును సముద్ర నిర్మాణాల్లో ఎలాంటి అనుభవం లేని మేఘ సంస్థ చేతిలో పెట్టి చేతులు దులిపేసుకున్నారు. దీని ఫలితంగా పోర్టు పనులు నత్తనడక నడుస్తున్నాయి.

దశాబ్దాల కల...

బందరు పోర్టు నిర్మాణం ఉమ్మడి కృష్ణా జిల్లా వాసులకే గాక రాష్ట్ర ప్రజలందరి చిరకాల వాంఛ. బందరు పోర్టును అభివృద్ధి చేయాలని కోరుతూ 2001 నుంచి మచిలీపట్నం కేంద్రంగా ఉద్యమాలు నడిచాయి. వాటి ఫలితంగా 2008 ఏప్రిల్ 23న అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి కరగ్రహారం వద్ద బందరు పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. పోర్టు పనులు దక్కించుకున్న మేటాస్ సంస్థ ఆర్థిక చిక్కుల్లో పడటం.. అప్పటి ప్రభుత్వమూ పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రజలు మళ్లీ ఉద్యమబాట పట్టారు. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రలో టీడీపీ ప్రభుత్వం రావడంతో 2015 ఆగస్టులో పోర్టు, దాని అనుబంధ పరిశ్రమల కోసం 14 వేల ఎకరాలను కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. రైతులు ముందుకు రాకపోవడంతో 2016 ఆగస్టులో భూసమీకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. పోర్టు అభివృద్ధి కోసం 2016లో మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత భూసమీకరణ వేగం పుంజుకుంది. నవయుగ సంస్థకు పోర్టు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. 2019 ఫిబ్రవరి 7న అప్పటి సీఎం చంద్రబాబు తపసిపూడి వద్ద పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కొద్ది నెలలకే 2019 జూన్‌లో వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కింది. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. అదే ఏడాది ఆగస్టులో పోర్టు నిర్మాణ బాధ్యతల నుంచి నవయుగ సంస్థను తప్పిస్తూ జగన్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. 2023 మే 22న ముచ్చటగా మూడోసారి అప్పటి సీఎం జగన్ పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు.

'రివర్స్' పేరుతో డ్రామా..

బందరు పోర్టు నిర్మాణానికి రివర్స్ టెండరింగ్ ద్వారా టెండర్లు పిలిచి పెద్ద ఎత్తున డబ్బులు ఆదా చేస్తామని గత వైసీపీ సర్కార్ గొప్పలు చెప్పింది. రివర్స్ టెండరింగ్ అనేది పెద్ద బూటకమని అప్పట్లోనే పలువురు నిపుణులు గగ్గోలు పెట్టారు. వాస్తవానికి నవయుగ సంస్థకు పీపీపీ విధానంలో బిల్డ్, ఆపరేట్, షేర్, ట్రాన్స్‌ఫర్ మోడల్‌లో బందరు పోర్టు పనులను అంతకుముందు టీడీపీ ప్రభుత్వం అప్పగించింది. ఈ విధానం వల్ల నిర్మాణ సంస్థ తానే నిర్మాణ పనులు పూర్తి చేసి, పోర్టులో రాష్ట్ర ప్రభుత్వాన్ని భాగస్వామిగా చేర్చుకుంటుంది. ఈ విధానాన్ని తుంగలో తొక్కి కమీషన్లు గిట్టుబాటు అయ్యేలా వైసీపీ ప్రభుత్వం ఈపీసీ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఏపీ మారిటైం బోర్డు ఆధ్వర్యంలో బందరు పోర్టుకు టెండర్లు పిలిచారు. దేశంలోనే ఏ పోర్టు టెండర్లలోనూ లేనటువంటి విధంగా ఈ టెండర్ ప్రక్రియను సాగించారు. అర్హత ప్రక్రియ, గతంలో చేసిన పనులు వంటి వాటన్నింటినీ తమ అనుకూలమైన కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేలా మార్చేసి అర్హత లేని వారికి టెండర్లు కట్టబెట్టారు.

అంచనాలు 275 శాతం పెంపు

రివర్స్ టెండరింగ్ పేరుతో నవయుగ సంస్థ కాంట్రాక్టును రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం బందరు పోర్టు నిర్మాణ వ్యయం అంచనాలను అడ్డగోలుగా పెంచేసింది. వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచే నాటికి బందరు పోర్టు అంచనా వ్యయం రూ.11,463 కోట్లకు చేరింది. ఫేజ్-1కు రూ.3,670 కోట్లకు టెండరు పిలిచారు. దాన్ని ఈపీసీ విధానంలో రూ.5,155 కోట్ల వరకు పెంచుకునే వెసులుబాటు కల్పించారు. ఇదే ఫేజ్-1 పనులకు నవయుగ సంస్థకు ఇచ్చిన ప్రాజెక్టు వ్యయం రూ.1,868 కోట్లు. అంటే.. సుమారు 275 శాతం అధిక ధరకు మేఘ సంస్థకు ఫేజ్-1 పనుల టెండరు కట్టబెట్టారు.

అనుభవం లేకున్నా..

సముద్రంలో నిర్మాణ పనులు చేయాలంటే ప్రత్యేకమైన అనుభవం ఉండాలి. సముద్రంలో నిర్మించే జెట్టీలు, బెర్తులు, బ్రేక్ వాటర్, సముద్రంలో డ్రెడ్జింగ్ వంటి పనుల్లో అనుభవం ఉన్న వారికే పోర్టు నిర్మాణ బాధ్యతలు కట్టబెడతారు. కొచ్చిన్ పోర్టు ట్రస్ట్, న్యూ మంగళూరు పోర్టు ట్రస్ట్, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ వంటి సంస్థలన్నీ సాధారణంగా ఇలాంటి కాంట్రాక్టర్లకే పనులు అప్పగిస్తుంటాయి. కానీ ఏపీ మారిటైం బోర్డు చిత్రంగా ట్రాన్స్‌పోర్టేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, ఇరిగేషన్, ఇండస్ట్రీస్ రంగంలో అనుభవం ఉన్న కాంట్రాక్టర్లు కూడా టెండరులో పాల్గొనేలా వెసులుబాటు కల్పించింది. అస్మదీయులకు పోర్టు పనులు అప్పగించడం కోసమే ఇలా సడలింపులు చేసింది. పోర్టు నిర్మాణంలో ప్రధానమైన బ్రేక్ వాటర్, బెర్తుల నిర్మాణం, డ్రెడ్జింగ్ వంటి పనులను అనుభవం ఉన్న సబ్ కాంట్రాక్టర్లకు కట్టబెట్టేలా కూడా టెండరులో వెసులుబాటు కల్పించడం విడ్డూరం. ఏపీ మారిటైం బోర్డు పిలిచిన ఈపీసీ టెండర్లలో మేఘ ఇంజనీరింగ్ కంపెనీ, విశ్వసముద్ర హోల్డింగ్స్ ప్రైవేటు లిమిటెడ్ పాల్గొన్నాయి. మేఘ సంస్థకు సముద్రంలో నిర్మాణాలు చేసిన అనుభవమే లేదు. ఇక విశ్వసముద్ర కంపెనీ.. అదానీ కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ (గతంలో కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్)కు అనుబంధ సంస్థ. కేపీసీఎల్ టర్నోవర్‌ను తమ సంస్థ టర్నోవర్‌గా చూపి విశ్వసముద్ర టెండరులో పాల్గొనడం గమనార్హం. ఎలాంటి అనుభవం లేకున్నా మేఘకు పోర్టు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. చట్టవిరుద్ధంగా పోర్టు కాంట్రాక్టు నుంచి తొలగించడంపై నవయుగ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఆగమేఘాలపై పోర్టు కాంట్రాక్టును మేఘకు కట్టబెట్టేశారు.

'షీలాబిడే' సిఫారసులు అమలు చేయాలి

» కేంద్రానికి లేఖ రాద్దాం: మంత్రి నారాయణ

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్‌లో ఉన్న ఉమ్మడి ఆస్తులకు సంబంధించి షీలా బిడే కమిటీ సిఫారసులను అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాద్దామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. శనివారం సీఆర్‌డీఏ కార్యాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు కూడా ముగిసింది. అయినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజన ఇంకా పూర్తి కాలేదు. ఇప్పటికే వేల కోట్ల విలువైన ఆస్తులున్న సంస్థల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతోంది. ముఖ్యంగా తొమ్మిదో, పదో షెడ్యూల్‌లో ఉన్న సంస్థల మధ్య విభజన ఇంకా ఒక కొలిక్కి రావడం లేదు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు జనాభా ప్రాతిపదికన ఆస్తులు, అప్పులు పంపిణీ చేసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత పంపకాల విషయంలో ఎక్కడ ఉన్నవి ఆ రాష్ట్రానికే చెందాలని తెలంగాణ ప్రభుత్వం కొత్తవాదన తెరపైకి తెచ్చింది. ఇప్పటికే కొన్ని సంస్థల విషయంలో పీటముడి వీడటం లేదు. ఇలాంటి సంస్థల్లో కొన్ని మున్సిపల్ శాఖకు చెందినవి కూడా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఏపీ హౌసింగ్ బోర్డు లెక్కల ప్రకారం తెలంగాణ నుంచి సుమారు రూ.5,170 కోట్లు ఏపీకి రావాల్సి ఉంది. ఆయా సంస్థల ఆస్తులకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టులో ఉన్న కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. సమీక్షలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారి 'కాలజ్ఞానం'!

(మొదటి పేజీ తరువాయి)

తూర్పుగోదావరి కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలతా రెడ్డి ఆయన కంటే రెండాకులు ఎక్కువే చదువుకున్నారు. ఇసుక రీచ్‌లు తనిఖీ చేయాలని ఫిబ్రవరి 5న ఎన్జీటీ ఆదేశాలు ఇవ్వగా... మూడు రోజుల ముందే ఫిబ్రవరి 2వ తేదీన తనిఖీ చేసినట్లుగా నివేదిక పంపి 'కాలజ్ఞాన' ప్రతిభ చూపారు. ఇదెలా సాధ్యమైంది? ఎన్జీటీ నుంచి ఇలాంటి ఆదేశాలు వస్తాయని ముందే ఏమైనా ఊహించారా? లేక కలగన్నారా? ఆ విషయం ఆమెకే తెలియాలి. ఒకవేళ ఎన్జీటీ ఆదేశాలు రావడానికి ముందే ఆమె ఇసుక రీచ్‌లను తనిఖీ చేసి ఉండొచ్చు. కానీ ఎన్జీటీ ఆదేశించిన తర్వాత విధిగా మరోసారి ఇసుక రీచ్‌లను తనిఖీ చేయాలి. కోర్టు ఆదేశం కాబట్టి, అందుకనుగుణంగా తనిఖీ చేసి తాజా నివేదిక ఇవ్వాలి. కానీ ఆమె అలా చేయలేదు. ఎప్పుడో తనిఖీ చేసిన ఫొటోలను అప్‌లోడ్ చేసి, ఎన్జీటీ ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లుగా నివేదికలో పేర్కొన్నారు. ఇది కోర్టును మోసం చేసినట్లు కాదా? ఇసుక తవ్వకాల్లో అక్రమాలే లేవని నివేదికలు ఇవ్వాలని నాటి గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది కలెక్టర్లకు లిఖితపూర్వక ప్రొఫార్మాలు పంపిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఇలాంటి చిత్రాలు బయటపడుతున్నాయి.

రూల్స్ తెలియవా?

ఇసుక అక్రమ తవ్వకాలపై గుంటూరుకు చెందిన దండ నాగేంద్ర ఎన్జీటీలో కేసు దాఖలు చేశారు. అక్రమ తవ్వకాలు జరిగాయని ఆయన పలు ఆధారాలు కోర్టుకు సమర్పించారు. అయితే, అవన్నీ అబద్ధాలే అని గనుల శాఖ అఫిడవిట్ వేసింది. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో సంబంధిత విభాగాల అధికారులతో సంయుక్త విచారణ కమిటీ (జాయింట్ ఇన్‌స్పెక్షన్) ఏర్పాటు చేయాలని ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఎన్జీటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు ఫిబ్రవరి 14లోగా తమకు తనిఖీ నివేదికలను అందించాలని సూచించింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు కలెక్టర్లు ఫిబ్రవరి 10-13 తేదీల మధ్య తనిఖీలు చేసి నివేదికలు పంపారు. గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డి ఫిబ్రవరి 14న తనిఖీ చేసి, అంతకు ఒకరోజు ముందుగానే అంటే.. 13వ తేదీనే ఎన్జీటీకి నివేదిక సమర్పించారు. ఇదెలా సాధ్యమో ఆయనకే తెలియాలి. ఎవరో తయారు చేసిన నివేదికపై ఆయన హడావుడిగా సంతకాలు పెట్టారని తెలుస్తోంది. మరోవైపు కమిటీ తనిఖీల్లో అక్రమాలు కనిపెట్టినా దాచిపెట్టారు. ఏ అక్రమాలూ లేవని నివేదిక పంపించారు. తూర్పుగోదావరి కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలత రెడ్డి ఎన్జీటీ ఆదేశాలు ఇవ్వకముందే ఫిబ్రవరి 2వ తేదీన ఇసుక రీచ్‌లను తనిఖీ చేసినట్లుగా నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలే జరగడం లేదని, గతంలో అక్రమ తవ్వకాలు జరిగిన ఆనవాళ్లు కూడా లేవని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్జీటీ కూడా పాయింట్ అవుట్ చేసింది. మరోవైపు గోదావరి నదిలో ఇసుక డ్రెడ్జింగ్ పనులు బోట్లు నడుపుకునేవారి ఇంటర్నల్ మ్యాటర్ అంటూ వ్యవస్థనే తప్పుదోవపట్టించే ప్రయత్నం చేశారు. నిజానికి ఎవరు ఇసుక డ్రెడ్జింగ్ చేయాలన్నా పర్యావరణ అనుమతులతో పాటు కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చే సీఓఈ, సీఓఓలు తప్పనిసరి. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆమెకు ఈ మాత్రం తెలియదనుకోవాలా?

నిజాలు దాచి నివేదిక

తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అనేక రీచ్‌ల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, భారీ యంత్రాలు వినియోగిస్తున్నారని గనుల శాఖ, రెవెన్యూ అధికారులు.. నాటి జిల్లా కలెక్టర్ మాధవీలతకు నివేదికలు ఇచ్చారు. వైసీపీ నేతల అండతో ఇసుక మాఫియా రెచ్చిపోతోందని, భారీ జేసీబీలతో నదిని గుల్లచేసి ఇసుక తోడేస్తున్నారని రెవెన్యూ అధికారులు నివేదించారు. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నుంచి కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్ (సీఓఓ), కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఓఈ)లు పొందకుండా డ్రెడ్జింగ్ పేరిట ఇసుక తవ్వుతున్నారని రెవెన్యూ అధికారులు పలు నివేదికలు ఇచ్చారు. కలెక్టర్‌గా మాధవీలత వీటిని బుట్టదాఖలు చేశారు. డ్రెడ్జింగ్ అనేది బోట్‌మెన్ ఇంటర్నల్ మ్యాటర్ అని దానిపై చర్చ జరగకుండా, ఎవరూ ఆరా తీయకుండా తప్పుదోవ పట్టించారు. అయితే, ఇదే అంశంపై కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నిపుణుల బృందం తూర్పుగోదావరి జిల్లాలోని పలు రీచ్‌లను తనిఖీ చేసింది. రెండు టన్నుల బకెట్ ఉన్న జేసీబీలతో ఇసుక తవ్వేస్తున్నారని, సగటున ఒక మీటర్ లోతు కంటే ఎక్కువే నదిలో తవ్వుతున్నారని, కిలోమీటర్ పరిధిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఎన్జీటీకి నివేదిక ఇచ్చారు. దీంతో కలెక్టర్ నివేదిక ఎంత గొప్పదో తేలిపోయింది.



ఏయూలో అవకతవకలు, అక్రమాలపై విచారణ చేపట్టాలని, వీసీని శిక్షించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు

మాజీ వీసీ ప్రసాదరెడ్డిని వదిలేదే లేదు

» ఏయూని భ్రష్టు పట్టించారు: ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించిన పీవీజీడీ ప్రసాదరెడ్డి పదవికి రాజీనామా చేసినా విడిచిపెట్టేది లేదు. ఐదేళ్లలో చేసిన అక్రమాలపై విచారణ జరిపించి శిక్ష పడేలా చేస్తాం' అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయనతో పాటు ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు ఏయూను సందర్శించారు. వీసీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంటా మాట్లాడారు. 'గడిచిన ఐదేళ్లలో వర్సిటీని ప్రసాదరెడ్డి వైసీపీ కార్యాలయంగా మార్చేశారు. ఇక్కడి నుంచే డబ్బు పంపిణీ, సర్వేల నిర్వహణ నిర్వహించారు. వీసీ ఎలా ఉండకూడదో ప్రసాదరెడ్డి ఉదాహరణగా నిలిచారు. వర్సిటీని సెంట్రల్ జైలు మాదిరిగా మార్చేశారు. రీ రీవాల్యుయేషన్ పేరుతో అడ్డగోలుగా దోచుకున్నాడు. వీటిన్నింటిపైనా సమగ్ర విచారణ చేయిస్తాం' అన్నారు ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడా జరగని అడ్డగోలు వ్యవహారాలు ఏయూలో ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. వీటిన్నింటిపైనా న్యాయ విచారణ జరిపిస్తాం. ఇంటర్ అర్హత కలిగిన మాజీ ఎంపీ ఎంవీవీకి.. పీహెచ్‌డీ పట్టాను ఇచ్చారు. చంద్రబాబును అరెస్టు చేశాడన్న కారణంతోనే ఐపీఎస్ అధికారి సునీల్‌కు పీహెచ్‌డీ ఇచ్చారు. రాబోయే ఐదేళ్లు ప్రసాదరెడ్డి శిక్ష అనుభవించక తప్పదు' అని అన్నారు.

దిగొచ్చిన ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

» విద్యార్థి సంఘాల ఆందోళనతో ఎట్టకేలకు రాజీనామా

» వైవీయూ వీసీ, రిజిస్ట్రారు కూడా..



ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్ చాంబర్‌కు తాళాలు వేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పెదకాకాని, కడప(ఎడ్యుకేషన్)/పులివెందుల, జేఎన్టీయూకే, జూన్ 29: వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ రాజశేఖర్ ఎట్టకేలకు తన పదవికి రాజీనామా చేశారు. వర్సిటీలో శనివారం టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాలు వీసీ చాంబర్‌కు తాళం వేయడంతో ఆయన దిగొచ్చి రాజీనామా చేసినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. 2019 సెప్టెంబరులో ఇన్‌చార్జి ఉపకులపతిగా నియమితులైన రాజశేఖర్, 2022 సెప్టెంబరు 28 నుంచి రెగ్యులర్ వీసీగా నియమితులయ్యారు. ఐదేళ్లు వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారన్న విమర్శలు వచ్చాయి. వర్సిటీలో జగన్, సజ్జల పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం మొదలు వైసీపీ ప్లీనరీ సమావేశాలకు వర్సిటీ ప్రాంగణాన్ని వాహనాల పార్కింగ్ కేటాయించే వరకు ఎన్నోరకాలుగా ఊడిగం చేశారు. ఇన్ని ఘనకార్యాలకు పాల్పడిన రాజశేఖర్, ఇంకా ఎలా కొనసాగుతారని వీసీ తీరును నిరసిస్తూ శనివారం టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాలు ఆందోళనబాట పట్టాయి. అనంతరం విద్యార్థులు వీసీ చాంబర్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం వీసీ చాంబర్‌కు తాళాలు వేశారు. దీంతో దిగివచ్చిన వీసీ రాజశేఖర్ తన పదవి రాజీనామా చేస్తూ గవర్నర్‌కు, ఉన్నతాధికారులకు లేఖ పంపించారు. ఈ ఆందోళనలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్‌యాదవ్, జనసేన అధ్యక్షుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు. ఇక, కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తన పదవికి సోమవారం రాజీనామా చేయనున్నట్లు వర్సిటీ పీఆర్వో సీహెచ్ సాయిబాబు శనివారం మీడియాకు తెలిపారు. అలాగే, యోగివేమన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, వైవీయూ నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లి వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కొనసాగిన వైఎస్ భారతి సమీప బంధువు సురేంద్రనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈయన తిరిగి మాతృసంస్థ అయిన వైవీయూలో ప్రొఫెసరుగా జాయిన్ అయ్యారు.

జీఏడీలో రిపోర్ట్ చేయాలని పాడా ఓఎస్డీకి ఆదేశం

వైసీపీ ప్రభుత్వంలో పాడా ఓఎస్డీగా ఉన్న అనిల్‌కుమార్‌రెడ్డిని జీఏడీలో రిపోర్టు చేయాలని శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, కడప ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని డీఈవో అనురాధ తెలిపారు.

ఆదిలాబాద్ మాజీ ఎంపీ.. రమేశ్ రాథోడ్ హఠాన్మరణం



రమేశ్ రాథోడ్

ఆదిలాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నేత రమేశ్ రాథోడ్(59) శనివారం మధ్యాహ్నం కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. 1999లో తొలిసారి టీడీపీ తరఫున ఖానాపూర్ ఎమ్మెల్యేగా, 2009లో ఆదిలాబాద్ ఎంపీగా గెలిచారు.

టీడీపీ కార్యాలయానికి జన ప్రవాహం



దివ్యాంగులు, అనారోగ్య బాధిత చిన్నారుల సమస్యలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

» తోపులాటలో చిక్కుకొన్న చంద్రబాబు

» వినతుల స్వీకరణకు త్వరలో ప్రత్యేక ఏర్పాటు



మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి భారీగా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయానికి శనివారం జన ప్రవాహం పోటెత్తింది. పార్టీ కార్యాలయంలో చోటు చేసుకొన్న తోపులాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కొద్దిసేపు చిక్కుకొన్నారు. ఆయన ప్రతి శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి సందర్శకులను, పార్టీ నాయకులను కలుస్తున్నారు. కొత్త ప్రభుత్వం కావడంతో ఆయన వచ్చినప్పుడు సందర్శకులు కొంత అధికంగానే వస్తున్నారు. ఈసారి శనివారం వారి సంఖ్య భారీగా పెరిగింది. వచ్చిన వారందరికీ ఒక పక్క విడిగా కుర్చీలు వేసి వరుస క్రమంలో ఆయనను కల్పించాలని పార్టీ కార్యాలయ నాయకులు అనుకొని ఏర్పాట్లు చేశారు. కాని ఆయనను కలుసుకొనే అవకాశం వస్తుందో లేదో అన్న ఆత్రుతతో వచ్చిన వారంతా ఒకేసారి తోసుకొని రావడంతో పార్టీ కార్యాలయంలో తొక్కిసలాట ఏర్పడింది. వందల మంది చంద్రబాబును చుట్టుముట్టి వినతులు, పుష్పగుచ్ఛాలు ఇవ్వాలని చూడటంతో ఆయన కూడా కొద్దిసేపు తొక్కిసలాటలో చిక్కుకుపోయారు. దీనితో సెక్యూరిటీ సిబ్బంది ఆయనను పై అంతస్థుకు తీసుకువెళ్లారు. సెక్యూరిటీని తోసుకొని కొందరు సందర్శకులు అక్కడకు వెళ్లారు. ఆయన అక్కడ నిలబడి వచ్చిన వారిని అందరినీ ఓపిగ్గా కలిసి మాట్లాడి పంపించారు. తోపులాటలో బాగా ఇబ్బంది పడ్డామని, ఈసారి ఆ పరిస్థితి రాకుండా చూడాలని కొందరు మహిళలు ఆయనతో చెప్పారు. ఆయన వారికి ఆమేరకు హామీ ఇచ్చారు. ఆయనను కలవడానికి వచ్చినవారు పార్టీ కార్యాలయం ఆవరణలో ఇంకా వందల మంది మిగిలిపోయారు. వీరిలో బృందాలుగా వచ్చిన వారి నుంచి కొందరు ప్రతినిధులను ఎంపిక చేసి పార్టీ నేతలు ఆయన వద్దకు పంపారు. వారి నుంచి ఆయన వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్య ఏమిటో తెలుసుకొన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు వందల సంఖ్యలో తరలివచ్చారు. తమకు సంబంధించిన 1,600 పోస్టులను మెగా డీఎస్సీలో కలిపారని, వాటి భర్తీని నిలిపివేయాలని కోరుతూ వారు వచ్చారు. 'మేం ఈ పోస్టుల్లో గత పది పదిహేను సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాం. మాలో రెండు మూడు వందల మందికి వయోపరిమితి కూడా దాటిపోయింది. డీఎస్సీ రాయడానికి కూడా అర్హత లేదు. డీఎస్సీలో మా పోస్టులు భర్తీ చేస్తే మేం రోడ్డున పడతాం. ఇంతకాలం మేం చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తూ వస్తున్నాం. మమ్మల్ని రోడ్డున పడవేయవద్దు. మమ్మల్ని కొనసాగించే మార్గం ఆలోచించండి. మమ్మల్ని అవే పోస్టుల్లో క్రమబద్ధీకరించండి' అని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై పరిశీలన చేయిస్తానని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా నుంచి మరి కొందరు ఉపాధ్యాయ అభ్యర్థులు వచ్చారు. తమ జిల్లాతోపాటు నాలుగు జిల్లాల్లో ఎస్జీటీ పోస్టులు బాగా తక్కువ చూపించారని, ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నా ఆ జిల్లాల అధికారులు వాటిని పంపలేదని వారు ఫిర్యాదు చేశారు. నోటిఫికేషన్ వెలువడే లోపు ఆ వివరాలు కూడా తెప్పించి వాటిని కూడా మెగా డీఎస్సీలో కలపాలని వారు విజ్ఞప్తి చేశారు. పోలవరం ముంపు మండలాల నుంచి కొందరు టీడీపీ కార్యకర్తలు వచ్చారు. కుక్కునూరు నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి బాగా దెబ్బతినిపోయిందని, తాము అన్ని పనులకు అక్కడకే వెళ్లాల్సి ఉన్నందువల్ల ఆ రహదారిని బాగు చేయాలని కోరుతూ వారు ఒక వినతిపత్రం చంద్రబాబుకు అందచేశారు.



సమస్యలు పేరుకుపోయే..: చంద్రబాబు

గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు అనేక సమస్యలు పేరుకుపోయి ఇప్పుడు వాటి పరిష్కారం కోసం ప్రజలు పోటెత్తుతున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయం నుంచి తిరిగి వెళ్లే సమయంలో ఆయన కొద్దిసేపు మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. 'ఐదేళ్లుగా ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో వస్తున్న విజ్ఞాపనలు చూస్తే అర్థమవుతోంది. తమ బాధలు చెప్పుకోవడానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సమస్యలు చాలా ఉన్నాయి. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రజల ఇబ్బందులు చూస్తే బాధ కలుగుతోంది. మమ్మల్ని కలుసుకోవడానికి వచ్చే వారు తమ వినతులు ఇవ్వడానికి ఒక ప్రత్యేక వేదికను త్వరలో ఏర్పాటు చేస్తాం. పార్టీ కార్యాలయంలో కూడా వినతులు తీసుకొని వాటికి త్వరగా పరిష్కారం లభించేలా చూడటానికి వచ్చే వారం నుంచి ప్రత్యేక చర్యలు తీసుకొంటాం' అని ఆయన చెప్పారు. దెబ్బ తిన్న రోడ్లతో వర్షాకాలంలో బాగా ఇబ్బంది వస్తోందని కొందరు మీడియా ప్రతినిధులు చెప్పినపుడు... 'ఈ విషయం మా దృష్టిలో ఉంది. గుంతలు పూడ్చే పనిని త్వరలో చేపడతాం. వర్షాకాలంలో తాత్కాలిక మరమ్మతులు చేసి వానలు ముగిసిన తర్వాత పూర్తి స్థాయి మరమ్మతులు చేపడతాం' అని చంద్రబాబు తెలిపారు.

'పది' పాట్లు..!

» మార్కెట్లో రూ.10 నోట్లకు కొరత

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)



మార్కెట్‌లో చిల్లర కష్టాలు పెరిగాయి. 5, 10 రూపాయల కొరత పెరిగిపోతోంది. వ్యాపారులు, వినియోగదారుల మధ్య 'చిల్లర' రచ్చకు దారితీస్తోంది. మార్కెట్లోకి పది రూపాయల నాణేలు వచ్చినప్పటికీ.. వాటిని ఎవరూ స్వీకరించడం లేదు. మరోవైపు పది నోట్లను సరఫరా చేయలేక బ్యాంకర్లు చేతులెత్తేస్తున్నారు. ఆర్బీఐ నుంచి సరఫరా లేనప్పుడు తామేం చేస్తామని చెబుతున్నారు. మార్కెట్‌లో పదుల కొరత ఏడాదిగా కొనసాగుతోంది. నోట్ల రద్దు తర్వాత పరిస్థితి గాడిన పడుతుందనుకున్న సమయంలో చిన్న నోట్ల కొరత పెరుగుతుండడం తో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. టీ స్టాల్స్, కిరణా షాపుల్లో వ్యాపారమంతా రూ.10తోనే మొదలవుతుంది. పెద్దమొత్తం బిల్లులకు పెద్దనోట్లు ఇచ్చినప్పుడు ఎలాంటి సమస్య ఉత్పన్నం కావడం లేదు. చిన్న చిన్న బేరాల విషయంలో మాత్రం వివాదాలు జరుగుతున్నాయి. సాధారణంగా కొత్త కరెన్సీని ఆర్బీఐ విడుదల చేసినప్పుడు బ్యాంకుల వద్ద నుంచి.. రూ.5, రూ.10, రూ.20, రూ.50నోట్లను తీసుకుని భద్రపరుచుకుంటారు. ఐదు రూపాయల నోట్ల ముద్రణ ఆగిపోయిన తర్వాత నాణేలు మనుగడలోకి వచ్చాయి. వాటి లభ్యత కూడా క్రమంగా తగ్గుతోంది. ఆర్‌బీఐ పది రూపాయల నోట్లతో పాటు నాణేలు కూడా మార్కెట్లోకి విడుదల చేసింది. కానీ, నోట్లలో జరిగినన్ని లావాదేవీలు నాణేలతో జరగడం లేదు. పది రూపాయలు చిల్లర ఇవ్వాల్సిన స్థానంలో నాణేలు ఇస్తుంటే వినియోగదారులు గానీ, వ్యాపారస్థులుగానీ తీసుకోవడం లేదు. దీంతో సమస్య తీవ్రమవుతోంది.

వ్యతిరేకించడం నేరం: ప్రసాద్, న్యూమిస్మ్యాటిక్

ఆర్‌బీఐ ముద్రించిన కరెన్సీని వ్యతిరేకించడం నేరమని న్యూమిస్మ్యాటిక్ నిపుణుడు ప్రసాద్ అన్నారు. వ్యతిరేకించిన వారిపై చర్యలు తీసుకునే అధికారం ఆర్‌బీఐకి ఉందన్నారు. 'అన్ని రాష్ట్రాల్లోను పది రూపాయల నాణేల చలామణి అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు దీనిపై అపోహలున్నాయి. ఐదు రూపాయల నాణేలు విడుదలైన కొత్తలో నకిలీ నాణేలు బయటకు వచ్చాయి. ఇప్పుడు పది రూపాయల నాణెం విషయంలోనూ అదే అనుమానాలున్నాయి. ప్రజల్లో ఈ నాణెం మనదేశానిది కాదన్న భావన ఉంది' అని ప్రసాద్ చెప్పారు. మార్కెట్లో పది రూపాయల నోట్ల కొరత ఉన్నమాట వాస్తవమేనని, దీనికి ఆర్‌బీఐ కారణమని మరో న్యూమిస్మ్యాటిక్ నిపుణుడు రామకృష్ణ అన్నారు. పది రూపాయల నాణేలను చలామణిలోకి తీసుకురావడం కోసం హైదరాబాద్‌లోని ఆర్‌బీఐ రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.10 నోట్ల సరఫరాను బాగా తగ్గించిందని వెల్లడించారు.

డీఎస్ ఇకలేరు



» హైదరాబాద్‌లోని నివాసంలో గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నేత డీ శ్రీనివాస్ కన్నుమూత

నిజామాబాద్, హైదరాబాద్, అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి, మాజీ ఎంపీ, ఉమ్మడి రాష్ట్రానికి పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) ఇకలేరు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. ఆయన వయసు 75 ఏళ్లు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు. చిన్న కుమారుడు అర్వింద్, బీజేపీ పార్టీ తరఫున రాజకీయాల్లో ఉన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి ఎంపీగా గెలుపొందారు. 'ట్రబుల్ షూటర్‌'గా పేరున్న డీఎస్, ఉమ్మడి రాష్ట్రంలో 2004, 2009లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుకావడంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి విశేషంగా కృషి చేశారు. సోనియా గాంధీకి విధేయుడిగా కొనసాగిన ఆయన 2004లో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు. నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్‌లో 1948 సెప్టెంబరు 27న డీఎస్ జన్మించారు. కాంగ్రెస్ మాజీ మంత్రి అర్గుల్ రాజారాం శిష్యుడిగా 1981లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. నిజామాబాద్ అర్బన్ స్థానం నుంచి 1989, 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వైఎస్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2011లో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. 2015 జూలై 2న బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 2016 నుంచి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. నిరుడు బీఆర్ఎస్‌ను వీడి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. తీవ్ర అనారోగ్యంతో పూర్తిగా పరిమితమయ్యారు.

డీఎస్, రాథోడ్ మృతికి సీఎం సంతాపం

మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మృతికి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తంచేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కాగా, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతిపట్ల చంద్రబాబు వేరొక ప్రకటనలో సంతాపం తెలిపారు.

డిఎస్ మరణం బాధాకరం: పవన్

మాజీ మంత్రి డి.శ్రీనివాస మరణం బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బలంగా తన వాదం వినిపించారన్నారు. జనసేన పార్టీ ఎదుగుదలను ఆకాంక్షించారని తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. అతని కుమారుడు లోక్ సభ సభ్యులు ధర్మపురి అరవింద్‌కు, అతని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సీఐడీకి రేషన్ మాఫియా కేసు

» కాకినాడ నుంచి ఆఫ్రికా దేశాలకు భారీగా బియ్యం ఎగుమతులు

» వేల కోట్ల కుంభకోణం వెనుక మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి: మంత్రి నాదెండ్ల

» 2వ రోజు కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఆకస్మిక తనిఖీలు

» రెండు రోజుల్లో 12,915 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్



కాకినాడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): 'కాకినాడ కేంద్రంగా వ్యవస్థీకృతమైన రేషన్ బియ్యం మాఫియాలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం ఉంది. పోర్టును ఆక్రమించి భారీ అక్రమాలకు పాల్పడింది. కాకినాడ నుంచే రేషన్ మాఫియా ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రెండోరోజు శనివారం కాకినాడ పోర్టులో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికాలో వివిధ పేద దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసి రూ.వేల కోట్లు సంపాదించారు. రెండు రోజులపాటు వివిధ బియ్యం గోదాములు తనిఖీలు చేసి 12,915 టన్నులు బియ్యాన్ని సీజ్ చేశాం. లావన్ ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్, విశ్వప్రియ, సరళ ఫుడ్స్, సార్టెక్స్ ఇండియా, పీఎస్ రాజు, అశోకా, హెచ్1 గోదాముల నుంచి బియ్యం సీజ్ చేశాం. ఈ రేషన్ మాఫియాను పూర్తిగా ఛేదించే దిశగా సీఐడీకి అప్పగిస్తాం. సీఐడీ ద్వారా ఈ మాఫియా అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. పేదల బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ రూ.వేల కోట్లు సముపార్జించిన వారిని వదిలిపెట్టబోం. వ్యవస్థీకృత మాఫియా ఆటకట్టిస్తాం. యాంకరేజ్ పోర్టులో షిప్పింగ్ పనులను నిలుపుదల చేయాలని అధికారులను ఆదేశించాం. పోర్టు అధికారులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్ల అప్పులు మిగిలాయి. రైతులకు రూ.1,600 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉండగా తొలిదఫా రూ.వెయ్యి కోట్లు చెల్లిస్తాం. నాలుగైదు రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ అవుతాయి' అని వివరించారు. తనిఖీల సందర్భంగా కీలక సమచారంపై దృష్టి సారించని పోర్టు అధికారుల తీరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 30 జూన్ 2024

మరోసారి హిట్ కాంబో?




మరోసారి వెబ్‌సిరీస్‌లో మెరిసేందుకు సిద్ధమవుతున్నారట సమంత. ఆమెతో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సీటాడెల్: హనీ బన్నీ' సిరీస్‌ను తెరకెక్కించిన రాజ్ అండ్ డీకే కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సిరీస్ తెరకెక్కుతోందని బాలీవుడ్ టాక్. ఆగస్టులో ఈ సిరీస్ చిత్రీకరణ ప్రారంభంకానుందనిచెబుతున్నారు. యాక్షన్ ఓరియంటెడ్ సిరీస్ కావడంతో సమంత ఇప్పటికే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ మొదలుపెట్టారట. ఇందులో సమంత లీడ్‌రోల్‌లో నటించనున్నారు. బాలీవుడ్ నటుడు ఆదిత్యారాయ్ కపూర్ కీలకపాత్రపోషించనున్నారు. ఈ వెబ్ సిరీస్‌కు 'రక్త్‌బీజ్' అనే టైటిల్‌ను ఖరారుచేసినట్లు బాలీవుడ్ మీడియా చెబుతోంది. మయోసైటిస్ బారిన పడిన సమంత ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఆమె నటించిన 'సిటాడెల్:హనీ బన్నీ' సిరీస్ త్వరలోనే ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. సమంత తన సొంత బేనర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పై 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించారు.

పొరపాటే... దిద్దుకున్నాను

ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు కొన్ని పాడ్‌కాస్ట్ వీడియోలు చేస్తున్నారు సమంత. అయితే గతంలో కొన్ని అనారోగ్యకరమైన ఉత్పత్తులకు ప్రచారకర్తగా పని చేసిన మీరు ఇప్పుడు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించే నైతిక హక్కు ఉందా అని సమంతను ఓ నెటిజన్ ప్రశ్నించారు. దాంతో ఆరోగ్యానికి హానికరమైన ఉత్పత్తులకు ప్రచారకర్తగా పనిచేయడం పట్ల సమంత పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. గతంలో కొన్ని బ్రాండ్లకు ప్రచారం చేసి నేను పొరపాటు చేశాను. ఇప్పుడు ఆ తప్పును సరిదిద్దుకున్నాను. అలాంటి ఉత్పత్తులకు ప్రచారం చేయడం మానుకున్నాను అని తెలిపారు. ముందుగా నేను పాటించి, ఆ తర్వాతే ప్రజలకు చెబుతున్నాను అని చెప్పారు.

ఇండియన్ 2 మేకర్స్‌పై కాపీరైట్ కేసు



శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. వీరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'ఇండియన్' చిత్రానికి ఇది సీక్వెల్. సుభాస్కరన్ నిర్మాత. జూలై 12న 'భారతీయుడు 2' విడుదలవనుంది. అయితే ఇంకొన్ని రోజుల్లో సినిమా విడుదలనుండగా రాజేంద్రన్ అనే మర్మకళ నిపుణుడు 'ఇండియన్ 2' చిత్రం విడుదల కాకుండా ఆపేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. '1996లో 'ఇండియన్' చిత్రాన్ని తెరకెక్కించే సమయంలో మర్మకళకు సంబంధించిన కొన్ని ప్రయోగాలను కమల్‌హాసన్, శంకర్‌కు వివరంగా చెప్పాను. వాటి ఆధారంగా కొన్ని ఫైట్స్‌ను తెరకెక్కించారు. ఇప్పుడు ఆ చిత్రానికి వస్తున్న సీక్వెల్‌లోనూ నేను నేర్పించిన విద్యనే చూపించబోతున్నారని 'ఇండియన్ 2' ప్రోమో చూస్తే తెలిసింది. అయితే తొలి భాగం విడుదలైన సమయంలో టైటిల్ కార్డ్‌లో నా పేరు వేశారు, కానీ ఇప్పుడు 'ఇండియన్ 2'కు మాత్రం నాకు క్రెడిట్ ఇవ్వలేదు కాబట్టి 'ఇండియన్ 2' చిత్రం విడుదలపై స్టే ఇవ్వాలని మధురై న్యాయస్థానాన్ని అభ్యర్థించాడు. దీంతో న్యాయస్థానం శంకర్, కమల్‌హాసన్, సుభాస్కరన్‌కు కాపీరైట్ నోటీసులు పంపింది. తదుపరి విచారణను జూలై 9కి వాయిదా వేసింది.

మూడు హిట్లు ఆరు ఫ్లాపులు...

తెలుగు సినిమా ఆరు నెలల ప్రోగ్రెస్ రిపోర్ట్





ఏ సినిమా విజయానికి అయినా ఫస్ట్ హాఫ్ అనేది చాలా కీలకం. ఈ ఫస్ట్ హాఫ్ సెంటిమెంట్ ఇండస్ట్రీకి కూడా వర్తిస్తుంది. ఒక ఏడాదిలో ఎన్ని సినిమాలు విడుదలయ్యాయి.. అందులో ఎన్ని విజయం సాధించాయి అన్న దాన్ని బట్టి ఆ ఇండస్ట్రీ సక్సెస్ రేంజ్ ఆధారపడి ఉంటుంది. ఈ ప్రథమార్థంలో సంక్రాంతి సీజన్, సమ్మర్ సీజన్‌లో రిలీజైన సినిమాలు ఎన్నో సార్లు ఇండస్ట్రీ హిట్స్‌గా నిలిచి.. సినీ రంగానికి జోష్‌నిచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలా ఏడాది మొత్తం ఇండస్ట్రీ విజయపథంలో ప్రయాణించాలంటే ఫస్ట్ హాఫ్‌లో వచ్చిన సినిమాలు.. వాటి ఫలితాలు చాలా కీలకం. అలా ఈ ఏడాది రిలీజైన సినిమాలు.. అవి బాక్సాఫీస్ దగ్గర ఏ మేర రాణించాయో తెలుసుకుందాం.

జనవరితో జోష్

జనవరి నెలలో సంక్రాంతి సీజన్‌తో సినిమాల హడావుడి మొదలవుతుంది. అగ్ర హీరోల చిత్రాలు ఒకదానితో ఒకటి సై అంటూ బాక్సాఫీస్ దగ్గర పోటీపడడంతో మొదలవుతుంది. అప్పుడప్పుడూ చిన్న హీరోల చిత్రాలు.. ప్రయోగాత్మక చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టం పరీక్షించుకుంటుంటాయి. అలా ఈ ఏడాది సంక్రాంతి బరిలో పలు అగ్ర హీరోల చిత్రాలు.. కుర్ర హీరోల చిత్రాలూ విడుదలయ్యాయి.

మహేశ్‌బాబు 'గుంటూరు కారం', నాగార్జున 'నా సామి రంగా', వెంకటేశ్ 'సైంధవ్', తేజ సజ్జా 'హనుమాన్' రిలీజ్ అయ్యాయి. వీటిలో 'హను-మాన్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎటువంటి స్టార్ కాస్టింగ్ లేకుండా కేవలం రూ. 40 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 330 కోట్లు కలెక్ట్ చేసి పాన్ ఇండియా స్థాయిలో సత్తా



చాటి.. టాలీవుడ్ రికార్డ్స్‌ను కూడా బ్రేక్ చేసింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో మొదటి చిత్రంగా తెరకెక్కిన 'హను-మాన్'కు కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

'అతడు', 'ఖలేజా' సినిమాల తర్వాత మళ్లీ 15 ఏళ్లకు మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన 'గుంటూరు కారం' బాక్సాఫీస్ దగ్గర రూ. 171 కోట్లు కలెక్ట్ చేసి హిట్ సాధించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మలయాళం సినిమా 'పొరింజు మరియమ్ జోస్'కు రీమేక్‌గా తెరకెక్కిన 'నా సామి రంగా' బాక్సాఫీస్ వద్ద డీసెంట్ హిట్‌గా నిలవగా, 'సైంధవ్' అంచనాలను అందుకోలేకపోయింది. ఇక రిపబ్లిక్ డేకి విడుదలైన 'ర్యాపిడ్ యాక్షన్ మిషన్', 'బిఫోర్ మ్యారేజ్' చిత్రాలు ఎప్పుడు థియేటర్లలోకి వచ్చాయో వెళ్లాయో కూడా ప్రేక్షకులకు తెలియలేదు.

ప్రేమికుల నెలలో...

ఫిబ్రవరిలో కూడా బాక్సాఫీస్ దగ్గర పెద్ద చిత్రాలు, చిన్న చిత్రాలు సందడి చేశాయి. మొదటివారంలో రిలీజైన చిత్రాల్లో 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు', ప్రేక్షకులని మెప్పించగా.. 'బూట్‌కట్ బాలరాజు', 'గేమ్ ఆన్', 'కిస్మత్' చిత్రాలు నిరాశపరిచాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రవితేజ నటించిన 'ఈగల్' 9న విడుదలైంది. స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఎన్నో అంచనాలతో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. రిలీజ్‌కు ముందే 'నిజమే నే చెబుతున్నా' అనే పాటతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన 'ఊరి పేరు భైరవకోన' 16న విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మతో వి.ఐ ఆనంద్ తెరకెక్కించిన ఈ ఫ్యాంటసీ డ్రామా అంచనాలను నిలబెట్టుకుని ఫిబ్రవరిలో రిలీజైన చిత్రాల్లో టాప్ హిట్‌గా నిలిచింది. ఈ నెల చివరలో విడుదలైన వాటిలో వైవా హర్ష టైటిల్ పాత్రలో నటించిన 'సుందరం మాస్టర్' క్లాస్ హిట్‌గా నిలిచింది.

పరీక్షల మాసం 'మార్చి'లో...

మార్చి మొదటి వారంలో వరుణ్‌తేజ్ 'ఆపరేషన్ వాలంటైన్', 'భూతద్దం భాస్కర్ నారాయణ', వెన్నెల కిశోర్ 'చారి 111' వంటి చిత్రాలు రిలీజైనా ఒక్కటీ ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయాయి. శివరాత్రి సందర్భంగా రెండో వారంలో గోపీచంద్ 'భీమా', విష్వక్ సేన్ 'గామి' చిత్రాలు ప్రేక్షకులను పలకరించాయి. 'గామి' విమర్శకుల ప్రశంసలందుకొని ప్రయోగాత్మక చిత్రంగా నిలిచింది. పుష్కలమైన మాస్ అంశాలతో తెరకెక్కిన సెమీ ఫ్యాంటసీ యాక్షన్ డ్రామా 'భీమా'ను ప్రేక్షకులు తిరస్కరించారు. మూడోవారంలో 'షరతులు వర్తిస్తాయి', 'వెయ్ దరువెయ్' 'రజాకార్', 'లంబసింగి' వంటి చిన్న చిత్రాలు రిలీజై పరాజయం బాట పట్టాయి.



నాలుగోవారంలో రిలీజైన 'ఓం భీమ్ బుష్' హిట్‌గా నిలిచింది. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ నటించిన ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులని నవ్వించింది. ఆఖరి వారంలో రిలీజైన 'టిల్లు స్క్వేర్' మార్చిలోనే అతి పెద్ద విజయాన్ని నమోదు చేసుకోవడమే కాక.. వంద కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ, లిల్లీగా అనుపమా తెరపై సందడి చేయగా.. మొదటి భాగం 'డీజే టిల్లు'లో రాధిక పాత్ర పోషించి సూపర్ ఫాలోయింగ్ సంపాదించుకున్న నేహా శెట్టి.. ఇందులోనూ అతిథి పాత్రలో తళుక్కుమని థియేటర్లలో విజిల్స్ వేయించుకున్నారు.

సెలవుల మాసం 'ఏప్రిల్'లో


ఏప్రిల్ మొదటి వారంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన 'ఫ్యామిలీ స్టార్'



విడుదలైంది. ఎన్నో అంచనాలతో, సూపర్ సక్సెస్ గ్యారంటీ అనుకున్న ఈ చిత్రం ఊహించని స్థాయిలో బాక్సాఫీస్ వద్ద పరాజయాన్ని చవిచూసింది. రెండో వారంలో 'గీతాంజలి'కి కొనసాగింపుగా అంజలి నటించిన హారర్ కామెడీ 'గీతాంజలి మళ్లీ వచ్చింది' మొదటి భాగంలా విజయాన్ని నమోదు చేయలేకపోయింది. 'ఫ్యామిలీ స్టార్' సినిమా మినహా ఏ పెద్ద చిత్రం లేకపోవడంతో చిన్న సినిమాలు విడుదలకు క్యూ కట్టాయి. 'మార్కెట్ మహాలక్ష్మి', 'పారిజాత పర్వం', 'శ్రీరంగనీతులు' వంటి చిన్న సినిమాలు విడుదలైనా.. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించలేకపోయాయి.

ముండుటెండల 'మే'లో...

మే నెల సినిమాలకు చాలా కీలకం. సాధారణంగా పెద్ద హీరోల చిత్రాలు రిలీజ్ అయ్యే ఈ సీజన్‌లో ఈ సారి అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కనిపించింది.



మండుటెండలు, ఐపీఎల్ హవా, ఎలక్షన్ల హడావుడి, చిత్రీకరణల్లో జాప్యం ఇందుక్కారణం.

చిన్న చిత్రాలు క్యూ కట్టినా ఏ ఒక్కటీ విజయతీరాలకు చేరలేదు. మొదటి రెండు వారాల్లో విడుదలైన 'ప్రసన్నవదనం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'కృష్ణమ్మ', 'ఆరంభం', 'ప్రతినిధి 2' చిత్రాల్లో కొన్ని అంతో ఇంతో ఆకట్టుకున్నా.. ఐపీఎల్ హంగామా, ఎలక్షన్ల హడావుడి వల్ల కలెక్షన్లు రాబట్టలేకపోయాయి. మే మూడో వారంలో విడుదలైన 'రాజు యాదవ్', 'లవ్ మీ' చిత్రాలు అంచనాలను అందుకోలేక బోల్తాపడ్డాయి. ఆఖరి వారంలో రిలీజైన 'భజేవాయువేగం', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', 'గం గం గణేశా' చిత్రాల్లో ఒక్కటీ కూడా కమర్షియల్ హిట్ కాలేదు. అలా మే నెల అంతా హిట్ లేక ఇండస్ట్రీ వెలవెలబోయింది.

చిరుజల్లుల 'జూన్'లో

'మనమే' చిత్రంతో ఓ డీసెంట్ హిట్ కొట్టారు శర్వానంద్. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించిన ఈ చిత్రం థియేటర్లకు ప్రేక్షకులని రప్పించగలిగింది. నవదీప్ హీరోగా యూత్‌ని టార్గెట్ చేసి తీసిన బోల్డ్ మూవీ 'లవ్ మౌళి' బాక్సాఫీస్ దగ్గర విఫలమైంది. టీజర్, ట్రైలర్‌తో విపరీతమైన బజ్ క్రియేట్ చేసిన 'హరోం హర' రిలీజ్ అయ్యాక ఆ క్రేజ్‌ను క్యాష్ చేసుకోలేకపోయింది. చాందిని చౌదరి నటించిన 'యేవమ్', 'మ్యూజిక్ షాప్ మూర్తి'కి కూడా నిరాశ తప్పలేదు. మూడో వారంలో వరుణ్ సందేశ్ నటించిన 'నింద' డేసెంట్ టాక్ తెచ్చుకోగా.. అదే రోజు విడుదలైన 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్', 'ఓ మంచి ఘోస్ట్', 'అంతిమ తీర్పు' చిత్రాలు ఎలాంటిబాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ప్రభావం చూపించలేకపోయాయి. ఇక అందరినీ ఎంతో కాలంగా ఊరించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం నాలుగో వారంలో విడుదలై బాక్సాఫీస్ వద్ద




కలెక్షన్ల సునామీని సృష్టిస్తోంది. కొన్నాళ్లుగా ఖాళీగా దర్శనమిచ్చిన థియేటర్లను హౌస్‌ఫుల్ బోర్డ్‌లతో కిటకిటలాడించింది. మొదటిరోజే ఈ సినిమా ఏకంగా 191 కోట్లు సాధించడమే కాకుండా ప్రీ బుకింగ్స్‌లోనూ సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ప్రభాస్‌కు 'బాహుబలి' తర్వాత ఇన్నేళ్లకు ఈ రేంజ్ హిట్ దక్కగా.. కెరీర్ తొలినాళ్లలో యాంగ్రీ యంగ్ మ్యాన్‌గా ఆకట్టుకున్న అమితాబ్‌బచ్చన్‌ను ఇన్నేళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకులకు పరిచయం చేశారని దర్శకుడు నాగ్ అశ్విన్ కితాబులందుకున్నారు.

డబ్బింగ్ చిత్రాల హవా

తెలుగు ప్రేక్షకులు భాషతో సంబంధం లేకుండా సినిమాని చక్కగా ఆదరిస్తారని మరోసారి నిరూపించుకున్నారు. మలయాళం సినిమాలు 'ప్రేమలు', 'ద గోట్ లైఫ్' 'ఆడుజీవితం', 'మంజుమ్మెల్ బాయ్స్', విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం 'మహారాజ' సినిమాలు ఇందుకు ఉదాహరణ. ఇవి థియేటర్లలో చక్కటి కలెక్షన్లు సొంతం చేసుకున్నాయి.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు







ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
స్ప్రింట్	వెబ్‌సిరీస్	జూలై 02
బెవర్లీహిల్స్ కాప్	హాలీవుడ్ మూవీ	జూలై 03
ద మ్యాన్ విత్ థౌజండ్ కిడ్స్	వెబ్‌సిరీస్	జూలై 03
బార్బెక్యూ షో డౌన్	రియాలిటీ షో	జూలై 04
అమెజాన్ ప్రైమ్		
గరుడన్	తమిళ చిత్రం	జూలై 03
బాబ్ మార్లే	హాలీవుడ్ మూవీ	జూలై 03
స్పేస్ క్యాడెట్	హాలీవుడ్ మూవీ	జూలై 04
మీర్జాపూర్ 3	హిందీ సిరీస్	జూలై 05
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
రెడ్ స్వాన్	కొరియన్ సిరీస్	జూలై 03
సోనీ లివ్		
మలయాళీ ఫ్రమ్ ఇండియా	మాలయాళ చిత్రం	జూలై 05
బుక్ మై షో		
ఇఫ్	హిందీ డబ్బింగ్	జూలై 03
ఫ్యూరియోసా	తెలుగు డబ్బింగ్	జూలై 04
ది సీడింగ్	తెలుగు డబ్బింగ్	జూలై 05
జియో సినిమా		
ప్రైమ్ టైమ్ విత్ మూర్తీస్	కామెడీ షో	జూలై 03
హీ వాంట్ దట్ వే	హాలీవుడ్ మూవీ	జూలై05
మనోరమా మ్యాక్స్		
మందాకిని	మలయాళ చిత్రం	జూలై 05

జాతకం చూసే అవకాశం ఇచ్చారా?

ఫ్లాష్‌బ్యాక్



ఎన్టీఆర్ తర్వాత జానపద చిత్రాల కథానాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు కాంతారావు. ఆయన నటించిన జానపద చిత్రాలు తమిళంలోనూ మంచి విజయం సాధించాయి. 'జూనియర్ ఎమ్జీఆర్' కాంతారావుని అక్కడ పిలిచేవారు. కాంతారావు, జానపద బ్రహ్మ విఠలాచార్యది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. ఒకరకంగా చెప్పాలంటే జానపద హీరోగా కాంతారావు పేరు తెచ్చుకోవడానికి ప్రధాన కారకులు విఠలాచార్యే. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి జానపద చిత్రం 'జయవిజయ'. కాంతారావు 'సతీ సుకన్య' చిత్రంలో ఉండగా ఒకరోజు విఠలాచార్య సెట్‌కు వచ్చి 'మనం చేసిన సోషల్ పిక్చర్ 'కన్యాదానం' ఆడలేదు. ఇప్పుడు ఓ జానపద చిత్రం తీయాలనుకుంటున్నాను. ప్రస్తుతం 'సిపాయి కూతురు' చిత్రంలో హీరోగా నటిస్తున్న సత్యనారాయణ నా దృష్టిలో ఉన్నాడు. ఎన్టీఆర్‌లా పొడుగ్గా ఉన్నాడు. బాగున్నాడు. నీ గురించి కూడా ఆలోచిస్తున్నాను. నీ జాతకం, సత్యనారాయణ జాతకం పరిశీలించి, మీ ఇద్దరిలో ఒకరిని హీరోగా తీసుకుంటాను' అన్నారు విఠలాచార్య. ఇది జరిగిన కొన్ని రోజులకు సత్యనారాయణ నటించిన 'సిపాయి కూతురు' విడుదలై ఫ్లాప్ అయింది. దీంతో జాతకం చూడకుండానే కాంతారావుని హీరోగా ఎంపిక చేసి 'జయవిజయ' చిత్రాన్ని నిర్మించారు విఠలాచార్య. 1959 లో విడుదలైన ఆ చిత్రంతో జానపద హీరోగా కాంతారావు కెరీర్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కృష్ణకుమారి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించారు. అలాగే జానపదబ్రహ్మగా విఠలాచార్య విజృంభణ 'జయవిజయ'తో మొదలైంది.

జుహీ చావ్లా తొలి తెలుగు చిత్రం



హీరో కృష్ణ దర్శకత్వం వహించిన మూడో చిత్రం 'కలియుగ కర్ణుడు'. తన సొంత సంస్థకు కాకుండా ఒక బయటి నిర్మాత తీసే చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకు అదే ప్రథమం. విజయవాడలో అప్సర థియేటర్ యజమాని డి.కాశీవిశ్వనాథరావుతో తనకున్న అనుబంధం కారణంగానే కృష్ణ ఈ సినిమా అంగీకరించారు. అంతకుముందు తనతో 'వజ్రాయుధం' సినిమా తీయాలనుకున్న కాశీవిశ్వనాథరావు తప్పనిసరి పరిస్థితుల్లో చివరి క్షణంలో పక్కకు తప్పుకోవడంతో ఆయనకు మరో సినిమా చేయడం తన నైతిక బాధ్యతగా భావించి 'కలియుగ కర్ణుడు' సినిమాలో నటించారు కృష్ణ. అలాగే రమేశ్‌బాబు హీరో అయ్యాక తండ్రితో కలసి నటించిన తొలి సినిమా ఇదే. ఇందులో వీరిద్దరూ అన్నదమ్ములుగా నటించారు.

రమేశ్ సరసన జుహీ చావ్లా

ఈ సినిమాలో రమేశ్‌బాబు సరసన బాలీవుడ్ నటి జుహీ చావ్లా నటించింది. కాకపోతే పేరుతో తెలుగుదనం ఉండాలని ఇందులో ఆమె పేరుని 'మీనా'గా మార్చారు. (బాలనటి మీనా అప్పటికి హీరోయిన్ కాలేదు). 'సుల్తానత్' (1986) చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన జుహీ చావ్లా ఆ తర్వాత 'ప్రేమలోక' (1987) కన్నడ సినిమాలో నటించింది. ఆ సినిమా చూసి 'కలియుగ కర్ణుడు' లో హీరోయిన్‌గా ఎంపిక చేశారు కృష్ణ. ఈ సినిమా తర్వాత జుహీ చావ్లా పేరుతోనే 'విక్కీదాదా'(1989), శాంతి-క్రాంతి'(1991) సినిమాల్లో నాగార్జున సరసన ఆమె నటించింది. 'కలియుగ కర్ణుడు' చిత్రనిర్మాణ సమయంలోనే అమీర్‌ఖాన్, జుహీ చావ్లా జంటగా నటించిన 'ఖయామత్ సే ఖయామత్ తక్' హిందీ చిత్రం విడుదలై ఘనవిజయం సాధించడంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆమె అంటే క్రేజ్ ఏర్పడింది. అది 'కలియుగ కర్ణుడు' చిత్రానికి ప్లస్ అయింది.

అగ్రి డిప్లొమాలు

ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్ల గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ/ఎన్‌ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in



డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్‌ఆర్‌ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్‌ఈ/ఎన్‌ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్‌ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- ఆన్‌లైన్ కౌన్సెలింగ్ తేదీలను త్వరలో ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్‌ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్‌ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.

కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.10,000; విదేశీ విద్యార్థులకు రూ.20,000; ఇఫ్లూలో చదివిన/చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.15,000
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జూలై 1 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **ప్లేస్‌మెంట్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 1
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియ యూనివర్సిటీలో వర్క్‌షాప్



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్‌ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రో కంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.uceou.edu

కేంద్ర విభాగాల్లో ఎంటీఎస్, హవల్దార్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 8,326

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).... కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు/కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు: జనరల్ సెంట్రల్ సర్వీస్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్

1. మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) స్టాఫ్ (గ్రూప్-సి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్): **4,887 పోస్టులు**
2. హవల్దార్(గ్రూప్-సి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్): **3,449 పోస్టులు**

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి పోస్టులను అనుసరించి 18-25, 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: ఎంటీఎస్ ఖాళీలకు సెషన్-1, 2 కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా; హవల్దార్ ఖాళీలకు కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం:

సెషన్-1: న్యూమరికల్ అండ్ మేథమెటికల్ ఎబిలిటీ(20 ప్రశ్నలు/60 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్(20 ప్రశ్నలు/60 మార్కులు).

సెషన్-2: జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు/75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు/75 మార్కులు)

సీబీటీ వ్యవధి: ప్రతి సెషన్ 45 నిమిషాలు

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

కంప్యూటర్ ఆధాలిత పరీక్షలు: అక్టోబరు/నవంబరు

వెబ్‌సైట్: https://ssc.gov.in/

జాబ్ కార్నర్

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

1. ఫార్మసిస్ట్

అర్హత: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

2. అసిస్టెంట్ ఫార్మసిస్ట్

అర్హత: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: జూలై 1 నాటికి 37 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 4

స్థలం: హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.


వెబ్‌సైట్: www.lifecarehll.com/

HLL Lifecare Limited
(A Government of India Enterprise)

తెలంగాణలో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్

మొత్తం ఖాళీలు: 435

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్... రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



అర్హత: అభ్యర్థులు ఎంబీబీఎస్ లేదా దానికి సమానమైన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2025 జూలై 1 నాటికి 46 ఏళ్లు మించకూడదు

ఎంపిక: ఎంబీబీఎస్ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జూలై 2

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: https://mhsrb.telangana.gov.in/

లిటిల్స్

ప్రతిఫలాపేక్ష


ఒక రాజ్యంలో వేదమిత్రుడనే కవి ఉండేవాడు. అతను గొప్ప కవిత్వం రాసేవాడు, మంచి పండితుడు కూడా. కానీ అతను చాలా పేదవాడు. ఒకరోజు భట్టు అనే అతని స్నేహితుడు 'వేద మిత్రా.. నీ కవిత్వం అద్భుతంగా ఉంది. నువ్వు దీన్ని ఈ దేశపు రాజుగారికి వినిపిస్తే, నీకు పేదరికం అన్న మాటే తెలియదు' అన్నాడు. ఆ మాటలు విన్న వేద



మిత్రుడు రాజుగారిని దర్శనం చేసుకుని, తన కవిత్వం వినిపించాడు. దానికి రాజుగారు మెచ్చి ఎన్నో బహుమానాలు ఇవ్వడమే కాకుండా, తన ఆస్థానంలో ఉద్యోగం కూడా ఇచ్చారు. అలా కొన్నాళ్లు గడిచిన తర్వాత తనకు రాజాశ్రయం కోరమని సలహా ఇచ్చిన భట్టును కలిసి వేద మిత్రుడు ఇలా అన్నాడు 'మిత్రమా.. నేను రాజుగారి కొలువులో చేరిన తర్వాత ఇంతకు ముందులాగా కవిత్వం రాయలేక పోతున్నాను అంటున్నారు. నాకు కూడా అలాగే అనిపిస్తోంది. ఎందుకంటావు? అని అడిగాడు. దానికి భట్టు 'వేద మిత్రా.. రాజు గారి వద్ద ఉద్యోగం రాక ముందు నువ్వు విలువైన బహుమానాలు కోసం లేదా ఒకరి మెప్పు కోసం కవిత్వం రాయలేదు. నీ కవిత్వాన్ని సరస్వతీ దేవిని ధ్యానించి దేవికి పూజలాగా భావించి రాశావు. కానీ ఇపుడు నీ దృష్టి అంతా ఎలాంటి కవిత్వం రాస్తే రాజుగారు ఎంత గొప్ప బహుమానాలు ఇస్తారా అనే దాని మీదే ఉంది. చేసే పని నిరంతరం ప్రతిఫలం ఆశించి చేస్తూ ఉంటే దాని నాణ్యత తగ్గిపోతుంది'అని చెప్పాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే వేద మిత్రుడు మరలా మునుపటిలాగా సరస్వతీ దేవిని ధ్యానిస్తూ మంచి కవిత్వం రాశాడు.

దారి కనుక్కోండి





7 తేడాలు గుర్తించండి!

ఏవి ఎన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 346

3					4	7		5
	6				1	4		8
			8				6	
2	7						5	
1		5	2		6	8		4
	8						2	9
	3				2			
6		7	3				4	
8		2	1					7

సుడోకు - 345 సమాధానం

3	8	5	4	2	1	6	9	7
9	4	7	8	6	3	5	1	2
6	1	2	7	5	9	8	3	4
2	9	1	3	7	5	4	8	6
4	3	8	6	1	2	7	5	9
7	5	6	9	4	8	1	2	3
5	2	4	1	9	6	3	7	8
1	6	3	2	8	7	9	4	5
8	7	9	5	3	4	2	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.